ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 26, నవంబరు 2025

మార్కాపురంలో సంబరాలు

- ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టిన ప్రజలు
- ఎమ్మెల్యే కందులకు అభినందనలు
- పట్టణంలో భారీ బైక్ ర్యాలీ
- బాణసంచా కాల్చుతూ యువత సందడి

6


మార్కాపురంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

కల సాకారం!

మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా కావాలన్న పశ్చిమప్రాంత ప్రజల కల సాకారమైంది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వారి ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మొత్తం నాలుగు నియోజకవర్గాలతో జిల్లా ఏర్పడనుంది. అందులో రెండు డివిజన్లు ఉండనున్నాయి. తద్వారా ఉమ్మడి జిల్లాను నాటి వైసీపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా విభజించి చేసిన తప్పును ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం సరిచేసింది. ఇక అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలు తిరిగి ప్రకాశం జిల్లాలోకి రానున్నాయి. అలాగే దర్శి, అద్దంకి నియోజకవర్గాలను కలిపి అద్దంకి డివిజన్ ఏర్పాటు చేయనున్నారు. బుధవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో అధికార ముద్ర పడిన వెంటనే ప్రక్రియ మొదలుకానుంది.


ర్యాలీలో ఎమ్మెల్యే కందులను అభినందిస్తున్న ప్రజలు

మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా

నాలుగు నియోజకవర్గాలు, రెండు రెవెన్యూ డివిజన్లు

- పశ్చిమ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సీఎం చంద్రబాబు
- ప్రకాశంలోకి తిరిగి అద్దంకి, కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గాలు
- కొత్తగా అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్
- అందులోకి దర్శి నియోజకవర్గం
- మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు సీఎం ఆమోదం
- నేడు కేబినెట్ సమావేశంలో అధికార ముద్ర

ఒంగోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పశ్చిమప్రాంతంలోని మార్కాపురం, గిద్దలూరు, వైపాలెం, కనిగిరి నియోజకవర్గాలతో మార్కాపురం కేంద్రంగా జిల్లా ఆవిర్భవించనుంది. అందులో మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లు ఉంటాయి. వాటి పరిధిలో 21 మండలాలు ఉండనున్నాయి. గతంలో ఉమ్మడి జిల్లా నుంచి బాపట్ల జిల్లాలోకి వెళ్లిన అద్దంకి, నెల్లూరు జిల్లాలోకి వెళ్లిన కందుకూరు నియోజకవర్గాలు తిరిగి ఒంగోలు కేంద్రంగా ఉన్న ప్రకాశంలోకి చేరనున్నాయి. ఈ పరిధిలో ప్రస్తుతం ఒంగోలు రెవెన్యూ డివిజన్ ఉండగా గతం నుంచి డివిజన్ కేంద్రంగా ఉన్న కందుకూరు కలవడంతోపాటు కొత్తగా అద్దంకి డివిజన్ ఏర్పాటు కానుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతల సూచనలకు ప్రాధాన్యతనిస్తూ మంత్రివర్గ ఉపసంఘం ఈ మేరకు సిఫారసు చేసింది. వీటిపై విస్తృత కసరత్తు అనంతరం

మిగతా 6వ పేజీలో

నోబిడ్ సంకటం

రోడ్లపై పొగాకు రైతుల నిరీక్షణ

సీజన్ ముగిసే సమయం కావడంతో పడిగాపులు


రోడ్డుపై పొగాకు బేళ్లతో నిలిచి ఉన్న ట్రాక్టర్లు

పొదిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఈ సీజన్ పొగాకు కొనుగోళ్లు పూర్తికావస్తున్న సమయంలో రైతులకు సంకట పరిస్థితి నెలకొంది. భారీగా బేళ్లను నోబిడ్ చేస్తుండటంతో ఏం చేయాలో తెలియక అల్లాడుతున్నారు. వేలానికి చివరి రెండుమూడు రోజులు కావడంతో రైతులు పొదిలి పొగాకు కేంద్రానికి చెక్కులతో చేరుకొని నిరీక్షిస్తున్నారు. ఈనెల 27వ తేదీతో కొనుగోళ్లు ముగుస్తుండటంతో రెండు రోజులుగా వేలం కేంద్రం కిటకిటలాడుతోంది. ట్రాక్టర్లు నిలుపుకోవడానికి వీలులేకపోవడంతో రైతులు రోడ్లపైనే ఆపి చెక్కులపైనే నిద్రిస్తున్నారు. బోర్డు అధికారులు రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. బయ్యర్లంతా సిండికేటై 80శాతానికిపైగా నోబిడ్ అంటూ చెక్కులను కొనుగోలు చేయడం లేదు. సీజన్ కొనుగోళ్లు ముగిసే సమయం కావడంతో రైతులలో ఆందోళన నెలకొంది. పంట పండించడానికి అధిక మొత్తంలో ఖర్చుచేశామని, తీరా బోర్డుకు వస్తే నాణ్యత లేదనే కారణంతో వ్యాపారులు నోబిడ్ అని కొనడం లేదని వాపోతున్నారు. సోమవారం 1,600 బేళ్లు వేలానికి వస్తే వాటిలో 999 అధికారులు నోబిడ్‌గా ప్రకటించారు. దీంతో ఏం చేయాలో తెలియక రైతులు అయోమయంలో పడ్డారు. చెక్కులను ఇంటికి తీసుకెళ్ల లేక కొంత మంది క్వింటా రూ.1000కి బయట దళారులకు అమ్ముకున్నారు. సోమవారం ఒక్కరోజే సుమారు 400 చెక్కులు ఇలా అమ్ముకున్నారంటే రైతుల దయనీయ పరిస్థితి అర్థమవుతోంది. బోర్డు ఉన్నతాధికారులు స్పందించి వేలంను మరికొద్దిరోజులు పొడిగించాలని రైతులు కోరుతున్నారు.


ఒంగోలులోని జేఎంబీ చర్చిలో క్యాండిల్ లైట్స్ ప్రదర్శన

మొదలైన క్రిస్మస్ సందడి

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ సందడి మొదలైంది. సెమీక్రిస్మస్ వేడుకలు మంగళవారం నుంచి మొదలయ్యాయి. ఈ సందర్భంగా పలు చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒంగోలులోని జువెట్ మెమోరియల్ బాప్టిస్టు చర్చిలో స్త్రీల మైత్రీసంఘం ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి సంతోషాలను పంచుకున్నారు. నగరంలోని క్రైస్తవులు ఉండే ప్రాంతాలు స్టార్స్‌తో సరికొత్త కళను సంతరించంచుకున్నాయి. ప్రార్థన మందిరాలు విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్


విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న జేఎంబీ చర్చి


క్రీస్తు గీతాలను ఆలపిస్తున్న పరిజనం

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో అవినీతి డొంక కదులుతోంది. భారీగా నిధుల దోపిడీ బహిర్గతమవుతోంది. ఆర్పీలు బోగస్ గ్రూపులు సృష్టించి పెద్దమొత్తంలో దోచుకున్న వ్యవహారంలో ఒక్కొక్కరి పాత్ర వెలుగు చూస్తోంది. తాజాగా కార్యాలయంలోని బ్యాంకు లింకేజీ అధికారి పాత్ర బయటపడింది. బోగస్‌లను గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేయాల్సిన ఆమె అందుకు భిన్నంగా వ్యవహరించినట్లు తెలిసింది. 2022 నుంచి బ్యాంకుల ద్వారా మంజూరైన రుణాల రికార్డులు మాయం కావడం అనేక అనుమానాలు, ఆరోపణలకు తావిస్తోంది.



మెప్మాలో మరో మాయ



రుణాలకు సంబంధించిన రికార్డులు గల్లంతు

- బ్యాంకు లింకేజీ అధికారి తీరుపై అనుమానం
- లక్ష్యాల సాధన, అదనపు ఆర్జన కోసం బోగస్‌కు బ్యాంకర్ల సహకారం
- లబోదిబోమంటున్న పొదుపు మహిళలు
- అవినీతిపై ఏడుగురితో విచారణ చేపట్టిన పీడీ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మెప్మాలో అవినీతి బాగోతం తవ్వేకొద్దీ బయటపడుతోంది. అక్రమార్కులు అనేక అడ్డదారులు తొక్కినట్లు వెల్లడవుతోంది. ఏకంగా రికార్డులనే మాయం చేసే స్థాయికి వ్యవహారం వెళ్లినట్లు సమాచారం. కొద్దిరోజులుగా 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమవుతున్న కథనాలతో మెప్మా అధికారులు అప్రమత్తమయ్యారు. బోగస్ బాగోతం తేల్చేందుకు విచారణ కమిటీని నియమించారు. ఆ కమిటీ రెండు రోజులుగా విచారణ చేస్తోంది. బ్యాంకు లింకేజీ రుణాలకు సంబంధించిన ఫైళ్లు, ఇతర సమాచారం అందించాలని విచారణాధికారులు కోరగా అవి మాయమైనట్లు తెలుస్తోంది. ఈ రికార్డులు కార్యాలయంలో పనిచేసే బ్యాంకు లింకేజీ అధికారి వద్ద ఉండాలి. ఒక్కటి కూడా లేకుండా అన్నీ కన్పించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2022 నుంచి బోగస్ గ్రూపుల కథ మొదలైనట్లు సమాచారం. అప్పటి నుంచి నెలవారీ జాబితా, రిపోర్టులు ప్రస్తుతం కనిపించడం లేదని బ్యాంకు లింకేజీ అధికారి చెప్పడం చర్చనీయాంశమైంది. ఆమెను పూర్తిస్థాయిలో విచారిస్తేనే అసలు విషయం వెలుగు చూసే అవకాశం ఉంది. పట్టణ పొదుపు మహిళల

మిగతా 6వ పేజీలో

ఆర్ఆర్ యాక్ట్ ద్వారా మొత్తం వసూలు చేస్తాం

మెప్మాలో పొదుపు సభ్యులకు జరిగిన అన్యాయంపై ఏడుగురు సభ్యులతో విచారణ మొదలుపెట్టాం. అవినీతికి పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద ప్రతి పైసా తిరిగి కట్టిస్తాం. రుణాలు పొందిన సంఘాల జాబితా ప్రతినెలా తీసుకుని భద్రపరచాల్సిన బాధ్యత కార్యాలయంలోని బ్యాంకు లింకేజీ అధికారిపై ఉంది. కానీ ఆమెను రికార్డులు అడిగితే లేవని సమాధానం చెప్తున్నారు. దీనిపై అనేక అనుమానాలు ఉన్నాయి.



- పి.శ్రీహరి, మెప్మా పీడీ



ఐక్యతా ర్యాలీ

ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా మై భారత్ ఆధ్వర్యంలో ఒంగోలులో మంగళవారం ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి ప్రారంభమై 3 కి.మీ సాగింది. విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మై భారత్ జిల్లా యువజన అధికారి మహేంధర్‌రెడ్డి, జడ్పీ సీఈవో చిరంజీవి, స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కార్పొరేషన్

కరివేపాకుతో కాసుల పంట

- టన్ను రూ.50వేలకు చేరిన ధర
- ఈ సీజన్‌లో ఇదే అత్యధికం
- ముమ్మరంగా విక్రయాలు

8

నేను మంత్రిగారి ఇలాకా...!

- రెచ్చిపోతున్న అధికారి
- మైనింగ్ శాఖలో కోల్డ్‌వార్
- కార్యాలయ భవనానికి భూమిపూజలో ప్రస్ఫుటం

ఒంగోలు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గనులు, భూగర్భ వనరుల శాఖ కార్యాలయంలో ఓ అధికారి పనితీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. 'నేను మంత్రిగారి ఇలాకా' అంటూ ఆయన కార్యాలయంలో అన్ని పనులను చక్కబెడుతున్నారు. ఈనెల 23న ఒంగోలులోని దక్షిణ బైపాస్ రోడ్డులో గనులు శాఖ కార్యాలయ భవన నిర్మాణం కోసం ఇరువురు మంత్రులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో అంతా తానే అన్నట్లుగా పనులు చక్కబెట్టిన అధికారి శిలాఫలకంపై వేసిన పేర్ల విషయంలో కూడా వివాదాస్పదులుగా మారారు. ఎక్కడా భూగర్భ గనుల శాఖ కార్యాలయం సిబ్బంది అని రాయకపోవడంతో అక్కడ పనిచేసే వారంతా మనస్తాపానికి గురయ్యారు. దీంతో కార్యక్రమానికి ముందురోజైన శనివారం సాయంత్రమే విషయాన్ని కార్యాలయంలో పనిచేస్తున్న ఉన్నతాధికారి దృష్టికి సిబ్బంది తీసుకెళ్లారు. తాము ఆదివారం జరిగే భూమి పూజకు రాలేమని స్పష్టం చేశారు. ఆయన వారికి సర్దిచెప్పారు. అదేసమయంలో గనుల శాఖలో మరో విభాగంలో పనిచేసే అధికారి తన పేరు శిలాఫలకం మీద లేకపోవడాన్ని గుర్తించారు. దీంతో కోపోద్రిక్తుడైన ఆయన తన కంటే తక్కువ స్థాయి అధికారుల పేర్లు శిలాఫలకం మీద ఉన్నాయి.. తన పేరు లేకపోవడం ఏమిటి? అని ఉన్నతాధికారిని ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో ఉన్నతాధికారి తనకేమీ తెలియదని వెంటనే మార్పులు చేయిస్తానని చెప్పి, ఆ అధికారి పేరును ప్రింట్ చేసిన స్టిక్కర్‌తో వేయించారు. కార్యాలయంలో తాను మంత్రి ఇలాకా అని చెప్పుకునే అధికారి నిర్వాకం సిబ్బంది, అధికారుల మధ్య కోల్డ్‌వార్‌గా మారింది.

దివ్యాంగులకు స్కూటర్లు

- వంద శాతం రాయితీపై ఇవ్వనున్న ప్రభుత్వం
- దరఖాస్తుకు ఈనెల 30 వరకూ గడువు
- జిల్లాకు 80 మంజూరు



ఒంగోలు నగరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు తీపి కబురు చెప్పింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో దివ్యాంగులకు ఉచితంగా మూడు చక్రాల స్కూటర్లను అందజేసింది. ఇప్పుడు మళ్లీ ఇవ్వాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం దరఖాస్తులను ఆహ్వానించింది. తొలుత ఈనెల 25 వరకూ గడువు ఇచ్చింది. ఇప్పుడు దాన్ని ఈనెల 30వరకూ పొడిగించింది. ఒక్కో నియోజకవర్గానికి 10 చొప్పున జిల్లాకు 80 స్కూటర్లను ఇవ్వనుంది. 70శాతం కంటే పైన వికలత్వం కలిగి వాహనాన్ని నడపగలిగిన వారికి మాత్రమే వీటిని అందించనుంది. 8 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు ఉన్న వారు మాత్రమే అర్హులు. దివ్యాంగులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను పంపుకోవాల్సి ఉంది. వైద్యారోగ్యశాఖ జారీ చేసిన సదరమ్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా కలిగి ఉండాలి. ఆధార్ కార్డు, పదో తరగతి ఉత్తీర్ణత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు విద్యార్థులు అయితే బోన్‌ఫైడ్ సర్టిఫికెట్, స్వయం ఉపాధి, ఏదైనా సంస్థలో పనిచేస్తున్న వారు అయితే ఉపాధి ధ్రువపత్రాన్ని దరఖాస్తుకు జత చేయాలి. డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి. పదో తరగతి చదివి స్వయం ఉపాధి యూనిట్లు నడుపుతున్న, ఇతర విభాగాల్లో జీవనోపాధి పొందుతున్న వారికి ప్రాధాన్యం ఇస్తారు. జేసీ ఆధ్వర్యంలోని కమిటీ అర్హులను ఎంపిక చేస్తుంది.

డ్రైవింగ్ లైసెన్సులు లేక ఇబ్బందులు

ఉచితంగా మూడు చక్రాల మోటార్ వాహనాలను పొందాలనుకునే దివ్యాంగులకు డ్రైవింగ్ లైసెన్సును

మిగతా 6వ పేజీలో

మార్కాపురంలో సంబరాలు

జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి అంగీకారం

ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టిన ప్రజలు

ఎమ్మెల్యే కందులకు అభినందనలు

మార్కాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం జిల్లా ఏర్పాటుకు మంత్రివర్గ ఉపసంఘం నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదించిన నేపథ్యంలో మార్కాపురంలో మంగళవారం రాత్రి సంబరాలు అంబరాన్నంటాయి. ముందుగా స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో గుంటూరు నుంచి వస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి టీడీపీ నాయకులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన్ని పూల మాలలు, దుశ్శాలువాలతో ముంచెత్తారు. అనంతరం అక్కడ నుంచి



మోటార్ సైకిల్ ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కందుల

ద్విచక్ర వాహన ర్యాలీ జరిగింది. దారి పొడవునా టపాసులు పేల్చుతూ యువకులు కేరింతలు కొట్టారు. జవహర్ నగర్ కాలనీలోని ఎమ్మెల్యే కందుల ఇంటి వరకు ర్యాలీ జరిగింది. అక్కడ కూటమి నాయకులు, ప్రజల సమక్షంలో ఎమ్మెల్యే కందుల కేక్ కట్ చేసి, ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు.

వైసీపీ వంచన చేసింది.. ప్రజాప్రభుత్వం న్యాయం చేసింది

మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఎమ్మెల్యే కందుల విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ పాలకులు 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేసినా మార్కాపురం ప్రాంతానికి అన్యాయం చేశారన్నారు. ఆనాడు ప్రతిపక్ష నేతగా మార్కాపురం వచ్చిన చంద్రబాబు ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను తెలుసుకుని మార్కాపురం జిల్లాను చేస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాటకు కట్టుబడి నేడు మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలిపారన్నారు. త్వరలో ఏర్పడబోయే మార్కాపురం జిల్లా ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబును ఎన్నటికీ మరువరన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జిల్లాతోపాటు వచ్చే ఏడాది వెలిగొండ ప్రాజెక్టును కూడా సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని అన్నారు. కార్యక్రమంలో పోల్ మేనేజిమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, వెన్నా పోలిరెడ్డి, గొట్టిపాటి సూరి, దగ్గుల శ్రీనివాసరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్, కార్యదర్శి మేడిద రంగస్వామి పాల్గొన్నారు.

కల సాకారం

(5వ పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబునాయుడు మంగళవారం ఉపసంఘంతో జరిగిన భేటీలో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

అప్పట్లో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం అనంతరం తొలిగా 1970లో ఒంగోలు కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పడిన విషయం విదితమే. అప్పటివరకు గుంటూరులో ఉన్న ఒంగోలు డివిజన్, నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరు డివిజన్, కర్నూలు జిల్లాలో ఉన్న మార్కాపురం డివిజన్‌లను కలిపి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ఒంగోలు జిల్లా ఏర్పాటు చేశారు. అనంతరం రెండేళ్లకు జిల్లాకు చెందిన ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు పేరును పెట్టారు. 52 ఏళ్ల తర్వాత వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజన జరగ్గా అశాస్త్రీయంగా చేశారు. ఒంగోలుకు సుదూరంగా ఉన్న మార్కాపురం ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా చేయాలని ఆప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా వారి కోరికను నాటి జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. పార్లమెంట్ స్థానం యూనిట్ పేరుతో పశ్చిమ ప్రాంతం మొత్తాన్ని ప్రకాశంలోనే ఉంచింది. ఒంగోలుకు సమీప ప్రాంతమైన కందుకూరు నియోజకవర్గాన్ని సుదూరమైన నెల్లూరు జిల్లాలోకి, అద్దంకి నియోజకవర్గాన్ని ఏరంకంగాను అనువు లేని బాపట్ల జిల్లాలోకి మార్చారు. ఆ మార్పుపై అన్ని ప్రాంతాల ప్రజల్లోను తీవ్ర నిరసన వ్యక్తమైనా ఆనాటి సీఎం జగన్ ఏ మాత్రం పట్టించుకోకుండా విభజన చేశారు.

ఇచ్చిన మాట ప్రకారమే జిల్లా

గత సాధారణ ఎన్నికల సమయంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు, కందుకూరు, అద్దంకి యోజకవర్గాలను తిరిగి ఒంగోలు జిల్లాలోకి చేర్చుతానని చంద్రబాబు, యువగళం పాదయాత్ర సమయంలో యువనేత నారా లోకేష్ స్పష్టమైన హామీ ఇచ్చారు. దానికి కట్టుబడి ప్రస్తుతం పునర్విభజనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అయితే దర్శి నియోజకవర్గాన్ని కూడా తొలుత మార్కాపురం జిల్లాలోకి చేర్చుతారన్న చర్చ సాగినప్పటికీ ఆ ప్రాంత ప్రజల కోరిక మేరకు ప్రకాశంలోనే ఉంచుతున్నారు. అంతేకాక మంత్రి రవికుమార్ సూచన మేరకు కొత్తగా అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయనున్నారు. దర్శి నియోజకవర్గం మొత్తాన్ని అద్దంకి డివిజన్‌లోకి చేర్చనున్నారు. తద్వారా వారికి డివిజన్ కేంద్రం దగ్గరకానుంది. మరోవైపు మార్కాపురం జిల్లాతోపాటు ఆ ప్రాంతంలో గిద్దలూరు డివిజన్ ఏర్పాటును తొలుత పరిశీలన చేసినా తర్వాత దానిని ఆపేసి కనిగిరి డివిజన్‌లోకి గిద్దలూరు నియోజకవర్గం మొత్తాన్ని చేర్చనున్నారు. అలాగే మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాలను మార్కాపురం డివిజన్‌లో ఉంచారు. తాజా పునర్విభజనపై మంత్రి స్వామి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ అన్ని ప్రాంతాల ప్రజల ఆకాంక్ష, ఆప్రాంత ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకునే సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రెండు ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రణాళికాబద్ధ కార్యాచరణతో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాల మెరుగునకు చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర మంత్రివర్గ ఉపసంఘ సభ్యులకు ఈ సందర్భంగా ప్రజల పక్షాన స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

చినగంజాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుంచి మినహాయించాలని, రాష్ట్ర విద్యాశాఖామంత్రి ఈ విషయంలో జోక్యం చేసుకొని కోర్టులో రివ్యూ పిటీషన్ వేయించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు మెట్టు శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేస్తామని చెప్పినప్పటికీ ఆన్‌లైన్‌లో పనులు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు

చేయిస్తూ ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి అసెస్‌మెంట్ పుస్తకాల విషయంలో పునరాలోచించాలని, సింగల్ ఉపాధ్యాయులు పనిచేస్తున్న పాఠశాలల్లో పాఠశాల పనిదినాలు 225 ఉన్నచోట్ల ఎల్‌హెచ్, ఓ.హెచ్‌ల రోజులలో పాఠశాలలకు సెలవు ప్రకటించుకునే అవకాశం ఇవ్వాలని అన్నారు. పెండింగ్ ఆర్థిక బకాయిలను చెల్లించాలని, పీఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్ 30 శాతం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత జూన్‌లో బదిలీలు జరిగి ఇంకా రిలీవ్ కాని వారిని వెంటనే రిలీవ్ చేయాలని శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.పాపారావు, జిల్లా ఉపాధ్యక్షులు బి.బిక్షాలుబాబు, జిల్లా కార్యదర్శి పి.సురేష్, రాష్ట్ర కౌన్సిలర్ బి.శ్రీనివాసరెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కుర్రా రామారావు, మండల యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

స్త్రీల హక్కులపై అవగాహన అవసరం

అద్దంకిటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్త్రీలకు ఉన్న హక్కులు, హింసకు గురైనప్పుడు చట్టం ద్వారా వారు పొందగల సదుపాయాలు, ఇతర చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఉచిత న్యాయ సహాయకులు టి. మార్త శ్రీను అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఇందిరానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం నందు మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఐక్యరాజ్య సమితి తీర్మానం మేరకు ప్రతి సంవత్సరం నవంబరు 25వ తేదిన స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింసా వ్యతిరేక దినం నిర్వహించడం జరుగుతుందన్నారు. స్త్రీలపై అత్యాచారాలు, గృహహింసలు, లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయన్నారు.స్త్రీలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వీటిని అరికట్టడం ప్రయత్నంలో భాగంగా అందరు స్త్రీల హక్కులు, చట్టల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మహమ్మద్ రఫీ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.

స్త్రీ, పురుష సమానత్వంపై అవగాహన

పంగులూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్త్రీ, పురుష సమానత్వంపై మహిళలకు అవగాహన కల్పించాలని, రక్షణ చట్టాల గురించి, అన్ని రంగాలలో మహిళలకు ఉపాధి అవకాశాల గురించి తెలియచేయాలని ఎంపీడీవో స్వరూపారాణి అన్నారు. ఈ నెల 25 నుంచి డిసెంబరు 23 వరకు వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించనున్న జండర్ అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీవో స్వరూపారాణి లాంఛనంగా ప్రారంభించారు. వీవోఏలు, మండల సహాఖ్య ప్రతినిధులు ఎస్.హెచ్.గ్రూప్ సభ్యులకు మహిళల కోసం నిర్దేశించిన చట్టాల గురించి తెలియచేయాలన్నారు. మండల సమాఖ్య ప్రతినిదుల అవగాహన కోసం ఎంపీఎం అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాది సూరి, జండర్ కమిటీ సభ్యులు, వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాదులు

ఉద్యాన పంటలతో అధిక ఆదాయం

అద్దంకిటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలతో అధిక ఆదాయం పొందవచ్చు అని మండల ఉద్యాన శాఖ అధికారిణి ఎస్. దీప్తి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం, విప్పర్లవారిపాలెం గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలల్లో సాగు చేసిన ఉద్యాన పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఉద్యాన పంటలు అయిన డ్రాగన్ ఫ్రూట్స్ ,జామ, కొబ్బరి సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. రైతన్న మీ కోసం కార్యక్రమంలో ప్రతి రైతు తమ వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులకు అందించాలని తెలిపారు. వారు వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ సంబంధిత రైతులకు డౌన్‌లోడ్ చేస్తారని, ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొనిగల శాంతమ్మ, ఏఈవో కోటేశ్వరరావు, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు మౌనిక, రైతులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

● భర్త వేధింపులే కారణమని తండ్రి ఫిర్యాదు

మేదరమెట్ల నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్రవాని పాలెంకు చెందిన వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుర్రవానిపాలేనికి చెందిన మోంద్రు అనితను కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన శీలం బ్రహ్మనాయుడికిచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. ఇటీవల ఆమె ప్రసవం కోసం పుట్టింటికి వచ్చింది. ఇక్కడ ఒక కుమార్తెకు జన్మనిచ్చింది. అయితే అనిత భర్త, అత్తమామలు అదనపు కట్నం తేవాలని మానసికంగా, శారీరకంగా హింసించేవారు. ఇటీవల ఆమెకు ఆడపిల్ల పుట్టడంతో ఈ వేధింపులు మరింత ఎక్కువయ్యాయని అనిత తండ్రి లక్ష్మీనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 'రూ.20 లక్షలు కట్నం తెస్తే ఇంటికి రావాలని, లేదంటే అక్కడే చావాలి' అని భర్త బెదిరించడంతో తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. దీంతో ఈ నెల 20న తన కుమార్తె పురుగు మందు తాగగా, ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందనట్లు తెలిపారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

● ఈపూరుపాలెంలో కేసు నమోదు

ఈపూరుపాలెం(చీరాల), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఈపూరుపాలెం పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ట్రాక్టర్లను స్టేషన్ పరిధిలోని బోయినవారిపాలెం వైపు నుంచి ఈపూరుపాలెం వైపు వస్తుండగా మార్గ మధ్యలోని రైలు గేటు వద్ద ట్రాక్టర్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు డ్రైవర్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

మెప్మాలో మరో దారుణం

(5వ పేజీ తరువాయి)

కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. రుణాలు మంజూరు చేసి ప్రోత్సహిస్తోంది. పేద మహిళలు చిరువ్యాపారాలు చేసుకునేందుకు అవసరమైన రుణాల కోసం బ్యాంకర్ల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కనికరించడం లేదు. రకరకాల మెలికలు పెట్టి ఇబ్బంది పెడుతున్నారు. బోగస్ గ్రూపులకు మాత్రం కళ్లు మూసుకుని రూ.కోట్లు మంజూరు చేయడంపై అనుమానాలు కలుగుతున్నాయి. రూ.20లక్షల రుణాన్ని ఒక పొదుపు గ్రూపునకు మంజూరు చేయాలంటే వారందరు బ్యాంకు మేనేజరుకు కనిపించాలి. అలాగే మంజూరైన రుణం మొత్తం పొదుపు సభ్యుల బ్యాంకు ఖాతాల్లోనే జమచేయాలి. కానీ ఇక్కడ ఇవేమీ జరగలేదు. దీంతో కోట్లలో జరిగిన అవినీతిలో బ్యాంకర్ల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. టార్గెట్‌లతోపాటు కొందరు కాసులకు కక్కుర్తి పడి బోగస్ గ్రూపులకు సహకరించినట్లు తెలుస్తోంది. రుణాల మంజూరు చేసిన జాబితాలు బయటపెట్టకపోవడంతో బ్యాంకర్లపైనా అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

దివ్యాంగులకు స్కూటర్లు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో అనేక మంది లైసెన్సులు లేక దరఖాస్తు చేసుకునేందుకు కూడా అర్హత కోల్పోయారు. ఇదే విషయాన్ని దివ్యాంగుల యూనియన్ నాయకులు జేసీ గోపాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించారు. దివ్యాంగులకు లైసెన్సులు జారీ చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించారు. ఈనెల 21 నుంచి ఒంగోలులో దివ్యాంగులకు లెర్నింగ్ లైసెన్సు జారీ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. రవాణా శాఖ అధికారులు వీరికి ప్రత్యేకంగా ఎల్ఎల్ఆర్ జారీచేయనున్నారు.

గోతులమయంగా పంగులూరు- ముప్పవరం రహదారి

రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనచోదకులు

పంగులూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పంగులూరు - ముప్పవరం గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గోతులపై రాకపోకలు సాగించడం ప్రజలకు ఇబ్బందిగా మారింది. ముప్పవరం చేరుకునే ప్రధాన రహదారిలో జనకవరం అడ్డరోడ్డుకు సమీపంలో ఇరువైపులా లోతైన గోతులు ఏర్పడ్డాయి. ఇదే రహదారిలో కొండమూరు అలుగు సమీపంతోపాటు ఆదిరెడ్డిభావి నుంచి ముప్పవరం మధ్య పలుచోట్ల రోడ్డుమధ్యలో అడుగడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. గత టీడీపీ పాలనలో పంగులూరు, ముప్పవరం గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మించారు. నాటి నుంచి తరచూ ఈ రోడ్డుపై ఏర్పడిన గోతులు పూడ్చేందుకు ఆర్అండ్‌బీ అధికారులు అరకొర మరమ్మతులు చేపట్టారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గోతులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా గడిచిన ఏడాది కాలంగా వర్షాలకు జనకవరం, ముప్పవరం గ్రామాల మధ్య అనేకచోట్ల గోతులు ఏర్పడంతో ద్విచక్ర వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. ఇంకొల్లు, పంగులూరు పరిసర ప్రాంతాల నుంచి 16వ నెంబరు జాతీయ రహదారికి చేరుకుని అద్దంకితో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు నిత్యం వందల సంఖ్యలో వాహనచోదకులు రేయింబవళ్లు రాకపోకలు సాగిస్తుంటారు. అద్దంకి. ఇంకొల్లు మధ్య నడిచే ఆర్టీసీ బస్సులతో పాటు పలు ప్రాంతాల నుంచి సిమెంట్, కంకర, ఇసుక ఇతర సరుకు రవాణా చేసే లారీలు, ట్రాక్టర్లు, వైద్యం కోసం, ఇతర పనుల నిమిత్తం పలు గ్రామాల ప్రజలు కారుల్లో ప్రయాణం సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ ప్రధాన రహదారిలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా గోతులకు కనీస మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



జనకవరం అడ్డరోడ్డు సమీపంలో గోతులమయంగా ఉన్న ఆర్అండ్‌బీ రహదారి

దుర్గమ్మకు 7.37 కిలోల వెండి వస్తువుల బహూకరణ

అవీఇవీ

చీమకుర్తికి చెందిన మారం కుటుంబ సభ్యులు అందజేత



వెండి వస్తువులను కానుకగా ఇచ్చిన మారం కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటాన్ని అందచేస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారికి చీమకుర్తికి చెందిన మారం కుటుంబ సభ్యులు మంగళవారం దేవస్థానానికి విచ్చేసి ఈవో శీనానాయక్ ద్వారా రూ.12 లక్షల విలువగల 7.37 కిలోల వెండి వస్తువులను కానుకగా అందచేశారు. మారం కుటుంబానికి చెందిన ఆరుగురు సభ్యులు సంయుక్తంగా తమ సొంత డబ్బు రూ.12,82,00తో వెండి వస్తువులను కొనుగోలు చేశారు. ఎం శివపార్వతి 1 కిలో 258 గ్రాముల వెండి ప్లేటు, మారం వెంకటరెడ్డి 1 కిలో 096 గ్రాముల వెండి గిన్నె, మారం శైలజ 1 కిలో 198 గ్రాముల వెండి పళ్లెం, గోపిరెడ్డి సుధీర్‌రెడ్డి 1 కిలో 279 గ్రాముల వెండి పళ్లెం, మారం పిచ్చెమ్మ 1 కిలో 253 గ్రాముల వెండి ప్లేటు, మారం నాగజ్యోతి 1కిలో 286 గ్రాముల వెండి ప్లేటులను కానుకగా ఇచ్చారు. వీరికి ఈవో శీనానాయక్ అలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద ఆశీర్వచనం, ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందించారు.

క్రికెటర్ కరుణకుమారికి 'గొట్టిపాటి' రూ.5 లక్షల ప్రోత్సాహం

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత జట్టు అంధుల మహిళా టీ 20 వరల్డ్ కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన విశాఖ బాలికల అంధుల రెసిడెన్షియల్ విద్యార్థిని కరుణ కుమారికి కిషోర్ గ్రానైట్స్ అధినేత గొట్టిపాటి హర్ష రూ. 5 లక్షల ప్రోత్సాహకం ప్రకటించినట్లు రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో కరుణకుమారి చూపిన ప్రతిభకు ప్రోత్సాహకంగా గొట్టిపాటి హర్ష ప్రోత్సాహకం ప్రకటించినట్లు మంత్రి తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుకు రావడం అభినందనీయమని హర్షకు అభినందనలు తెలియజేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

అమ్మనబ్రోలు హైస్కూలుకు ఆర్థిక సాయం

నాగులుప్పలపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలులోని సీఎస్ఆర్ జడ్పీ హైస్కూలుకు మంగళవారం పాఠశాల పూర్వవిద్యార్థి, ఎన్ఆర్ఐ నన్నెబోయిన ధనలక్ష్మి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి హనుమయ్య అమ్మనబ్రోలులో పోస్టుమాస్టర్‌గా ఉద్యోగం చేశారని, ఆ సమయంలో హైస్కూలులో 6,7,8 తరగతులను తాను చదివినట్లు చెప్పారు. 65 సంవత్సరాల తరువాత తాను పాఠశాలను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఆమె సొంత గ్రామం బినిడమానూరు. కాగా ధనలక్ష్మిని పాఠశాల అధ్యాపకులు తదితరులు అభినందించారు.

రేపు దివ్యాంగులకు క్రీడా పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ప్రోత్సహించేందుకు జిల్లా క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27న ఒంగోలులోని మినీ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా శాఖ అధికారి జి.రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బ్యాడ్మింటన్, అండర్ -20, జూనియర్స్ కేటగిరిలో చెస్, 100 మీటర్లు షార్ట్ పుట్, డిస్కస్ త్రో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎవరైనా వైకల్య నిర్ధారణ ధ్రువపత్రంతో ఉదయం 9గంటలకు మినీ స్టేడియం వద్దకు హాజరు కావాలన్నారు.

ఐఎంఏ జిల్లా నూతన కమిటీ



ఎంపికైన నూతన కమిటీ సభ్యుడు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. ఒంగోలులోని ఐఎంఏ హాలులో జరిగిన ఎన్నికల ప్రక్రియలో అధ్యక్షుడిగా డాక్టర్ ఎ.నాగయ్యనాయుడు, కార్యదర్శిగా ఎం.ఆనంద్, కోశాధికారిగా కె.సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డాక్టర్ మన్నే వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో ఎన్నికలు జరగ్గా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జాలాది మణిబాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు శివ, సీతారామయ్య, అపర్ణ, స్నేహ, స్వామి, ప్రశాంతి, రంగనాథ్‌బాబు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంలో ఉంచిన రూ.లక్ష చోరీ

వాహనం పక్కన ఉంచి టిఫిన్ చేస్తుండగా ఘటన

విచారణ చేపట్టిన చీరాల పోలీసులు

పేరాల(చీరాల), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంలో డబ్బులు ఉంచి టిఫిన్ చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీకు పాల్పడ్డారు. అందిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని బోయినవారిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం సీడీఎం మిషన్ ద్వారా బ్యాంకులో నగదు జమ చేసేందుకు వెళుతూ పేరాల వద్ద నగదును వాహనంలో ఉంచి రోడ్డు పక్కన టిఫిన్ చేశాడు. కొద్దిసేపటి తరువాత చూసుకోగా వాహనంలో నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. ఈ మేరకు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పందిళ్లపల్లి విద్యార్థినికి కాంస్య పతకం

పందిళ్లపల్లి(చీరాల), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ అబ్బు పూజిత స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేష్ అండర్ -17 విభాగంలో కాంస్య పతకం సాధించింది. వినుకొండలో సోమ, మంగళవారాల్లో జరిగిన ఈ పోటీల్లో హేమర్ త్రోలో ప్రతిభ కనబరిచింది. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు పూజితను అభినందించారు.

రాజ్యాంగంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు

కఠారిపాలెం(చీరాల), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం కఠారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. భారత రాజ్యాంగం దినోత్సవం పురస్కరించుకుని జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేయించడం, బోధనాభ్యాసం సామాగ్రి తయారీ చేయించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు స్వామి వార్ల కల్యాణ మహోత్సవం

పర్చూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో వేంచేసియున్న స్వామివార్ల పుట్ట వద్ద శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వార్ల కళ్యాణ మహోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తేళ్ళ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ నిర్మాణం చేపట్టి 50 ఏళ్ల పూర్తిఅయిన సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.

డప్పుకళను జాతీయస్థాయిలో గుర్తించాలి

ఒంగోలు(రూరల్), నవంబరు25(ఆంధ్రజ్యోతి): డప్పు కళను జాతీయ కళగా గుర్తించాలని రాష్ట్ర డప్పు కళాకళారుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులో డప్పు కళాకారుల మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ మాట్లాడుతూ డప్పుకళాకారులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వారి అర్హతల మేరకు పించన్లు వచ్చేవిధంగా చేస్తానని, ఎలాంటి సిఫార్సులు అవసరం లేదన్నారు. టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు మాట్లాడుతూ డప్పు కళను అంతరించి పోకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సంఘ రాష్ట్ర నాయకుడు గుండిమెడ క్రాంతికుమార్ మాట్లాడుతూ డప్పు కళాకారులకు ప్రతినెలా రూ.7వేల పించను ఇవ్వాలని, కేవలం దీనిపై ఆధారపడ్డ వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు కంకణాల ఆంజనేయులు, బి.రఘురామ్, శివాజీరాజు, రాఘవులు, టి.రామారావు, యోబు పాల్గొన్నారు. అంత కుముందు డప్పులు వాయిస్తూ ప్రదర్శన నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

వికసిత్ గ్రామీణ భారత్ ర్యాలీ

సంతనూతలపాడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో మంగళవారం వికసిత్ గ్రామీణ భారత్ ర్యాలీని ఏపీఎం బాబూరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో మహిళ ల్లో నూతన చైతన్యం నింపేందుకే అవగాహన ర్యాలీని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ ఈనెల 25 నుంచి డిసెంబరు 23వ తేదీ వరకు మండలంలోని ప్రతి గ్రామంలో లింగసమానత్వం అంశంపై అవగాహన సదస్సులు జరుగుతాయన్నారు. డ్వాక్రా మహిళాసంఘాలతో ర్యాలీలు, ప్రతిజ్ఞ చేయించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రానున్న ఐదేళ్లలో రైతే రాజు

సంతనూతలపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో రైతే, రాజును చేసేవిధంగా ప్రభుత్వం కార్యచరణ రూపొందిస్తుందని తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని పేర్నమిట్ట, ఎండ్లూరు గ్రామాల్లో జరుగుతున్న రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన విధంగా నీటి భద్రత, డిమాండ్ ఆధారితపంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్‌ప్రాసెసింగ్, పెట్టుబడిసాయం తదితర అంశాలపై రైతులకు వివరించారు. అనంతరం ఏవో పావని మాట్లాడుతూ పంటలలో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, చిరుధాన్యాల పంటను రైతులు సాగుచేయాలని, సేంద్రియ ఎరువులనే వినియోగించాలని ఆమె తెలిపారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు అందుకుంటున్న కరాటే విద్యార్థులతో నిర్వాహకులు

గిద్దలూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కరాటేలో గిద్దలూరు విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఒంగోలులో జరిగిన 12వ జాతీయ స్థాయి కరాటే కున్‌ఫూ పోటీలలో 800 మందికిపైగా పాల్గొనగా గిద్దలూరుకు చెందిన విద్యార్థులు పలు విభాగాలలో ప్రతిభ కనబరచి మెడల్స్ గెలుచుకున్నారు. 6 నుంచి 8 ఏళ్ల కటాస్ విభాగంలో సౌమ్య బంగారు మెడల్‌ను, బశ్విత సిల్వర్ మెడల్‌ను, షాన్వి, భాను, సహస్ర, అభిరామ్, చరన్, భరత్‌లు బ్రాంజి మెడల్స్ సాధించారు. 11, 12 ఏళ్ల కటాస్ విభాగంలో నేహాల్, రాహుల్, రామ్‌చరన్, నక్షత్ర, రిత్విక్‌లు గోల్డ్‌మెడల్స్ సాధించగా షరీఫ్, ఖాజా, మున్నా, దీపాలి, హేమంత్, మహిపాల్ సిల్వర్ మెడల్స్ సాధించారు. మన్సూర్, దివి హాస్‌లు బ్రాంజి మెడల్స్ సాధించినట్లు కోచ్ బి.శ్రీనివాస్ తెలిపారు.

నేడు పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం

ఒంగోలు (విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాని పురష్కరించుకొని బుధవారం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఎ.కిరణ్‌కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. వేడుకలలో భాగంగా ఉదయం నిర్వహించే ప్రార్థనా సమావేశంలో అందరూ రాజ్యాంగ పీఠికను పఠించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలన్నారు. సెమినార్‌లు, క్విజ్, వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించటంతో పాటు భారత రాజ్యాంగం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించమన్నారు.

'రాజ్యాంగ దినోత్సవ సభను జయప్రదం చేయండి'

ఒంగోలు కల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం ఒంగోలులోని ఆచార్య రంగా భవన్‌లో నిర్వహించే సభను జయప్రదం చేయాలని జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం 2.30 గంటలకు ఈ సభ ఉంటుందన్నారు. సీనియర్ న్యాయవాది పంగులూరు గోవిందయ్య అధ్యక్షతన జరిగే ఈ సభలో రాజకీయ, ఆర్థిక శాస్త్రవేత్త పరకాల ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారనిపేర్కొన్నారు. సమావేశంలో ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్‌రావు, ఎం.జార్జ్, డి.అంకయ్య, దాసరి సుందరం, భీమవరపు సుబ్బారావు, పి.పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

ఒంగోలు కల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జేఏసీ పిలుపు మేరకు బుధవారం ఒంగోలులో జరిగే బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నేతలు, కేంద్ర కార్మిక సంఘాల నేతలు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని డిమాడ్‌చేస్తూ ఉదయం 10.30కు స్థానిక కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి చర్చిసెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ జరుగుతుందని, ప్రజలు విరివిగా పాల్గొనాలని మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి, పమిడి వెంకట్రావు, ఎస్.లలితకుమారి, కొండగుంట సుబ్బారావు, భీమవరపు సుబ్బారావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎస్.రమేష్, ఎంఎస్.సాయి, ఆర్.మోహన్‌లు కోరారు.

జిల్లా బేస్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

సంతనూతలపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అండర్-14, అండర్-17 బాలిబాలికల జిల్లా బేస్‌బాల్ జట్ల ఎంపిక జరిగింది. ఈ ఎంపిక పోటీలను తహసీల్దార్ ఎస్‌ఎల్.నారాయణరెడ్డి ప్రారంభించారు. క్రీడాకారుల మధ్య పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారిని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు పలు జిల్లాల్లో జరగబోయే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లలో పాల్గొంటారని అండర్-19 నిర్వాహకులు డి.శ్రీనివాసరావు, టి.రవికుమార్ తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ఎమ్మెల్యే దామచర్ల ● క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులతో ప్రత్యేక సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఒంగోలు నగర అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్ళాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోరారు. మంగళవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ ఇన్‌చార్జులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ పార్టీ డివిజన్ బాధ్యులుగా ఉన్న క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులు స్థానిక నాయకులతో కలిసి ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధుల కొరత ఉన్నప్పటికీ తాను నిరంతరం కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ముఖ్యంగా అభివృద్ధిలో రాజీపడకుండా ముందుకెళ్తున్నామని, ఆ ప్రగతిని ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, ఇతర సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి పరిష్కార దిశగా పనిచేయాలని సూచించారు. గత వైసీపీ హయాంలో కబ్జాలు, రౌడీయిజం, పలు అసాంఘిక కార్యకలాపాలకు తావుండేదన్నారు. అయితే నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రశాంత వాతావరణం, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి కార్యకర్త ఓ సిపాయిలాగా పనిచేయాలన్నారు. తాను ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటానని దామచర్ల స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్‌లు రాచగర్ల వెంకట్రావు, కామేపల్లి శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు బండారు మదన్, కార్పొరేటర్ దాచర్ల రమణయ్య, కమ్మ వెంకటేశ్వర్లు, కొఠారి నాగేశ్వరరావు, పాలూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శానిటరీ అధికారులు, సెక్రటరీలు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

నగరంలో పారిశుధ్యం మెరుగు కోసం 'వావ్'

● పైలట్ ప్రాజెక్టు కింద ఒంగోలు ఎంపిక ● కమిషనర్ వెంకటేశ్వరరావు వెల్లడి

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో పారిశుధ్యం మెరుగుతోపాటు, ప్రత్యేకంగా పలు మార్పులు తీసుకొచ్చేందుకు వావ్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శానిటేషన్ అధికారులు, సెక్రటరీలు, స్వచ్ఛమిత్రతో మంగళవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఐటీసీ సహకారంలో పైలట్ ప్రాజెక్టు కింద వావ్ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ప్రజల్లో శానిటేషన్ గురించి, వారి ప్రవర్తనలో మార్పులు తీసుకురావడంమే దీని లక్ష్యమన్నారు. దీని ద్వారా క్లీన్ ఒంగోలుగా తీర్చిదిద్దాలని, అందుకోసం ఐటీసీ ఆధ్వర్యంలో సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ ద్వారా నగరంలో 30 మంది స్వచ్ఛమిత్రలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్లీన్ ఒంగోలు కార్యక్రమంలో భాగంగా 2026 జనవరి నుంచి వారంలో రెండు రోజులు (బుధవారం, ఆదివారం) మాత్రమే పొడి చెత్తను సేకరిస్తారని, మిగిలిన ఐదు రోజులు ఒక్క తడిచెత్తను మాత్రమే ప్రతి ఇంటి నుంచి స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మార్పులను ఒక నెల ముందుగానే ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా శానిటేషన్ గురించి ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్ ద్వారా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటుందని తెలిపారు. దీనిలో ప్రజలను భాగస్వాములను చేయాల్సిన బాధ్యత శానిటేషన్ విభాగంపై ఉందని కమిషనర్ స్పష్టం చేశారు. సమావేశంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వైష్ణవి, శానిటరీ సూపర్ వైజర్ షేక్ బాజ్జి తదితరులు పాల్గొన్నారు.

కరివేపాకు.. కాసుల పంట

టన్ను రూ.50వేలు పలికిన ధర



పసుపుగల్లులో విస్తారంగా సాగు చేసిన కరివేపాకు తోటలు

ముండ్లమూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కరివేపాకు సాగు లాభాలబాట పట్టింది. మండలంలోని పసుపుగల్లు, ముండ్లమూరు, చింతలపూడి, తమ్మలూరు గ్రామాల్లో కిరివేపాకు సాగు చేసిన రైతులు లాభాల బాట పట్టారు. ఈఏడాది మొదట్లో ధర పాతాళానికి పడిపోవటంతో రైతులు నష్టాలు మూట గట్టుకున్నారు. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు తూర్పుగోదావరి, పశ్చిమగోదావని, కృష్ణా, గుంటూరు, అనంతపురం జిల్లాల్లో కరివేపాకు తోటలు దెబ్బతిన్నాయి. దీంతో కరివేపాకు బాగా డిమాండ్ ఏర్పడింది. ఒక్కసారిగా టన్ను రూ.40వేల నుంచి రూ.50వేల వరకు పెరిగింది. దీంతో కరివేపాకు సాగుచేసిన రైతులు ముమ్మరంగా అమ్మకాలు చేస్తున్నారు.

గత పది రోజుల నుంచి పసుపుగల్లు, తమ్మలూరు, ఉమామహేశ్వర అగ్రహారం, సింగనపాలెం, ఉల్లగల్లు గ్రామాల రైతులు కరివేపాకును అమ్మకాలు చేస్తున్నారు. చెన్నై, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు పట్టణాలకు చెందిన వ్యాపారస్తులు రైతుల పొలాల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మూడు నెలల క్రితం కిలో రెండు రూపాయలకు ధర పలికింది. ఒక్కసారిగా ధరలు పాతాళానికి పడిపోవటంతో అప్పట్లో రైతులు నష్టపోయారు. కొంతమంది రైతులు కరివేపాకు తోటలను దున్నివేశారు. రెండు నెలలు తిరగక ముందే రేటు ఒక్కసారిగా పెరిగింది. ఒక్కో ఎకరానికి ఐదు టన్నుల నుంచి ఆరు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఖర్చులు పోను రైతుకు సరాసరి రూ.రెండు లక్షల వరకు మిగులుతుంది. గత పది సంవత్సరాలుగా ఈ సీజన్‌లో టన్ను రూ.50వేలు పలకటం ఇదే ప్రథమం. ధరను చూసిన రైతులు ఒక్కసారిగా వచ్చే ఏడాది మరింత సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మండలంలోని పసుపుగల్లులో దాదాపు రెండు వందల ఎకరాలకు పైగానే కరివేపాకు సాగు చేశారు. ఒక్కో రైతు రెండు ఎకరాల నుంచి పది ఎకరాల వరకు కరివేపాకు సాగు చేశారు. మొత్తంమీద నష్టాల నుంచి లాభాల బాటలో కరివేపాకు రైతులు పయనిస్తున్నారు.

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజు షెడ్యూల్

ఒంగోలు(విద్య), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఏపీ ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్ మీడియట్ పబ్లిక్ పరీక్షలకు పరీక్ష ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను డైరెక్టర్ ఆర్.నరసింహారావు ప్రకటించారు. ఎటువంటి అపరాధ రుసుము లేకుండా డిసెంబరు ఒకటి నుంచి 10వ తేదీ వరకు రూ.25, అపరాధ రుసుముతో వచ్చేనెల 11 నుంచి 12 వరకు, రూ.50 అపరాధ రుసుముతో, వచ్చేనెల 13 నుంచి 15 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. అభ్యాసకులు ఏదైనా ఏపీ ఆన్‌లైన్ సేవాకేంద్రం లేదా ఆన్‌లైన్ పేమెంట్ గేట్ వే ద్వారా పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. పదోతరగతి థియరీ ఒక్కో సబ్జెక్టుకు వంద రూపాయలు, ఇంటర్మీడియట్ థియరీ ఒక్కో సబ్జెక్టుకు రూ.150, ఇంటర్మీయట్ ప్రాక్టికల్స్ ఒక్కో సబ్జెక్టుకు వంద రూపాయాలు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. ఇంటర్మీయట్ ఫెయిల్ అయినవారు, బెటర్‌మెంట్ రాసేవారు థియరీ ఒక్కో సబ్జెక్టుకు రూ.250, ప్రాక్టికల్స్ ఒక్కో సబ్జెక్టుకు వంద రూపాయలు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. ఇంప్రూవ్‌మెంట్ అన్ని సబ్జెక్టులు ఉత్తీర్ణులైనవారు హాజరవుతుంటే పదో తరగతికి థియరీ ఒక్కో సబ్జెక్టుకు రూ.200, ఇంటర్మీయట్ ఒక్కో సబ్జెక్టుకు రూ.300, ప్రాక్టికల్స్ ఒక్కో సబ్జెక్టుకు వంద రూపాయలు పరీక్ష ఫీజు చెల్లించాలని, తత్కాల్ కింద ఇంటర్మీయట్ పరీక్షలకు హాజరయ్యేవారు సబ్జెక్టు ఫీజుతో పాటు అదనంగా వెయ్యి రూపాయలు చెల్లించాలని, పదో తరగతివారు తత్కాల్ సబ్జెక్టు ఫీజుకు అదనంగా రూ.500 చెల్లించాలని డైరెక్టర్ ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

ఇంటి పన్నుల కోసం ప్రత్యేక డ్రైవ్

మద్దిపాడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆదేశాలతో ఇంటిపన్ను పాత బకాయిలను ఈ నెలాఖరులోపు పూర్తిగా వసూలు చేయాల్సి ఉన్నందున ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు మండలంలోని ప్రతి గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని డిప్యూటీ ఎంపీడీవో రఘుబాబు మంగళవారం తెలిపారు. ప్రజలు ఇంటిపన్నును ఎవరికి వారే ఆన్‌లైన్ ద్వారా లేదా ఇంటి వద్దకు వచ్చే గ్రామ పంచాయతీ సిబ్బంది సహకారంతో చెల్లించవచ్చన్నారు.



యూత్ గ్రామసభలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవోదయలో మోడల్ యూత్ గ్రామసభ

ఒంగోలు(విద్య), నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం మోడల్ యూత్ గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ సి.శివరామ్ గ్రామ సభను అవగాహన కల్పించారు. సభలో పాల్గొన్న విద్యార్థులకు ప్రిన్స్‌పాల్ జ్ఞాపికలను అందజేశారు. కోఆర్డినేటర్లుగా సీహెచ్.అయ్యన్న, ప్రేమ్‌తేజ్ వ్యవహరించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఎం.తాతయ్య, బాబురావు, కిషోర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నెక్స్‌జెన్ పాఠశాల పరిశీలన



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(రూరల్), నవంబరు25(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని నెక్స్‌జన్ ఇంటర్నేషనల్ పాఠశాలను మంగళవారం జేసీ ఆర్.గోపాలకృష్ణ సందర్శించారు. ఈ పాఠశాలను సైనిక్‌స్కూల్‌గా మార్చేందుకు సాధ్యాసాధ్యాలను, ఇతర సౌకర్యాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దీనిపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. కార్యక్రమంలో కలిగిరి సైనిక స్కూల్ ప్రిన్స్‌పాల్ సీఎస్.పరదేశి, నవోదయ ప్రిన్స్‌పాల్ సి.శివరామ్, డీఈవో ఎ.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పోస్టల్ ఆధ్వర్యంలో రూ.10 లక్షల బీమా అందజేత

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ప్రమాద బీమా పాలసీ రూ.10 లక్షల చెక్కును మంగళవారం అందజేశారు. రూ.557తో ప్రమాద బీమా చేయించుకున్న ఒంగోలుకు చెందిన వజ్జా సుబ్బయ్య రోడ్డు ప్రమాదంలో ఇటీవల మరణించడంతో పోస్టల్ నిబంధనల ప్రకారం నామినీ వజ్జా రమేష్‌కు రూ.10 లక్షలు చెక్కును విజయవాడలో పీఎంజీ ఉపేంద్ర, ప్రకాశం డివిజన్ ఎస్పీవో మురళీకుమార్ చేతులమీదగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి తక్కువ పాలసీతో జీవితానికి భరోసా లభిస్తుందని, ప్రతి ఒక్కరు పోస్టల్ బీమా పాలసీ తీసుకోవచ్చని తెలిపారు.

శ్రీచైతన్య ఐకాన్ విద్యార్థులకు నాసా కిట్లు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం వీఐపీరోడ్‌లో గల శ్రీచైతన్య ఐకాన్ అండ్ సీ బ్యాచ్ పాఠశాలలో విద్యార్థులకు నాసా కిట్లు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వన్‌టౌన్ సీఐ నాగరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి వాటిని అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రయోగాత్మకంగా నాసాలాంటి ప్రయోగాలు, ప్రాజెక్టుల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రిన్సిపాల్ అపర్ణ శిరీష మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ బ్రాంచ్ నుంచి నాసాకు ప్రాజెక్టులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన మాగుంట

ఒంగోలు కల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాగర్‌మాల ప్రాజెక్ట్ కింద రూ.21 కోట్ల అంచనా వ్యయంతో కొత్తపట్నం మండలం గుండమాల నుంచి కె.పల్లిపాలెం మీదుగా మడనూరు, ఈతముక్కల వరకు బీచ్ రోడ్డు నిర్మాణం పనులకు అనుమతి ఇవ్వాలని మాగుంట కోరారు.

వ్యవసాయంలో సాంకేతికతను ఉపయోగించాలి

మద్దిపాడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులు సాంకేతికతతోనే వ్యవసాయం చేసి అధిక లాభం పొందాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం సీతారాంపురం, నందిపాడు గ్రామాల్లో రైతన్నా మీ కోసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఐదు సూత్రాల ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో జి.స్వర్ణలత, కోడూరి లక్ష్మీనారాయణ, మన్నం శేషయ్య, మద్దినేని రంగారావు, నర్రా కృష్ణమూర్తి, చుండూరి జనార్దన్, దుగ్గినేని నరసింహారావు, మండవ శివానందరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

● పొగాకు సమాఖ్య రాష్ట్ర చైర్మన్ జయంత్‌బాబు

మద్దిపాడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని పొగాకు సమాఖ్య రాష్ట్ర చైర్మన్ మండవ జయంత్‌బాబు తెలిపారు. మంగళవారం బసవన్నపాలెం సచివాలయంలో ఉపాధి గ్రామసభను ఏపీఎం ధనుంజయవర్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జయంత్‌బాబు మాట్లాడుతూ పేదల జీవన ప్రమాణాలను పెంచేందుకు ఉపాధి హామీ పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. ఏపీఎం ధనుంజయవర్మ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టే ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏవో జి.స్వర్ణలత, కొప్పోలు విశ్వనాథం, అబ్బూరి శేషగిరిరావు, మండవ గోవిందరాజులు, మండవ లక్ష్మీనారాయణ, ఆర్.ప్రభాకర్‌రావు, పైనీడి శేషతల్ప సాయి పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

● జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కల్చరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రకాశం భవనం నుంచి ఆయన అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పురోగతిపై ఆయన సమీక్షించారు. ఇందులో సచివాలయ ఉద్యోగులు కూడా ఉన్నందున ఇతర కార్యక్రమాల పేరుతో ఎస్ఐఆర్ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని, ఎస్ఐఆర్‌కు అధిక ప్రాధాన్యతనివ్వాలని ఆయన హెచ్చరించారు. 2002 నాటి జాబితాతో సరిపోల్చుతూ మ్యాపింగ్ చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ దిశగా పర్యవేక్షించాలని జిల్లా పరిషత్ సీఈవో చిరంజీవి, డీపీవో వెంకటేశ్వరరావులకు ఆయన సూచించారు.

వీధి లైట్లను ఏర్పాటు చేయాలి

రాచర్ల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒద్దులవాగుపల్లి గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆర్‌డీఎస్‌ఎస్ పనుల్లో భాగంగా గ్రామంలో రెండు నెలల కిందట నూతన విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేశారు గానీ విద్యుత్ స్తంభాలకు నేటి వరకు లైట్లు బిగించలేదని తెలిపారు. రాత్రి సమయాల్లో వీధుల్లో రోడ్లపై తిరగాలంటే వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పం దించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

నేడు కరెంట్ సరఫరా నిలిపివేత

కొమరోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తాటిచెర్లమోటు 33/11కేవీ సబ్‌స్టేషన్‌లోని నాగిరెడ్డిపల్లి ఫీడర్ పరిధిలోని గ్రామాల్లోకి బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆర్డీఎస్ఎస్ పనులు జరుగుతున్న కారణంగా కరెంట్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించవలసిందిగా ఆయన కోరారు.

విస్తారంగా అపరాల సాగు

పెద్దదోర్నాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో భాగంగా మండలంలో అపరాలు విస్తారంగా సాగు చేపట్టారు. ప్రధానంగా బొబ్బర్లు, మినుములు అధిక విస్తీర్ణంలో విత్తగా మొక్కజొన్న కూడా సాగు చేశారు. సాధారణంగా రబీ సీజన్ అనగానే సెప్టెంబరు - అక్టోబర్‌లో సాగు చేస్తారు. కానీ ఈ ఏడాది మొంథా తుఫాన్ కారణంగా నెల రోజులు ఆలస్యంగా విత్తుకోవాల్సి వచ్చిందని రైతులు చెప్తున్నారు. చాలా మంది రైతులు పత్తి తొలగించి భూమిని సిద్ధం చేయడంలో వాన కారణంగా



బొబ్బర్లు నాటుతున్న కూలీలు



ట్రాక్టర్ ద్వారా మినుములు విత్తుతున్న రైతు

జాప్యం జరిగింది. దీంతో ఈ నెలాఖరు వరకు విత్తే అవకాశం ఉంది. ఇప్పటికే మండలంలో సుమారు 500 ఎకరాలలో బొబ్బర్లు, 200 ఎకరాలలో మినుము, 500 ఎకరాలలో మొక్కజొన్నను విత్తారు. మొక్కజొన్న మాత్రం ఒప్పంద ప్రాతిపదికన రైతులు మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. అయితే వ్యవసాయాధికారులు ముందస్తుగా పలు సూచనలు చేస్తున్నారు. సాగుకు సంబంధించి ఆయా ఏజెన్సీల నుంచి అగ్రిమెంట్ పత్రాలు తీసుకోవాలని రైతులకు చెప్తున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

సర్వేలో అలసత్వం లేకుండా చూడాలి

టెలికాన్ఫరెన్స్‌లో అధికారులతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మంగళవారం సర్వే పురోగతిపై సమీక్షిస్తూ సర్వే పనిలో ఎలాంటి అలసత్వం లేకుండా చూడాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న అన్ని నివాసంలేని పేద కుటుంబాలు తప్పనిసరిగా సర్వేలో చేర్చబడాలని తెలిపారు. సర్వే పనిని ఫీల్డ్ సిబ్బందికి అప్పగించి నవంబరు 30వ తేదీలోపు పూర్తి చేయాలని ఆయన అన్నారు.

ఎస్టీయూలో చేరిన ఉపాధ్యాయులు



ఎస్టీయూలో చేరిన ఉపాధ్యాయులు

గిద్దలూరు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎస్టీయూ చేస్తున్న కృషికి ఆకర్షితులై ఉపాధ్యాయ నాయకులు టీకేఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్టీయూలో పలువురు ఉపాధ్యాయులు చేరారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి సమక్షంలో చేరారు. ఎస్టీయూలో చేరిన వారిలో ఎస్.ఆర్.చంద్రమోహన్, పి.రాంప్రసాద్, ఎస్.ఖాదర్‌బాషా, జడ్డీ రంగయ్య, బెల్లంకొండ శ్రీనివాసులు, ముత్యాల రంగస్వామి, వై.జి.రవిచంద్రరెడ్డి, ఎస్.రాఘవరెడ్డి, మహేష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జేఎం శివప్రసాద్, పుల్లానాయక్, ఏలం వేణుగోపాల్, ముత్యాల మద్దులేటి, శంకుల కాశీరావు, విజయరాజు, బెల్లం వేణుగోపాల్, కృపాదానం, శివపురం రమేష్‌బాబు, ఎస్‌వీ ప్రసాద్, సయ్యద్ సాధిక్, ఏవీ రమణ, పులి వెంకటేశ్వర్లు, నల్లగొలుసుల గురువయ్య, ఆసం షరీఫ్, జె.పాండురంగస్వామి, సంపత్‌కుమార్, తిరువీధి శ్రీనివాసులు, రాజనరసింహ తదితరులు సుమారు 50 మంది ఉపాధ్యాయులు చేరారు. వీరందరికీ ఎస్టీయూ కండువాలు వేసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఉపాధ్యాయ నాయకులు ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని కలిసి పూలమాలలు, శాలువలతో సన్మానించారు.

బైకు అదుపుతప్పి యువకుడు మృతి

మరొకరికి గాయాలు



ఎర్రగొండపాలెంరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి బోల్తా కొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ పీ చౌడయ్య తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని శాంతి నగర్ చెంచుగూడెంకు చెందిన నిమ్మల శివయ్య(18), పులిచెర్ల పోతురాజు పనులు నిమిత్తం ఎర్రగొండపాలెం వచ్చారు. పనులు ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. గడ్డమీదపల్లి గ్రామ సమీపంలో బైకు అదుపుతప్పడంతో పక్కనే ఉన్నరాళ్లపై శివయ్య పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోతురాజుకు గాయాలు కావడంతో వైద్యశాలకు తరలించారు. శివయ్య బావ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ అజయ్‌కుమార్, ఎస్సై మహేష్

పెద్ద దోర్నాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భార్యకు మద్యం పోశాడని మందలించిన ఆర్తి అంకన్న(23)ని కత్తితో పొడిచి హత్య చేసిన నిందితుడు ఆర్తి నాగన్నను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎర్రగొండపాలెం సీఐ అజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పెద్ద మంతనాల గిరిజన గ్రామానికి చెందిన ఆర్తి అంకన్న ఈ నెల 20వ తేదీన తల్లిదండ్రులతో కలిసి పెద్దారవీడు మండలం కుంట జంక్షన్‌లో కర్రలు అమ్ముకుని తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య దేవమ్మ మద్యం తాగి ఉండడం గమనించి చిన్నపిల్లాడున్న నీవు తాగి ఉంటే ఎలా...ఎవరు నీకు మద్యం పోశారని అడుగగా బంధువైన ఆర్తి నాగన్న మద్యం పోశాడని చెప్పింది. దీంతో అంకన్న కుటుంబసభ్యులతో నాగన్న వద్దకు వెళ్లి చిన్న పిల్లాడున్న తల్లికి మద్యం ఎందుకు పోశావని నిలదీశాడు. దీంతో ఇద్దరి మధ్యా గొడవ పెరిగి నాగన్న వద్ద ఉన్న కత్తితో అంకన్న గుండెలపై పొడవగా మృతి చెందాడు. దీంతో నాగన్న పరారయ్యాడు. అంకన్న కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా నేడు బోడేనాయక్ తాండా వద్ద నాగన్నను అరెస్టు చేసి నట్లు సీఐ అజయ్ కుమార్ తెలిపారు.



ఎమ్మెల్యే ఉగ్రను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గునుపూడి

బూత్ పరిశీలకులుగా గునుపూడి

పొదిలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి నియోజకవర్గం వెలిగండ్ల మండలంలో పలు బూత్‌ల పరిశీలకులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్‌ను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం నియమించింది. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డిని గునుపూడి కలిశారు. వెలిగండ్ల మండలంలోని 31, 34, 38, 43 మొత్తం నాలుగు బూత్‌లకు పరిశీలకులుగా నియమించారన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా బూత్‌లలో మెజార్టీ ఎందుకు తగ్గిందో పరిశీలించి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు టీడీపీ వెలిగండ్ల మండల అధ్యక్షుడు ఇంద్రబూపాల్‌రెడ్డి, తెలుగు రైతు అధ్యక్షుడు కేసరి రమణారెడ్డి, కనిగిరి పట్టణ మాజీ సర్పంచ్ విశ్వనాథుని చిరంజీవి, కనిగిరి పట్టణ టీడీపీ పార్టీ ఉపాధ్యక్షులు కొలిపర్తి మారుతి, రత్నం, పొదిలి పట్టణ మాజీ ఉపసర్పంచ్ జిలాని, బాషా, కారంశెట్టి కిశోర్ పాల్గొన్నారు.

ఘనంగా వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవం



వ్యాయమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ రంగయ్య

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవాన్ని మార్కాపురం పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాసవీ విద్యానికేతన్‌లో పిన్సిపాల్ రంగయ్య, ఏవో రంజిత్ వ్యాయామ ఉపాధ్యాయుడు లాజర్, ప్రభాకర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రంగయ్య మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి అన్నారు. ఎందరో క్రీడాకారుల వెనుక వారి వ్యాయామ ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. సాయిబాలాజీ ఉన్నత పాఠశాలలో పిన్సిపాల్ సలీ మస్తాన్ వలీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. జవహర్ నగర్‌లోని సాయి చైతన్య హైస్కూల్‌లో కరస్పాండెంట్ చంద్ర, పిన్సిపాల్ శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

మెగా పేరెంట్స్ మీట్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈవో అబ్దుల్ సత్తార్

కంభం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 5న జరగనున్న మెగా పేరెంట్ టీచర్ మీట్‌ను విజయవంతం చేయాలని ఎంఈవో అబ్దుల్ సత్తార్ అన్నారు. మండలంలోని హజరత్ గూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎం సన్నాహక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తరచూ పాఠశాలను సందర్శించాలని, విద్యా పథకాల అమలు, ప్రయోజనాలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ప్రగతి నివేదికలను పరిశీలించాలని, బడి భోజనాలను రుచి చూసి సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి తల్లిదండ్రులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ షబ్బీర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ డీ నాగేంద్ర ప్రసాద్, వైస్ చైర్మన్ హీనా బేగం, పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరాంజనేయ ఆలయ నూతన కమిటీ

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు రోడ్డులోని విఘ్నేశ్వర వీరాంజనేయ స్వామి ఆలయంలో నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారునిగా గోపాలుని హరిహరరావు, అధ్యక్షునిగా టి.వెంకటరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌వీ రమణారెడ్డి, కోశాధికారిగా కోసనాల శ్రీనివాసులు, ఆరుమంది ఉపాధ్యక్షులు మరో ఆరుగురు కార్యవర్గ సభుల్యలుగా ఎన్నికయ్యారు.



ఆలయ నూతన కమిటీ సభ్యులు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



బ్రోచర్లను పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. మంగళవారం మండలంలోని పాత గోళ్లవిడిపి గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతన్నా సేవలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు గ్రామంలో ఇంటింటికీ తిరిగి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. రాములోరి దేవాలయ అవరణలో రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి రైతుల సమస్యలను సాగు చేసిన పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఉద్యాన అధికారి పీ ఆదిరెడ్డి, ఎంపీడీవో బీ శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు చిట్యాళ వెంగళరెడ్డి, మహేష్ నాయుడు, ఎంసీహెచ్ మంత్రునాయక్, సత్యనారాయణ గౌడ్, వ్యవసాయ, ఉద్యానవన, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గిద్దలూరు : రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలను చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా ఎరువులను వాడుకోవాలని, తద్వారా పెట్టుబడిలో 20శాతం తగ్గించుకోవచ్చని వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బురుజుపల్లి గ్రామంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో విజయభాస్కర్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, వివిధ అనుబంధ శాఖల ఉద్యోగులు పాల్గొని వివిధ అంశాలపై రైతులకు సలహాలు, సూచనలు చేశారు.

రాచర్ల : రైతుల వ్యవసాయానికి సంబంధించి ఎ లాంటి సహకారం కావాలన్నా ప్రభుత్వం అందిస్తుందని వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా తెలిపారు. మండలంలోని ఆకవీడు గ్రామంలో మంగళవారం ఆయన రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించి రైతులతో మాట్లాడారు. ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్థక మార్కెటింగ్ డిమాండ్ ఆధారిత పంటలకు రైతులకు ఏది అవసరమో వాటి గురించి చర్చించడమే కార్యక్రమం ము ఖ్య ఉద్దేశమన్నారు. చర్చించిన సమాచారాన్ని డిసెంబరు 3న నిర్వహించే యాక్షన్ ప్లాన్ సమావేశంలో రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిక ద్వారా తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు, మీకోసం సిబ్బంది పాల్గొన్నారు.

కొమరోలు : సేంద్రియ ఎరువులను వాడి దిగుబడి పెంచుకోవాలని గిద్దలూరు ఇన్చార్జి ఏడీఏ, ఏవో కే రాజశ్రీ అన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కే శిరీష, వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ సహాయకులు, పశు సంవర్ధక శాఖ సహాయకులు, రెవెన్యూ అధికారులు, ఇంజనీరింగ్ సహాయకులు, విద్యుత్ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : రైతును రాజుగా చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు సాగుతున్నారని ఏవో ప్రకాశరావు అన్నారు. మండలంలోని 18 సచివాలయాల పరిధిలో రైతన్న మీకోసం కార్యక్రమం మంగళవారం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలి : మండలంలోని మల్లవరం గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో మంగళవారం దర్శి ఏడీఏ కె.బాలాజీ నాయక్, ఏవో శ్రీనివాసరెడ్డి నిర్వహించారు. ఈసందర్భంగా బాలాజీనాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చెప్పిన ఐదు విధివిధానాలు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్‌ఫుడ్ ప్రాసెసింగ్ ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి ధనలక్ష్మి, రైతులు, పలువురు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ పరిశీలన



షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి

పెద్ద దోర్నాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నటరాజ్ కూడలిలోని షాపింగ్ కాంప్లెక్స్‌ను మార్కాపురం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివ రామిరెడ్డి మంగళవారం పరిశీలించారు. కాంప్లెక్స్ లీజు గడువు ముగిసిందని మళ్లీ లీజుకు ఇవ్వాల్సి ఉందన్న సమాచారంతో ఇప్పటి వరకు వ్యాపారాలు నిర్వహిస్తున్నవారు మార్కాపురం సబ్ కలెక్టర్‌ను కలిసి చాలా ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తిరిగి మాకే ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈక్రమంలో ఆయన దోర్నాలలో పరిశీలించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు అశోక్‌కుమార్‌రెడ్డి, వీఆర్వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలోని ఆర్‌వో, ఎన్నికల డీటీలు, తహసీల్దారు, ఎంపీడీవో, సూపర్‌వైజర్లు, బీఎల్వోలతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా 2002 ఎన్నికల ఓటర్ల జాబితా ప్రకారం ప్రస్తుతం ఓటర్ల జాబితాను అనుసంధానం చేస్తూ ఎస్ఐఆర్‌ను నిర్వహించాలని ఆదేశించినట్లు ఎర్రగొండపాల తహసీల్దారు డీ మంజునాథరెడ్డి తెలిపారు. వీసీలో ఎంపీడీవో బండారు శ్రీనివాసులు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జెండర్‌పై అవగాహన ర్యాలీ

తర్లుపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జాతీయ ప్రసారం జెండర్ సమానత్వం కోసం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు జెండర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రంగరత్తమ్మ, దొండపాటి పార్వతమ్మ, రాజారపు ఈశ్వరమ్మ, ఏపీఎం రమేష్, సీసీలు రంగయ్య, నాగభూషణం, డ్వాక్రా గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్ధవీడు మండల టీడీపీ నాయకులు

తప్పులు చేసి ఆరోపణలా..?

వైసీపీ నాయకులపై టీడీపీ నేతల ఆగ్రహం

కంభం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో అందిన కాడికి దోచుకున్న నాయకులు ఈ రోజు వారు చేసిన తప్పులకు శిక్షలు పడుతుంటే టీడీపీ నాయకులపై ఆరోపణలు చేయడం సరికాదని అర్ధవీడు మండల మాజీ ఎంపీపీ, టీడీపీ సీనియర్ నాయకులు పాలుగుళ్ల పురుషోత్తంరెడ్డి, అర్ధవీడు మండల సొసైటీ అధ్యక్షుడు కొణతం రంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్ధవీడు మండలంలో పలు భూముల కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న గొటిక రాజేశ్వర్‌రెడ్డిపై రెవెన్యూ అధికారులు ఆదేశాలతో పోలీసులు ఈనెల 17న కేసు నమోదు చేశారు. దీనిపై సోమవారం కొమరోలు జడ్పీటీసీ సభ్యుడు సారె వెంకట నాయుడు, ఇంకా పలువురు వైసీపీ నాయకులు గొటికె రాజేశ్వరరెడ్డిని పరామర్శించేందుకు వచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రోద్బలంతో రాజశేఖర్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించారని చెప్పడం సమంజసం కాదన్నారు. ఎవరు చేసిన తప్పులకు వారు శిక్షను అనుభవించాల్సిందేనని అన్నారు. టీడీపీ నాయకులు పురుషోత్తం రెడ్డి, కొణతం రంగారెడ్డి గన్నేపల్లి, పాపినేనిపల్లి, యాచవరం సర్పంచులు బాబు, రంగమ్మ, మీరయ్య ఎంపీటీసీ సభ్యుడు రంగయ్య ఉన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి 27న ఎంపిక

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గిరిజన గురుకుల విద్యాలయంలో 2025 - 26 సంవత్సరానికి గాను 6వ తరగతిలో నూతన ప్రవేశం, 7, 8, 9 తరగతులలో బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేసేందుకు ఎస్టీ విద్యార్థులకు స్పోర్ట్స్ సెలక్షన్ కోసం 27వ తేదీన ఎంపిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు గిరిజన గురుకుల విద్యాలయ సంస్థ అధికారి కే వెంకటశివప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 9573879433, 9908169358, 8179683770 సంప్రదించాలని అన్నారు.

చెరువు జలాలు కలుషితం

సప్లై చానల్‌పై మరుగుదొడ్డి నిర్మాణంతో ఇబ్బందులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కరువు తర్వాత మార్కాపురం చెరువుకు పుష్కలంగా నీరు చేరింది. గుండ్లకమ్మ సప్లై చానల్ నుంచి మార్కాపురం చెరువుకు వర్షపు నీరు ప్రవహించి చెరువుకు చేరుతుంది. ప్రజలంతా మార్కాపురం చెరువు నిండి అలుగు పారిందని సంతోషపడుతున్న సమయంలో కొన్ని అపశ్రుతులు చోటుచేసుకుంటున్నాయి. చెరువుకు నీరు అందించే సప్లై చానల్‌లో ఓ వ్యక్తి అక్రమంగా ఇళ్లు కట్టడమే కాకుండా మరుగుదొడ్డి కట్టి మలమూత్రాలు కాలువకు వదులుతున్నారు. ఇదే కాకుండా అనేక మురుగు నీరు కూడా కాలువలో చేరుతోంది. పట్టించుకోవాల్సిన నీటి పారుదల శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు నిమ్మకు నీరు ఎక్కినట్లు ఉండడంతో కలుషిత జలాలు పెరిగి మార్కాపురం చెరువు మరో హుస్సేన్ సాగర్‌గా మారే ప్రమాదం ఉందని పట్టణ ప్రజలు, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ

పామూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దూబగుంట గ్రామంలో రిలయన్స్ అండ్ స్మార్ట్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు కూరగాయల విత్తనాలను మంగళవారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు డైండె శివశంకర్ ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు మండల అధ్యక్షుడు ఉడుముల ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. వెంకటాపురం గ్రామంలో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోతురాజు వెంకట్రావు, చెరుకుల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

పామూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వామిత్వ పథకం కింద గ్రామాల్లో రీ సర్వే నిర్వహించి ప్రతి ఒక్కరికి ప్రభుత్వం స్మార్ట్ కార్డులు ఇస్తుందని టీడీపీ కంభాలదిన్నె గ్రామ అధ్యక్షుడు మన్నం రమణయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని కంభాలదిన్నె గ్రామ పంచాయతి పరిధిలోని రజసాహెబ్‌పేటలో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరికి ఇంటి పట్టా హక్కు కల్పించడం టీడీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవో సందరరామయ్య, కార్యదర్శి కె.కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యాబోధన అవసరం

పామూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యాబోధన అవసరమని మానవత సేవాసంస్థ అధ్యక్షుడు వి.వెంకటేశ్వరెడ్డి అన్నారు. మండలంలోని చిలంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మానవత్వపు లక్షణాలు అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం గత ఏడాది 6,7,8,9, తరగతుల్లో ప్రతిభా కనపరిచిన విద్యార్థులకు ప్రతి తరగతిలో ఇద్దరికి చొప్పున 8 మందికి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టి.వెంకటేశ్వరరావు, టి.రమేష్, కృష్ణయ్య, పి.తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

స్వామిత్వపై గ్రామసభ

పీసీపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్టుపల్లి గ్రామంలో సర్పంచ్ డబ్బుగొట్టు రవీంద్ర అధ్యక్షతన స్వామిత్వ కార్యక్రమంపై మంగళవారం గ్రామసభ జరిగింది. మండల పరిషత్ పరిపాలన అధికారి ప్రభాకరశర్మ స్వామిత్వ కార్యక్రమ ఉద్దేశం, ప్రయోజనాల గురిం వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

లింగ వివక్షకు తావివ్వొద్దు

పీసీపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): లింగ వివక్షకు తావివ్వొద్దని మండల పరిషత్ పరిపాలనాధికారి ప్రభాకర శర్మ అన్నారు. మంగళవారం స్థానికి స్త్రీశక్తి భవనంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళల భద్రత, వారి హక్కులు, విద్యావకాశాలు, ఆర్థిక స్వావలంబన గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం సత్యానందం, భాస్కర్, ఏపీవో కొండయ్య, సీసీలు శశిరేఖ, గీత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలకు ఎన్నికలే గట్టి పునాది

పీసీపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య విలువలకు ఎన్నికలే గట్టి పునాదని పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.సుబ్బరామయ్య అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఓటు వినియోగంపై ఉపాధ్యాయలు ఎం.మధుబాబు, జి.ఈశ్వరమ్మల ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మంగళవారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. అనంతరం రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రిని ఎన్నుకునే విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో తిరుతయ్య, ఖలీల్, ప్రసాద్, జి.ప్రసాద్, శ్యాంప్రసాద్, కె.రుక్మిణి, ఎస్.కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకుమచ్చ తెగులుపై అప్రమత్తంగా ఉండాలి

కనిగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దానిమ్మలో ఆకుమచ్చ తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానశాఖ ఏవో విష్ణుప్రియ అన్నారు. మంగళవారం హెచ్‌ఎంపాడు మండలంలోని గాయంవారిపల్లి గ్రామంలో దానిమ్మ తోటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దానిమ్మ తోటలో కలుపు లేకుండా యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. దానిమ్మ కాయలపై మచ్చలను గమనించిన వెంటనే వాటి నివారణకు మ్యాంకోజబ్ 2.5 గ్రాములు లేదా 3గ్రాములు కాపర్ ఆక్సక్లోరైడ్ 15 నుంచి 20 రోజులు వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

28న మెగా జాబ్‌మేళా

పామూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 28న పామూరులో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఈటీఎస్ అండ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మీసాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈమేళాలో 15కు పైగా బహుళజాతి కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9988853335, 8008822821 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రైతుల అభివృద్ధికి ప్రభుత్వం మరింత తోడ్పాటు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



లింగారెడ్డిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతాంగాభివృద్ధికి ప్రభుత్వం మరింత తోడ్పాటు అందిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు నేలాధారిత పంటలు సాగు చేసుకోవాలన్నారు. అధిక లాభాలు వచ్చే పంటలను సాగుచేసి రైతులు ఆర్థికంగా పురోగతి చెందాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన పెంచుకుని ఆ దిశగా పంటలను సాగుచేస్తే మేలు చేకూరుతుందన్నారు. వ్యవసాయాధికారులు సూచించిన విషయాలను జాగ్రత్తగా పాటించి వాతావరణ మార్పులకు అనుగుణంగా విత్తన వినియోగం చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతు రాజుగా మార్చాలన్నదే సంకల్పంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పంటల సాగుపై రైతులకు వ్యవసాయాధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ జైనులాబ్దిన్, నాయకులు యారవ శ్రీను, గంజికుంట శ్రీనివాసులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాగా, పట్టణ సమీపంలోని కస్తూర్బాగాంధీ స్కూల్‌లో విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర స్థల పరిశీలన కోసం పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఖాళీ ప్రదేశాన్ని సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులనుద్దేశించి అధునాతన పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఇండ్లచెరువు ప్రధాన రహదారి

» పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

» ఇబ్బందులుపడుతున్న వాహనచోదకులు



అధ్వానంగాఉన్న ఇండ్లచెరువు ప్రధాన రహదారి

దొనకొండ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దొనకొండ నుంచి ఇండ్లచెరువు గ్రామం మీదుగా మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమై అధ్వానంగా తయారైంది. గత వైసీపీ పాలనలో కనీస మరమ్మతులకు నోచుకోకపోవటంతో ప్రస్తుతం అడుగుకో గుంత పడటంతో వాహనచోదకుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండలంలోని ఇండ్లచెరువు, రాగమక్కపల్లి, భూమనపల్లి, చిలకలపల్లి, మంగినపూడి తదితర గ్రామాలకు చెందిన ప్రజలేకాక ఇతర ప్రాంతాల నుంచి మార్కాపురం వెళ్లే వాహనచోదకులు సైతం ప్రతిరోజు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి ప్రధాన రహదారి నేడు గుంతలమయమై అధ్వానంగా మారటంతో వాహనదారులకు ప్రయాణం ప్రాణసంకటంలా మారింది.

ఇటీవల మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రహదారి మరింత ఛిద్రమైంది. వర్షాలు కురిసిన సమయంలో రహదారిపై ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ లేదో తెలియక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవటంతో ఈరహదారి దారుణంగా మారింది. పూర్తిగా గుంతలమయంకావటంతో ఇండ్లచెరువు గ్రామానికి చెందిన పలువురు వాహనచోదకులు పొలాల్లోని మట్టిరోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు గుంతలమయం కావటంతో వచ్చిన ఆదాయం వాహనాల మరమ్మతులకే సరిపోతుందని పలువురు ఆటో డ్రైవర్లు, వాహనాలచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత ప్రజాప్రభుత్వంలో ఈ రహదారికి మరమ్మతులు జరుగాయని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు అధ్వానంగా తయారైన ఇండ్లచెరువు రహదారికి మరమ్మతులు చేపట్టి తమ ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతంగా చేయాలి



దర్శిలో మాట్లాడుతున్న ఈఆర్‌వో జాన్సన్

దర్శి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఓటర్ల మ్యాపింగ్‌కు సంబంధించి బీఎల్‌వోలు ఇంటింటికి తిరిగి వేగవంతంగా పూర్తిచేయాలని దర్శి నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్.జాన్సన్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2002లో ఓటు హక్కు పొందిన వారి సంతానం ఉన్నట్లయితే, వారిని విచారించి వారి పేర్లు నమోదు చేయించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల రివిజన్ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. బీఎల్‌వోలు ఓటర్ల మ్యాపింగ్, నమోదు కార్యక్రమాల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, బీఎల్‌వోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు హక్కుకోసం దరఖాస్తు చేయించాలి

ముండ్లమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న యువతీయువకులతో ఓటు హక్కు కోసం బీఎల్‌వోలు దరఖాస్తు చేయించాలని దర్శి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.జాన్సన్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2002 నుంచి 2025 వరకు మ్యాపింగ్‌లో భాగంగా ఎంతమంది ఓటర్లు ఉన్నారు, ఎంత మంది వలస వెళ్లారు, జాబితాలో చనిపోయిన వారి పేర్లు తొలగింపు లాంటివి చూడాలన్నారు. ఇంటింటికి వెళ్ళి సర్వే చేపట్టాలన్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, ఆర్ఐ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజుగా చేయటమే ప్రభుత్వ లక్ష్యం

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



మాట్లాడుతున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, పాల్గొన్న పాపారావు తదితరులు

దర్శి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతును రాజుగా చేయటమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలోని పెద్దఉయ్యాలవాడలో మంగళవారం రాత్రి జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి రైతు అభివృద్ధి పథంలో సాగేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల సారథ్యంలో ప్రజాప్రభుత్వం గతంలో ఎన్నడూలేని విధంగా రాయితీ పథకాలు అమలు చేయటంతో పాటు నగదు ప్రోత్సహకాలను అందజేస్తున్నట్టు చెప్పారు. రైతుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఎన్నో కార్యక్రమాలు అమలుచేస్తున్నట్టు చెప్పారు. ప్రపంచ మార్కెట్‌లో గిరాకీ లభించే విధంగా నాణ్యమైన ఉత్పత్తులు సాధించేలా ప్రకృతి సేద్యాన్ని పెంపొందించే లక్ష్యంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. నీటి భద్రత సాధించేందుకు జలవనరులను పెంపొందించే కార్యక్రమాన్ని చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలు చేయటమే కాక రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుండటంతో ప్రజాప్రభుత్వం పట్ల అన్నివర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, ఏడీఏ బాలాజీనాయక్, వ్యవసాయాధికారి కె.రాధ, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి, సుబ్బారావు, టీడీపీ దర్శి పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా దిగుడు బావి



మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న బావి

తాళ్లూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు-తూర్పుగంగవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో మాధవరం గ్రామం శివారున మలుపు వద్ద దిగుడు బావి ప్రమాదకరంగా ఉంది. పూర్వం పొలాలకు నీరు పెట్టేందుకు ఏర్పాటుచేసిన దిగుడు బావినీటిని నేడు వాడక పోవటంతో నిరుపయోగంగా మారింది. ఈబావి రోడ్డును ఆనుకుని రెండడుగుల దూరంలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెట్లు దట్టంగా పెరిగి బావి అంచు చెట్లతో నిండిపోయింది. ఈరోడ్డు సింగిల్ రోడ్డు కావటంతో వాహనాలు ఎదురుపడినప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈమార్గం గుండా వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈమలుపు వద్ద బావి ఎదురుపడే వరకు వాహనాలు కన్పించడంలేదు. రోడ్డును ఆనుకుని ఉండటంతో ఎప్పుడు ఏరూపంలో ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఆబావి వర్షపు నీటితో నిండుకుని ఉంది. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మాధవరం మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న బావి అంచున్న ఉన్న చెట్లను తొలగించాల్సిన అవసరం ఉంది. అలాగే, బావి చుట్టూ గోడ కట్టించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో చింతలపాలెం

తాళ్లూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దికూరపాడు పంచాయతీ చింతలపాలెం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా గ్రామంలో అభివృద్ధి పనులు జరిగిన దాఖలాలు లేవు. బొద్దికూరపాడు గ్రామానికి చెందిన బూచేపల్లి వెంకాయమ్మ జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్నా, ఆఊరి మనుమడు గతంలో ఎమ్మెల్యేగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా చిం తపాలెం గ్రామంలో అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



కాలువలులేక పేరుకుపోయిన మురుగునీరు

గ్రామంలో 400 మంది జనాభా ఉన్నారు. ఎస్సీ కాలనీల్లో మాత్రం పాలకులు సీసీరోడ్లు, మురుగు కాలువలు నిర్మించారు. గ్రామంలో ఐదు బజార్లు ఉన్నా, ఎక్కడా సీసీరోడ్లు, మురుగు కాలువలు లేవు. ప్రజాప్రభుత్వం వచ్చిన మొదట్లో పల్లెవెలుగు కింద ఒక బజారులో మాత్రం రూ.5లక్షల నిధులతో సీసీరోడ్డు, మురుగుకాలువ నిర్మాణం చేపట్టారు. మిగిలిన నాలు గు వీధుల్లో నిర్మాణాలు జరగలేదు. దీంతో గృహాల్లోని వాడుకనీరు కాలువలు లేకపోవటంతో రోడ్డుల్లోకి ప్రవహిస్తున్నది. ఆ నీరు కిందికి వెళ్లలేక రోడ్డుపైనే నిల్వఉండి తటాకాలను తలపిస్తున్నాయి. మట్టికాలువలు పూడిపోయి, చెట్లు పెరిగి నీరు ప్రవహించే వీలులేక అక్కడే ఉంటున్నాయి. దీంతో దుర్గంధం వెదజల్లుతూ ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షం కురిసినప్పుడు ఆనీటికి బురద నీరుతోడై రోడ్లపై ప్రవహిస్తుంటంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి చింతలపాలెంలో మురుగు కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టి తమ కష్టాలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

మహిళల హక్కులను పరిరక్షించాలి

పామూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో స్త్రీలు వివక్షతకు లోనవుతూ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని వగ్గంపల్లి గ్రామంలోని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో అంతార్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో భాగంగా గృహ హింసా నిరోధక చట్టం 2005 గురించి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళలపై గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, భ్రూణహత్యలు, లింగవివక్షత అధికమవుతున్నాయన్నారు. 2005లో గృహహింస నిరోధక చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. మహిళలను శారీరకంగా, మానసికంగా హింసిస్తే భారత శిక్షాస్మృతి ప్రకారం శిక్షించవచ్చునన్నారు. అనంతరం గ్రామంలో గృహహింస నిరోధక ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎల్.దేవిశ్రీ, సహాయకురాలు ఏ.నారాయణనమ్మ, మహిళలు పాల్గొన్నారు.

కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు



కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు

పామూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకినాడలో సోమవారం జరిగిన జు-జిట్-సు 6వ రాష్ట్రస్థాయి పోటీలలో పామూరులోని ది చాంపియన్ కరాటి - డో స్పోర్ట్స్ విద్యార్థులు వివిధ విభాగాలలో పతకాలు సాధించారు. అండర్ 14 బాలికల ఫైట్, అండ్ నివాజ విభాగాలలో వై.స్నేహిత, బంగారు, రజిత పతకాలు సాధించారు. అండర్ 14 బాలికల విభాగంలో వై.స్నేహిత రెండు బంగారు, కె.లాస్య బంగారు, రజిత పతకాలు పొందారు. అండర్ 14 బాలుర విభాగంలో జి.మనోహర్‌రెడ్డి, బంగారు, రజిత పతకం, సీహెచ్ తేజేష్‌రెడ్డి, రెండు రజిత పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు డిసెంబరులో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హల్ధ్వానిలో జరిగే జాతీయ స్థాయి జు-జిట్ -సు పోటీలకు అర్హత సాధించారని ఏపీ జు-జిట్-సు రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాసీన్ తెలిపారు. ఈ పోటీలకు జిల్లా ఇన్‌చార్జ్‌గా అబ్దుల్ వహిద్ మాస్టర్ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

కోడిగంపల బీట్‌ను పరిశీలించిన సీఎఫ్‌వో

పామూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పామూరు మండలం పరిధిలో గల కోడిగంపల బీట్‌ను గుంటూరు కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి ఐ.కాశీవిశ్వనాధరాజు మంగళవారం పరిశీలించారు. కోడిగుంపల బీట్‌లో 30 హెక్టార్లలో పెంచిన నానజాతి మొక్కల ప్లాంటేషన్‌లో తీసుకోవల్సిన చర్యల గురించి సూచనలు చేశారు. ఆయనవెంట డీఎఫ్‌వో కె.వినోద్‌కుమార్, పి.శ్రీనివాసరావు, టి.ఉమమహేశ్వర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సుభద్ర ఉన్నారు.

చాకిరాల పీఏసీఎస్ చైర్మన్‌గా అర్జున్‌రావు ఎంపిక

కనిగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం 11 జిల్లాల పరిధిలో 22 పీఏసీఎస్ కమిటీలను ఎంపిక చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకాశం జిల్లా పరిధిలోని చాకిరాల శ్రీరామలింగేశ్వరస్వామి పీఏసీఎస్ చైర్మన్‌గా ఉట్టి అర్జునరావు, సభ్యులుగా ముద్దా దావీదు, కొంగలేటి సూర్యనారాయణరెడ్డిలను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

పామూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబాలదిన్నె గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు ఏలూరి నరసింహులు (87) మంగళవారం మృతి చెందారు. గత కొంతకాలంగా వయోభారం, అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నాడు. బుధవారం దహన సంస్కారాలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల టీడీపీ నాయకులు బొల్లా నరసింహారావు, పువ్వాడి వెంకటేశ్వర్లు, మన్నం రమణయ్య, గోళ్ల మాల్యాద్రినాయుడు, గోళ్ల భాస్కరరావు, చుంచు కొండయ్య, గోళ్ల వీరబాబు, తదితరులు సంతాపం తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

దర్శి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చట్టాలపై మహిళలు అవగాహన కలిగిఉండాలని దర్శి జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.నిఖిత అన్నారు. స్థానిక డిగ్రీ కాలేజీ బాలికల హాస్టల్‌లో మంగళవారం సాయంత్రం అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై దాడులు నివారించేందుకు కఠినమైన చట్టాలు అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో హాస్టల్ సంక్షేమాధికారి వనజ, న్యాయవాదులు మనోహరమ్మ, సుబ్బారెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

బిజినెస్ కరస్పాండెంట్ పై కేసు నమోదు

ముండ్లమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద ఉల్లగల్లు గ్రామానికి చెందిన ఐదు పొదుపు గ్రూపు సంఘాలకు చెందిన నగదును బిజినెస్ కరస్పాండెంట్ స్వాహా చేశారు. ఇందుకుసంబంధించి ఇటీవల ఆ గ్రామానికి చెందిన సాయి మణికంఠ గ్రూపు, లక్ష్మీ ప్రసన్న గ్రూపు, మహాలక్ష్మి గ్రూపు, గంగా గ్రూపులకు సంబంధించిన లీడర్లు ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో బిజినెస్ కరస్పాండెంట్‌గా ఉన్న మండలంలోని లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన మేడం మోహన్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ బి.పవన్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పంటలను పరిశీలించిన ఎన్‌జీవో ప్రతినిధులు


ముండ్లమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మ్యానేజ్‌డ్ నాచరల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) కార్యక్రమాన్ని అధ్యయనం చేయటానికి మంగళవారం ఎన్‌జీవోల ప్రతినిధుల బృందం మండలంలో ముండ్లమూరు, శంకరాపురం, పసుపుగల్లు గ్రామాల్లో పర్యటించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న ఏటీఎం మోడల్ కందిలో అంతర పంటలను పరిశీలించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి వారికి వివరించారు. కార్యక్రమంలో కృష్ణారావు, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

తాళ్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి వ్యక్తి జీవితంతో సంతోషాన్ని కల్గిస్తూ, సమాధన పరుస్తూ, భయాన్ని పోట్టే నామం ఏసునామస్మరణని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలోని రమణాలవారిపాలెంఎస్సీ కాలనీలో మంగళవారం జరిగిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా సెమీక్రిస్మస్ కేక్ కట్ చేసి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, షేక్ కాలేషా, బి.ఓబుల్‌రెడ్డి, ఐ.వెంకటేశ్వరరెడ్డి, విద్యాసాగర్, తాతయ్య, స్వామిదాసు, పాలె పోగురాజు, గొంది రమణారెడ్డి, గొళ్లపూడి వేణుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముండ్లమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ అన్నారు. మంగళవారం మండలంలోని పసు పుగల్లులో జరిగిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేశారు. సింగనపాలెంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఏ.తిరుమలరావు పాల్గొని కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు రాఘవరెడ్డి, బి.గురవయ్య, ఉద్యాన అధికారి సువర్చల, టీడీపీ నాయకులు గూడాల సాం బశివారెడ్డి, మానం నరసింహారావు, బత్తిన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



అమరావతిలో ఆర్థికం



ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు సీఆర్డీఏ శ్రీకారం

- కార్యాలయాలు, నివాసాలకు 27.855 ఎకరాలు కేటాయింపు
- 28న బ్యాంకు, ఎల్ఐసీ, ఆదాయపు పన్ను కార్యాలయాలకు శంకుస్థాపన
- హాజరు కానున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్
- సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం సమీపంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

గుంటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా ప్రజారాజధాని అమరావతి ముస్తాబవుతోంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ) రాజధాని అమరావతిలో ప్రతిపాదిత ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పాటును వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టింది. పలు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు, ఇన్స్యూరెన్స్, ఇన్‌కం టాక్స్ వంటి పలు ప్రభుత్వ అనుబంధ ఆర్థిక కార్యాలయాల శంకుస్థాపన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా సంస్థల కార్యాలయాలు, ఉద్యోగుల నివాసాలకు అవసరమైన స్థలాల కేటాయింపును పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 28న ఆయా కార్యాలయ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన జరగనున్నట్లు సీఆర్డీఏ కార్యాలయం తాజాగా ప్రకటించింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అమరావతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు సీఆర్డీఏ చేస్తోంది. అమరావతిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయం సమీపంలోని బ్లాక్- 1 వద్ద జరిగే కార్యక్రమంలో, రాజధానిలో ఏర్పాటు కానున్న పలు బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేయనున్నారు.

● మూడు విభాగాలుగా స్థలాల కేటాయింపు

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పాటు పనుల్లో భాగంగా బ్యాంకులు, ఆర్థిక అనుబంధ సంస్థలకు కేటాయించిన స్థలాలను కార్యాలయాలు, సిబ్బంది వసతి, అనుబంధ సంస్థలు అనే మూడు విభాగాలుగా స్థలాలు కేటాయించారు. బ్యాంకులు, కార్యాలయ భవనాల నిర్మాణం కోసం 9.695 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. భారతీయ స్టేట్ బ్యాంకు, కెనరా, నాబార్డు, యూనియన్ బ్యాంకు సహా 12 బ్యాంకులు ఇక్కడ కార్యాలయాలను నిర్మించుకోనున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ), లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ), ఆదాయపు పన్నుశాఖ వంటి కీలకమైన అనుబంధ సంస్థల కోసం 5.80 ఎకరాలు కేటాయించారు. సిబ్బంది వసతి, సంస్థాగత టౌన్‌షిప్ అభివృద్ధిని సులభతరం చేయడానికి వీలుగా నివాస స్థలాలకు 7.02 ఎకరాలు, ఆర్బీఐ వంటి అనుబంధ సంస్థల ఉద్యోగుల నివాసాలకు 4.54 ఎకరాలు, మొత్తంగా 11.56 ఎకరాలు నివాసస్థలాలను కేటాయించారు. మొత్తంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఏర్పాటులో భాగంగా అమరావతిలో మొత్తం 27.855 ఎకరాల స్థలం కేటాయించారు.

కేటాయింపు రకం	స్థలం (ఎకరాల్లో)
● ప్రభుత్వ రంగ బ్యాంకులు	9.695
● ప్రైవేటు బ్యాంకులు	0.80
● అనుబంధ సంస్థలు	5.80
● నివాస స్థలాలు(బ్యాంకు)	7.02
● ఆర్బీఐ, ఎన్ఐఏసీఎల్	4.54

సాగు సిరులు

అన్నదాతల్లో ఆనందం

- ఆశాజనకంగా ధాన్యం దిగుబడులు
- మూడు జిల్లాల్లో 13.69 లక్షల టన్నుల అంచనా
- మద్దతు ధర ప్రకారం సుమారు రూ.3,243 కోట్ల ఉత్పత్తి

దిగుబడి ఇలా..

- ★ పల్నాడు జిల్లాలో 1,40,643 ఎకరాల్లో వరి సాగైంది. జిల్లాలో 3,48,090 టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా.
- ★ బాపట్ల జిల్లాలో 2,57,828 ఎకరాల్లో వరి సాగు కాగా 6,38,124 టన్నుల ధాన్యం దిగుబడి కానున్నది.
- ★ గుంటూరు జిల్లాలో 1,55,005 ఎకరాల్లో వరి సాగు చేయగా 3,83,637 టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.




● ధాన్యం బస్తాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్‌లో వరి సాగు సిరులు కురిపిస్తోంది. సకాలంలో సాగర్, డెల్టా ఆయకట్టుకు ప్రభుత్వం పుష్కలంగా కృష్ణా జలాలను సరఫరా చేసింది. దీంతో గతంలో కంటే ఈసారి ముందస్తుగా రైతులు వరి సాగు చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో అంచనాలకు మించి వరి సాగైంది. ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మూడు జిల్లాల్లో 5.53 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరాకు ధాన్యం 30 నుంచి 35 బస్తాలకు వరకు దిగుబడి కానున్నది. సగటు దిగుబడి 33 బస్తాలుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ ప్రకారం మూడు జిల్లాలో 13,69,851 టన్నుల ధాన్యం దిగుబడి కానున్నది. ఈ దిగు బడుల ఆధారంగా ప్రభుత్వ మద్ద తు ధర క్వింటాల్‌కు రూ.2,369 ప్ర కారం లెక్కిస్తే దాదాపు రూ.3,243 కోట్ల విలువైన ధాన్యం ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ధాన్యానికి మద్దతు ధర అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. ధాన్యం కొనుగోలు లక్ష్యాలు మొత్తం దిగు బడిలో 10 శాతం కూడా లేకపోవడం గమనార్హం. పల్నాడు జిల్లాలో వరి నూర్పిళ్లు పూర్తి చేసిన రైతులు దాళ్వాలో వరి సాగుకు సమాయత్తమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు నారు మళ్ల సాగు చేపడుతున్నారు. ఈ ఏడాది కూడా రబీలో వరి సాగు పెరుగు తుందని అంచనా.

నెల రోజుల్లో నూర్పిళ్లు పూర్తి..

ప్రస్తుతం ముమ్మరంగా నూర్పిళ్లు జరుగుతున్నాయి. అయితే తుపానుపై వాతావరణశాఖ హెచ్చరిక అన్నదాతలను వణికిస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో యంత్రాలతో రైతులు నూర్పిళ్లు చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా ఎక్కడికక్కడ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాతావరణం అనుకూలిస్తే రానున్న నెల రోజుల్లో నూర్పిళ్లు పూర్తియ్యే అవకాశం ఉంది. పల్నాడు జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ధాన్యం దిగుబడి అవుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు 30 బస్తాలు దిగుబడి వస్తుండగా మరి కొన్ని ప్రాంతాల్లో 35 బస్తాలకు పైగా వస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.


గురుకుల పాఠశాల భవన శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

విద్యలో నరసాయపాలేనికి గుర్తింపు

● గురుకుల భవనం ప్రారంభోత్సవంలో ఎంపీ తెన్నేటి

బాపట్లరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యాదానంలో నరసాయపాలేనికి ప్రత్యేక గుర్తింపు ఉందని లోకసభ ప్యానల్ స్పీకర్, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని నరసాయపాలెం గ్రామంలో రూ1.10 కోట్లతో నిర్మించిన అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. నరసాయపాలెం నుంచి చాలామంది ఉన్నత పదవులు, ఉద్యోగాల్లో ఉన్నారన్నారు. ఏ పరిస్థితుల నుంచి వచ్చామన్నది ముఖ్యంకాదని ఏమి సాధించామన్నదే ముఖ్యమని, ఈ విషయం విద్యార్థులు గుర్తు పెట్టుకోవాలన్నారు. అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని చక్కగా చదువుకుని గ్రామానికి, దేశానికి మంచి పేరు తేవాలన్నారు. ఆడపిల్లల విద్యను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. తరగతి గదిలోని లాస్ట్‌బెంచ్ విద్యార్థులపై కూడా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ విద్యలో నరసాయపాలెం గ్రామానికి నియోజకవర్గంలోనే ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ గ్రామం నుంచి ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా సేవలు అందిస్తున్న వారెందరో ఉన్నారన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి కన్నెగంటి పాపారావు పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల అదనపు కార్యదర్శి సునీల్‌రాజ్‌కుమార్, ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ సలీమా, ఇండియన్ పోస్టల్ సర్వీస్ విశ్రాంత అధికారి సంధ్యారాణి, బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కాముల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి లేని బాపట్ల

జిల్లా పునర్విభజనకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

మారనున్న జిల్లా స్వరూపం.. ప్రకాశం జిల్లాలోకి అద్దంకి ● ఐదు నియోజక వర్గాలకే పరిమితం కానున్న బాపట్ల జిల్లా

(బాపట్ల, అద్దంకి - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరులో భాగంగా ఉన్న బాపట్ల, రేపల్లె, వేమూరు, ఉమ్మడి ప్రకాశంలో భాగమైన అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాలతో 2022 ఏప్రిల్ 4న బాపట్ల జిల్లా ఆవిర్భవించింది. ఈ మేళవింపుపై అప్పట్లో పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తమైనా వాటిని అప్పటి ప్రభుత్వం వైసీపీ పాలకులు బేఖాతరు చేశారు. అద్దంకి నియోజకవర్గ ప్రజలు తమకు బాపట్ల దూరాభారం అవడంతో పాటు చిరకాలంగా ప్రకాశం జిల్లాతో సంబంధాలు దృష్ట్యా బాపట్ల జిల్లాలో భాగం కావడానికి అయిష్టంగానే ఒప్పుకున్నారు. ఈ క్రమంలో జిల్లా ఏర్పాటు విష యంలో సరైన కసరత్తు జరగలేదని, తాము అధికారంలోకి వస్తే అద్దంకి ప్రజల అభీష్టానికి అనుగుణంగా నిర్ణయం తీసుకుంటా మని టీడీపీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది. ఇందులో భా గంగానే మంత్రి వర్గ ఉపసంఘం ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించింది. అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడంతో పాటు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపడానికి కూడా సీఎం చంద్రబాబు మంగళవారం అనుమతిచ్చారు. అద్దంకి నియోజకవర్గంలోని ఐదు మండలాలతో పాటు దర్శి నియోజకవర్గంలోని మండలాలు కూడా అద్దంకి డివిజన్ పరిధిలోకి చేరే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్, అభ్యంతరాల స్వీకరణ తదితర అంకాలను పూర్తి చేసుకుని రాబోయే సంక్రాంతికి ప్రక్రియ పూర్తి చేయడానికి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. దీంతో అద్దంకిలేని జిల్లాగా త్వరలోనే బాపట్ల స్వరూపం మారనుంది. వైసీపీ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం ఫలితంగా ఏర్పడిన జిల్లా మూడున్నరేళ్లకే స్వరూపం మారాల్సిన పరిస్థితి ఎదురైంది. ఆరు నియోజకవర్గాలు కాస్తా ఐదుకే పరిమితం కానున్నాయి. అద్దంకి ప్రకాశం జిల్లాలో భాగం కావడం వల్ల చీరాల రెవెన్యూ డివిజన్ ఐదు మండలాలకే పరిమితం కానుంది. పర్చూరు నియోజకవర్గంలోని మూడు మండలాలు చీరాల రెవెన్యూ డివిజన్‌లో భాగం కాగా, మరో మూడు బాపట్ల డివిజన్‌లో భాగంగా ఉన్నాయి. వీటి విషయంలో కూడా మార్పులు, చేర్పులపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే జిల్లాకు గ్రానైట్ ఫ్యాక్టరీల పరంగా అద్దంకి తలమానికంగా ఉండేది. ఇప్పుడు మార్టూరు మండలం ఒక్కటే గ్రానైట్ రంగానికి అడ్రస్‌గా జిల్లాలో మిగలనున్నది. ఇవే కాకుండా జిల్లాకు పన్నుల రూపంలో వచ్చే ఆదాయంలో కూడా భారీగా కోత పడనున్నది. స్వరూపం మార్చుకుని ఐదు నియోజకవర్గాలతో పునర్విభజించబడే బాపట్ల జిల్లాకు అద్దంకి లేని లోటు ఇకపై స్పష్టంగా కనబడనుంది



ప్రస్తుతం జిల్లాలో ఇద్దరు మంత్రులు

రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇద్దరూ బాపట్ల జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న వారే. అద్దంకి ప్రకాశం జిల్లాలోకి వెళ్లడం ఖాయమైంది కనుక, మంత్రి రవికుమార్ ప్రకాశం జిల్లా పరిధిలోకి వెళ్తారు. అప్పుడు జిల్లా పరిధిలో అమాత్యులుగా మంత్రి అనగాని ఒక్కరే ఉండనున్నారు.


బంగారం దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

బంగారం దుకాణంలో తనిఖీలు

- తూకంలో వ్యత్యాసం.. రూ.2 లక్షల జరిమానా
- ఆలస్యంగా వెలుగులోకి.. వినియోగదారుల ఆందోళన

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతలశాఖ అధికారుల తనిఖీల్లో చీరాలలో కొందరు బంగారు దుకాణదారుల దోపిడీ వెలుగుచూసింది. తనిఖీలో తూకంలో వ్యత్యాసాన్ని గుర్తించిన అధికారులు దుకాణదారుడికి జరిమానా విధించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శుక్రవారం తూనికలు, కొలతలశాఖ శాఖ జాయింట్ కంట్రోలర్ మాధురి సహాయ కంట్రోలర్ లిల్లీ, ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వరరావు, రామదాసు ఓ దుకాణంలోకి వెళ్లారు. నల్లపూసల తాడుకు పూసలు తొలగించి తూకాన్ని పరిశీలించారు. దానికి తొలుత ఉన్న ట్యాగుకు, వాస్తవ తూకానికి మధ్య వ్యత్యాసం సుమారు 250 నుంచి 300 వరకు మిల్లీ గ్రాముల ఉన్నట్లు అధికారులు గుర్తించి దుకాణదారుడిపై కేసు నమోదు చేశారు. రూ2 లక్షల జరిమానా విధించారు. పట్టణంలోని వెంకటరమణ జ్యూయలర్స్‌లో శుక్రవారం తనిఖీలు నిర్వహించామని, తూకాల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించినట్లు అధికారి పి.లిల్లీ తెలిపారు. ఇకపై తనిఖీలు నిత్యం ఉంటాయని, వినియోగదారులను మోసగిస్తే కఠిన చర్యలు తీసుకుం టామన్నారు. ఈ ఘటన విషయం బహిర్గతం కావడంతో అప్పటి వరకు కొనుగోలు చేసిన ఆభరణాల పరిస్థితిపై వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.


షాపు యజమానితో మాట్లాడుతున్న వేమూరు సీఐ రామాంజనేయులు

చీటింగ్ కేసులో హైడ్రామా

- పోలీసులపై తిరగబడిన బంగారు వ్యాపారులు
- పోలీసులకు చిక్కిన మణికంఠ సొసైటీ నిర్వాహకుడు

వేమూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఇస్తానని ప్రజలను మోసం చేసి పరారైన సొసైటీ యజమాని ఆరు నెలల తర్వాత పోలీసులకు చిక్కాడు. అతడు మోసాల్ని అంగీకరించగా వాటి ఆధా రంగా పోలీసులు బంగారం రికవరీకి సిద్ధమవగా హైడ్రామా నెలకొంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. తెనాలికి చెందిన కొల్లూరు ఉదయవెంకటేశ్వరరావు అనే వ్యాపారి చావలి గ్రామంలో మణికంఠ కో-ఆపరేటివ్ సొసైటీ అనే సంస్థ ఏర్పాటు చేసి బంగారం తా కట్టు రుణాలతో పాటు ఆర్‌డీలు చేయించుకున్నాడు. దాదాపుగా రూ.15 కోట్లతో పరారవగా బాధితులు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సోమవారం అతడ్ని అదు పులోకి తీసుకుని సీఐ రామాంజనేయులు విచారించారు. అతడు చెప్పిన వివరాల మేరకు నిందితుడితో కలిసి సోమవారం రాత్రి తెనాలిలో బంగారం రికవరీకి పోలీసులు వెళ్లగా దుకాణ యజమానులు కొందరు దాడికి ప్రయత్నించారు. పోలీసులను అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో జితేంద్రతో పాటు గొడవకు దిగిన మరో మహిళను పోలీసులు తెనాలి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మార్వాడీలు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. చట్ట ప్రకారంగా కేసు పరిశీలించి బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

సన్నద్ధత.. ఉత్తదే



● బ్యాంకు గ్యారెంటీలపై గందరగోళం ● ఆర్ఎస్‌కేల్లో కానరాని తేమ యంత్రాలు ● నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ● ఇప్పటివరకు 107 టన్నులు మాత్రమే సేకరణ ● అల్పపీడన హెచ్చరికలతో అన్నదాతల్లో వణుకు

(బాపట్ల, అమృతలూరు - ఆంధ్రజ్యోతి)

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఖరీఫ్ సీజన్‌లో రెండు లక్షల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతిస్తున్నట్లు ప్రభుత్వం నెల క్రితమే ప్రకటించింది. సేకరణకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని వారం క్రితమే జిల్లాలో 117 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు అధికారులు ఘనంగా ప్రకటించారు. కానీ కొనుగోళ్లకు సన్నద్ధత ప్రకటనలకే పరిమితమని తేలింది. కొనుగోళ్ల ప్రక్రియలో కీలకమైన ఈ-పంట నమోదు, తేమ శాతం పరికరాలు, మిల్లర్ల బ్యాంకు గ్యారెంటీల వరకు అంతా డొల్లేనని తేలింది. పైగా కొనుగోలు కేంద్రాలు తెరిచాక, తాపీగా బ్యాంకు గ్యారెంటీలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు చెప్పడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉంటే ఓ వారం అటోఇటో రైతులు ధాన్యాన్ని మద్దతు ధరకు కేంద్రాల వద్ద అమ్ముకునే వారు. కానీ అల్పపీడన హెచ్చరికలతో వర్షాల భయం వెం టాడుతుండగా అన్నదాతలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. 117 కేంద్రాలు ప్రారంభించినా బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వకపోవడంతో మ్యాపింగ్ జరగకపోవడంతో ధాన్యం సేకరణ ముందుకు సాగడం లేదు. దాదాపు రెండు వేల టన్నుల ధాన్యం నూర్పిడి జరిగి, అమ్మ కానికి సిద్ధంగా ఉన్నాయి. కానీ మంగళవారం సాయంత్రం వరకు నామమాత్రంగా 25 ఆర్ఎస్‌కేల పరిధిలో కేవలం 107 టన్నుల ధాన్యం సేకరణకే యంత్రాంగం పరిమిత మైంది. అమృతలూరు మండల పరిధిలోని 14 రైతు సేవా కేంద్రాలు ఉండగా కేవలం 4 కేంద్రాల్లో మాత్రమే తేమ శాతం యంత్రాలు ఉన్నాయి. కలెక్టర్ కేంద్రాన్ని సందర్శించి ఆదేశాలు ఇచ్చినా ఇంత వరకు కొనుగోలు పక్రియ ప్రారంభం కాలేదు. వర్షాలు పడితే పంట ఎక్కడ దెబ్బతింటుందో అన్న భయంతో రైతులు యంత్రాల ద్వారా కోసి అయిన కాడికి అమ్ముకునేందుకు సిద్ధమయ్యారు. ఇదే అదనుగా దళారులు 75 కిలోల ధాన్యం బస్తాకు రూ.1300 ధర ఇస్తుండటంతో రైతన్న నష్టపోతున్నాడు.

కేవలం రూ.8.36 కోట్లకే బ్యాంకు గ్యారెంటీ

రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు బ్యాంకు గ్యారెంటీగా మిల్లర్ల నుంచి దాదాపు రూ.150 కోట్ల వరకు రావాల్సి ఉంది. కానీ మంగళవారం వరకు 9 మిల్లుల పరిధిలో కేవలం రూ.8.36 కోట్లు మాత్రమే వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో దాదాపు 60 శాతం ఈ రెండు రోజుల్లో వచ్చినవే. అంటే బ్యాంకు గ్యారెంటీలపై ఎలాంటి సన్నద్ధత లేకుండానే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి అధికారులు ఇప్పుడు హడావిడి చేస్తున్నట్లు అర్థమవుతుంది.

యోగా చాంపియన్.. తూర్పుగోదావరి

విజయవంతంగా ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

పంగులూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక చందలూరు ఉన్నత పాఠశాల వేదికగా ఎస్.జి.ఎఫ్ రాష్ట్రస్థాయి యోగా పోటీలు మంగళవారంతో విజయవంతంగా ముగిశాయి. మూడు రోజులుగా జరిగిన అండర్-14, 17, 19 విభాగాల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ తూర్పు గోదావరి జిల్లా విద్యార్థులకు దక్కింది. బాలికల విభాగం ట్రెడిషనల్ యోగా పోటీలో కె.హారిక(విశాఖ) బి.దీపిక(చిత్తూరు), ఎం.కాజాబి(గుంటూరు), ఆర్టిస్టిక్ సింగిల్‌లో ధనలక్ష్మి(విశాఖ), దీపిక (చిత్తూరు), శార్వాణి (విజయనగరం), ఆర్టిస్టిక్ పెయిర్‌లో పి.రమా సాహితి, పి.లక్ష్మీసాహిత్య(విశాఖ), వై.ముకుందశ్రావ్య, వి.తష్మీన్ (ప్రకాశం), ఎన్.శరణ్య, ఎస్.హేమశ్రీ (పశ్చిమగోదావరి), అండర్ -19 రిథమిక్‌లో కె.హారిక, బి.సంధ్య(విశాఖ), పి.డి.తనుశ్రీ, జి.ఆర్.సౌజన్య (తూర్పుగోదావరి), ఎస్.ఎల్.ప్రసన్న, ఎ.ఎల్.మనూజ(పశ్చిమ గోదావరి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. బాలుర విభాగంలో ఆర్టిస్టిక్ పెయిర్‌లో కార్తీక్, వేదశివానంద్(విశాఖ), చేతనగౌడ్, రఘు (అనంతపురం), యం.రెడ్డి, శంకర్‌నాయక్(కర్నూల్), అండర్ 19 సింగిల్‌లో యం.అశోక్‌కుమార్(అనంతపురం), ఎ.మనోహర్(కృష్ణ), డి.లలిత్ కుమార్ (చిత్తూరు), రిథమిక్ పెయిర్‌లో టి.సంపత్‌కుమార్, ఎస్.సూర్య హర్షకుమార్(తూర్పుగోదావరి), వి.రామ్‌చరణ్, పి.తరుణ్‌కుమార్ (అనంతపురం), పి.చరణ్, ఎస్.కె.సాహెల్(కర్నూల్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కాగా ఆయా విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు క్రీడల పరిశీలకులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. మంగళవారం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో రాష్ట్ర క్రీడల పరిశీలకులు పూర్ణచందరరావు, రాజ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, నిర్వాహక కమిటీ చైర్మన్ కొండా ప్రతిమ, ప్రతినిధులు అడ్డగడ సుబ్బయ్య, పెంట్యాల రామలింగస్వామి, అజిత్ ట్రస్ట్ చైర్మన్ వడ్లవల్లి వీరనారాయణ, పి.డి.మధుమూర్తి, ప్రధానోపాధ్యాయులు చందలూరి గిరిజ, గుమ్మా శ్రీనివాసరావు, ఆర్.నాగేశ్వరి, సమత, రామారావు, యం.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆల్‌రౌండ్ ఛాంపియన్‌గా నిలిచిన తూర్పు గోదావరి క్రీడాకారులు

మెప్మాలో మరో దారుణం..!

బ్యాంకు రుణాల రిపోర్టులు మాయం..!

బ్యాంకు లింకేజి అధికారి తీరుపైనా అనుమానం

టార్గెట్‌ల కోసం బ్యాంకర్లు బోగస్‌కు సహకారం

ఘోరంగా మోసపోతున్న అమాయక సభ్యులు

అవినీతిపై ఏడుగురితో విచారణ చేపట్టిన పీడీ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మెప్మాలో అవినీతి భాగోతం తవ్వే కొద్దీ బయటపడుతోంది. దీంతో అక్రమార్కులు అడ్డదారులు తొక్కినట్లు తెలిసింది. ఏకంగా రికార్డులనే మాయం చేసే స్థాయికి వ్యవహారం వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. కొద్దిరోజులుగా ఆంధ్రజ్యోతిలో ప్రచురితమవుతున్న కథనాలతో మెప్మా కార్యాలయంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు బోగస్ భాగోతం తేల్చడానికి విచారణ కమిటీలను నియమించారు. ముఖ్యంగా బ్యాంకుల ద్వారా రుణం పొందిన పొదుపు సభ్యుల వివరాలు కార్యాలయంలో పనిచేసే బ్యాంకు లింకేజి అధికారి వద్ద పూర్తి సమాచారం ఉండాలి. ప్రతినెలా బ్యాంకుల నుంచి నివేదికలను తీసుకుని, వాటిని భద్రపరచాలి. ఏ బ్యాంకులో ఎన్ని పొదుపు సంఘాలకు రుణాలు ఇచ్చారు. ఎంతెంత ఇచ్చారో రికార్డు చేయడంతోపాటు, మున్సిపాలిటీల వారీగా నెలవారీ రుణాల మంజూరు జాబితాను తయారుచేయాల్సిన బ్యాంకు లింకేజి అధికారి చుట్టూ వ్యవహారం తిరుగుతోంది. రెండు రోజులుగా జరుగుతున్న విచారణలో బ్యాంకు లింకేజి ఫైళ్లు, రిపోర్టులు అందించాలని కోరగా, ఒక్కటి కూడా లేకుండా మాయం చేయడంపై ఇప్పుడు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. 2022 నుంచి నేటి వరకు బోగస్ గ్రూపుల కథ మొదలైనట్లు సమాచారం. అయితే నెలవారీ జాబితా, రిపోర్టులు ప్రస్తుతం కనిపించడం లేదని తేల్చి చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆ ఉద్యోగి ఇచ్చే సమాచారంపైనే వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది. కానీ ఆ అధికారి మాత్రం అధికారులు అడిగిన సమాచారం ఇవ్వకుండా విచారణకు అడ్డం తిరిగినట్లు సమాచారం. బోగస్ గ్రూపుల చిట్టా తేలాలంటే ఆ అధికారిని పూర్తిస్థాయిలో విచారిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు వెల్లడిస్తున్నారు.

బ్యాంకర్ల పాత్రపైనా అనుమానం

పట్టణ పొదుపు మహిళల కోసం ప్రభుత్వం అనేక పథకాలను, రుణాలు మంజూరు చేసి, ప్రోత్సహిస్తుంది. దీంతో పేద మహిళలు చిరువ్యాపారాలు చేసుకునేందుకు అవసరమైన రుణాల కోసం బ్యాంకర్ల చుట్టు కాళ్లరిగేలా తిరిగినా కనికరించరు. లక్షా తొంభై ఆంక్షలతో ఇబ్బంది పెట్టే బ్యాంకర్లు తమ పనితీరుకు విరుద్ధంగా బోగస్ గ్రూపులకు కళ్లు మూసుకుని కోట్లు మంజూరుచేయడంపైన అనుమానాలు కలుగుతున్నాయి. రూ.20లక్షల రుణాన్ని ఒక పొదుపు గ్రూపునకు మంజూరు చేయాలంటే వారందరు బ్యాంకు మేనేజరుకు కనిపించాలి. అలాగే మంజూరైన రుణం మొత్తం పొదుపు సభ్యుల బ్యాంకు ఖాతాల్లోకే జమచేయాలి. కానీ ఇక్కడ ఇవేమీ జరగలేదు. దీంతో కోట్లలో జరిగిన అవినీతిపైనా బ్యాంకర్ల పాత్ర ఉన్నట్లుగా తెలుస్తోంది. టార్గెట్‌ల కోసం, కొందరు సిబ్బంది కాసుల కక్కుర్తి కోసం బోగస్ గ్రూపులకు సహకరించినట్లు తెలుస్తోంది. మెప్మాలో జరుగుతున్న బోగస్ అవినీతికి ఫుల్‌స్టాప్ పెట్టాలంటే మొదటగా బ్యాంకుల్లోనే బ్రేక్ పడాల్సిన అవసరం ఉంది. ఇప్పటివరకు కొందరు బ్యాంకర్లు ఆర్పీలకు సహకరించడంతో భారీగా రుణాలు మంజూరయ్యాయి. కానీ అవి పొదుపు సభ్యులకు చేరలేదు. ఆ అవినీతిలో చేతివాటం చూపి ఆర్పీలు కోట్లకు పడగలెత్తారనేది బహిరంగ రహస్యం. పొదుపు సభ్యులను మోసం చేయడంలో బ్యాంకర్లు, ఆర్పీలు, సీవోలు, సీఎంఎంల పాత్ర లేకుండా ఇంతటి అవినీతికి అవకాశం లేదు. అయితే రుణాల మంజూరు చేసిన జాబితాలు కూడా బయటపెట్టకపోవడంతో బ్యాంకర్లపైనా అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆర్ఆర్ యాక్ట్ ద్వారా అన్నీ వసూలు చేస్తాం

- పి. శ్రీహరి, మెప్మా పీడి

మెప్మాలో పొదుపు సభ్యులకు జరిగిన అన్యాయంపై ఏడుగురు సభ్యులతో విచారణ మొదలుపెట్టాం. ప్రత్యేకించి బోగస్ గ్రూపుల జాబితా బ్యాంకుల నుంచి తెప్పిస్తున్నాం. మెప్మా కార్యాలయంలోనూ అవినీతి వ్యవహారం జరిగినట్లు తెలుస్తోంది. రుణాలు పొందిన సంఘాల జాబితా ప్రతినెలా తీసుకుని భద్రపరచాల్సి ఉంది. అయితే ఆ బాధ్యతలు చూసే బ్యాంకు లింకేజి అధికారిని రిపోర్టులు కోరితే నావద్ద లేదని సమాధానం చెబుతున్నారు. 2022 నుంచి రిపోర్టులు లేకపోవడంపైనా అనుమానాలు ఉన్నాయి. అలాగే యానాదుల సామాజికవర్గానికి చెందిన పొదుపుసభ్యులు ఫిర్యాదుతో విచారణ చేశాం. వారి బాధ్యతలు చూసే ఆర్పీ లాగిన్ నిలిపివేయడంతోపాటు, చోటుచేసుకున్న అవినీతిపై మెప్మా ఎండీ కార్యాలయానికి నివేదిక పంపాము. విచారణ పారదర్శకంగా నిర్వహిస్తాం. అవినీతికి పాల్పడిన వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటాము. రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద పతి పైసా తిరిగి కట్టిస్తాం. సహకరించని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. మెప్మాలో జరిగిన అవినీతిపై పూర్తి నివేదికను మెప్మా ఉన్నతాధికారులు, కలెక్టర్, ప్రజాప్రతినిధులకు అందజేస్తాం.

కల సాకారం!

నాలుగు నియోజకవర్గాలు రెండు రెవెన్యూ డివిజన్లు

మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా

పశ్చిమప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు


ప్రకాశంలోకి తిరిగి అద్దంకి,కందుకూరు

కొత్తగా అద్దంకి కేంద్రంగా రెవెన్యూ డివిజన్

అందులోకి దర్శి నియోజకవర్గం

మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులకు సీఎం ఆమోదం

నేడు కేబినెట్ అధికార ముద్రతో లైన్‌క్లియర్


అద్దంకి పట్టణం

మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా కావాలన్న పశ్చిమప్రాంత ప్రజల కల సాకారమైంది. దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న వారి ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త జిల్లా ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మొత్తం నాలుగు నియోజకవర్గాలతో జిల్లా ఏర్పడనుంది. అందులో రెండు డివిజన్లు ఉండనున్నాయి. ఉమ్మడి జిల్లాను నాటి వైసీపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా చేసిన విభజనతో దొర్లిన తప్పులను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం సరిచేసింది. ఇక అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను తిరిగి ప్రకాశం జిల్లాలోకి రానున్నాయి. అలాగే దర్శి, అద్దంకి నియోజకవర్గాలను కలిపి అద్దంకి డివిజన్ ఏర్పాటు చేయనున్నారు. త్వరలో జరగనున్న మంత్రివర్గ సమావేశం అధికార ముద్ర పడిన వెంటనే ప్రక్రియ మొదలుకానుంది.

ఒంగోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రాంతంలోని మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాలతో ఈ జిల్లా ఆవిర్భవించనుంది. అందులో మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లు ఉండనుండగా వాటి పరిధిలో 21 మండలాలు ఉండనున్నాయి. అదేసమయంలో గతంలో ఉమ్మడి జిల్లా నుంచి బాపట్ల జిల్లాలోకి వెళ్లిన అద్దంకి, నెల్లూరు జిల్లాలోకి వెళ్లిన కందుకూరు నియోజకవర్గాలు తిరిగి ఒంగోలు కేంద్రంగా ఉన్న ప్రకాశం జిల్లాలోకి చేరనున్నాయి. ఈ పరిధిలో ప్రస్తుతం ఒంగోలు రెవెన్యూ డివిజన్ ఉండగా గతం నుంచి డివిజన్ కేంద్రంగా ఉన్న కందుకూరు డివిజన్ కలవడంతోపాటు కొత్తగా అద్దంకి డివిజన్ ఏర్పాటు కానుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతల సూచనలకు ప్రాధాన్యత ఇస్తూ మంత్రివర్గ ఉపసంఘం ఈ మేరకు సిఫారసు చేయగా విస్తృత కసరత్తు అనంతరం సీఎం చంద్రబాబునాయుడు అందుకు మంగళవారం ఉపసంఘంతో జరిగిన భేటీలో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

అప్పట్లో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం అనంతరం తొలిగా 1970లో ఒంగోలు కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పడిన విషయం విదితమే. అప్పటివరకు గుంటూరులో ఉన్న ఒంగోలు డివిజన్, నెల్లూరు జిల్లాలో ఉన్న కందుకూరు డివిజన్, కర్నూలు జిల్లాలో ఉన్న మార్కాపురం డివిజన్‌లను కలిపి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా జిల్లా ఏర్పాటు చేశారు. అనంతరం రెండేళ్లకు జిల్లాకు చెందిన ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు పేరును పెట్టారు. అలా ప్రకాశం జిల్లాగా మార్పు జరిగిన 52 ఏళ్లకు వైసీపీ ప్రభుత్వంలో జిల్లాల పునర్విభజన జరగ్గా అశాస్త్రీయంగా చేశారు. ఒంగోలుకు సుదూరంగా ఉన్న మార్కాపురం ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా చేయాలని ఆ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లగా కోరుతున్నా వారి కోరిక న్యాయమైనా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. పార్లమెంటు స్థానం యూనిట్ పేరుతో పశ్చిమ ప్రాంతం మొత్తాన్ని ప్రకాశం జిల్లాలోనే ఉంచి, ఒంగోలుకు సమీప ప్రాంతామైన కందుకూరు నియోజకవర్గాన్ని సుదూరమైన నెల్లూరు జిల్లాలోకి, అద్దంకి నియోజకవర్గాన్ని ఏరంకంగాను అనువు లేని బాపట్ల జిల్లాలోకి మార్చారు. ఆ మార్పుపై అన్ని ప్రాంతాల ప్రజల్లోను తీవ్ర నిరసన వ్యక్తమైనా ఆనాటి సీఎం జగన్ ఏ మాత్రం పట్టించుకోకుండా విభజన చేశారు.

ఇచ్చిన మాట ప్రకారమే జిల్లా

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు, కందుకూరు, అద్దంకి యోజకవర్గాలను తిరిగి ఒంగోలు జిల్లాలోకి చేర్చుతానని చంద్రబాబు, యువగళం పాదయాత్ర సమయంలో యువనేత నారా లోకేష్‌లు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ హామీకి కట్టుబడి ప్రస్తుతం పునర్విభజనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అయితే దర్శి నియోజకవర్గాన్ని కూడా తొలుత మార్కాపురం జిల్లాలోకి చేర్చుతారన్న చర్చ సాగినప్పటికీ ఆ ప్రాంత ప్రజల కోరిక మేరకు ప్రకాశంలోనే ఉంచారు. అంతేకాక మంత్రి రవికుమార్ సూచన మేరకు కొత్తగా అద్దంకి డివిజన్ ఏర్పాటు జరగనుండగా, దర్శి నియోజకవర్గం మొత్తాన్ని అద్దంకి డివిజన్‌లోకి చేర్చారు. తద్వారా వారికి డివిజన్ కేంద్రం దగ్గరకానుంది. మరోవైపు మార్కాపురం జిల్లాతో పాటు ఆ ప్రాంతంలో గిద్దలూరు డివిజన్ ఏర్పాటును తొలుత పరిశీలన చేసినా తర్వాత దానిని ఆపేసి కనిగిరి డివిజన్‌లోకి గిద్దలూరు నియోజకవర్గం మొత్తాన్ని చేర్చారు. అలాగే మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాలను మార్కాపురం డివిజన్‌లో ఉంచారు. ఈ మేరకు బుధవారంజరగనున్న కేబినెట్ సమావేశంలో ఆమోద ముద్ర వేయనున్నారు. తాజా పునర్విభజనపై మంత్రి స్వామి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ అన్ని ప్రాంతాల ప్రజల ఆకాంక్ష, ఆ ప్రాంత ప్రజాప్రతినిధుల సూచనలను పరిగణనలోకి తీసుకునే సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం చేశారన్నారు. రెండు ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రణాళికాబద్ధ కార్యాచరణతో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాల మెరుగునకు చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం చంద్రబాబు ఇతర మంత్రివర్గ ఉపసంఘ సభ్యులకు ఈ సందర్భంగా ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటర్లు

నూరుశాతం రాయితీపై అందించనున్న ప్రభుత్వం

ఈనెల 25 వరకు దరఖాస్తుకు గడువు

30 వరకు పొడిగిస్తూ ప్రభుత్వ నిర్ణయం

జిల్లాకు 80 మందికి అందజేయనున్న ప్రభుత్వం

ఒంగోలునగరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం దివ్యాంగులకు తీపి కబురు చెప్పింది. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉండగా దివ్యాంగులకు ఉచితంగా మూడు చక్రాల స్కూటర్లను అందజేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి వారికి ఈ వాహనాలను ఉచితంగా అందజేయబోతోంది. ఇందుకోసం ఈనెల 25వ తేదీలోగా దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అయితే ప్రభుత్వం ఆ గడువును ఈనెల 30వరకు పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 10 స్కూటర్లను దివ్యాంగ లబ్ధిదారులకు అందజేయనుంది. ఈ లెక్కన ప్రభుత్వం జిల్లాలోని 8 నియోజకవర్గాలకు 80 స్కూటర్లను ఇవ్వనుంది. 70శాతం కంటే పైన వికలత్వం కలిగి వాహనాన్ని నడపగలిగిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఈ వాహనాలను అందించనుంది. ఇందు కోసం దివ్యాంగులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను పంపుకోవాల్సి ఉంది. 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు ఉన్నవారు ఈ వాహనాలను పొందేందుకు అర్హులు.

డ్రైవింగ్ లైసెన్సులు లేక ఇబ్బందులు

రాష్ట్రప్రభుత్వం ఉచితంగా దివ్యాంగులకు అందించే మూడు చక్రాల మోటార్ వాహనాలను పొందేందుకు డ్రైవింగ్ లైసెన్సును తప్పనిసరి చేసింది. దీంతో అనేక మంది దివ్యాంగులు లైసెన్సులు లేక దరఖాస్తు చేసుకునేందుకు కూడా అర్హత కోల్పోయారు. ఇదే విషయాన్ని దివ్యాంగుల యూనియన్ నాయకులు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ దృష్టికి తీసుకుపోయారు. దీంతో ఆయన స్పందించారు. దివ్యాంగులకు లైసెన్సులు జారీ చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించారు. ఈనెల 21 నుంచి ఒంగోలులో దివ్యాంగులకు లెర్నర్ లైసెన్సు జారీ చేసే కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. రవాణా శాఖ అధికారులు వీరికి ప్రత్యేకంగా లెర్నర్ లైసెన్సులు జారీచేయనున్నారు. ఇలా లెర్నర్ లైసెన్సులు పొందితే వీరు ప్రభుత్వం ఇచ్చే మూడు చక్రాల మోటారు వాహనాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హత పొందుతారు.

సదరమ్ సర్టిఫికెట్ తప్పనిసరి

దరఖాస్తు చేసేవారు వైద్యఆరోగ్యశాఖ ద్వారా జారీ చేసిన సదరమ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. ఆధార్ కార్డు, పదవ తరగతి ఉత్తీర్ణత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు విద్యార్థులు అయితే బోన్‌ఫైడ్ సర్టిఫికెట్, స్వయం ఉపాధి, ఏదైనా సంస్థలో పనిచేస్తున్న వారు అయితే ఉపాధి ధ్రువపత్రంతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ వాహనాలను పొందేందుకు కుటుంబ వార్షికాదాయం రూ.3లక్షలకు మించకూడదు. వాహనం నడిపేందుకు అవసరమైన డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి. గతంలో ప్రభుత్వం ద్వారాగాని, ప్రయివేట్ సంస్థల ద్వారాగాని ఈ యూనిట్‌ను తీసుకొని ఉండరాదు. దరఖాస్తుదారుని పేరుపైన ఇతర మోటారు వాహనం ఉంటే ఈ యూనిట్‌ను పొందేందుకు అనర్హులు అవుతారు. చదువు కొనసాగిస్తున్న వారిలో గ్రాడ్యుయేషన్ ఆ పైస్థాయి చదువులు చదివే వారికి ప్రాధాన్యత ఉంటుంది. పదవ తరగతి చదివి స్వయం ఉపాధి యూనిట్లు నడుపుతున్న దివ్యాంగులు, ఇతర విభాగాల్లో జీవనోపాధి పొందుతున్న వారికి కూడా ఈ స్కూటర్లు మంజూరు చేస్తారు. ఈ నెల 25వ తేదీ వరకు అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ అర్హులను ఎంపిక చేస్తోంది.

గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్న యోగా క్రీడ

ప్రజలలో పెరిగిన అవగాహన

పంగులూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : "నగరాలకు, పట్టణాలకే పరిమితమైన యోగా నేడు గ్రామీణ ప్రాంతానికి విస్తరించింది.. 2015 జూన్ 21న అంతర్జాతీయ యోగాడేగా గుర్తించడంతో ఈ క్రీడ విశ్వవ్యాప్తమైంది.. యోగా అంతర్ముఖమైంది, దీని ఫలితాలు దీర్ఘకాలంలో గుర్తించగలుగుతారు.." పంగులూరు మండలం చందలూరు గ్రామంలో మంగళవారం ముగిసిన రాష్ట్రస్థాయి యోగా పోటీల సందర్భంగా యోగా ప్రాధాన్యతను, అవసరాన్ని రాష్ట్ర పరిశీలకులు పూర్ణచందరరావు, రాజ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసరెడ్డిలు మంగళవారం ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

ప్రజల్లో పెరిగిన అవగాహన

అతి పురాతనమైన విద్యలలో ఒకటైన యోగాకు నేడు ప్రజల్లో అవగాహన పెరిగింది. యోగా సాధనతో విలువలు, వికాసం పెంపొందడంతో పాటు ఒత్తిడిని తట్టుకొనే శక్తి సిద్ధిస్తుంది. స్వయంశక్తితో ఎదిగేందుకు, స్వయం ఉపాధికి యోగా నేటి తరానికి ఓ విలువైన సాధనం. ఏడాది కాలంగా యోగా విద్యలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. కనీసం 250 ఆసనాలు అవపోశన పట్టినవారే ఈ క్రీడా పోటీలలో రాణించగలుగుతారు. పాఠశాల స్థాయి నుంచి యోగ విద్య సాధన చేస్తేనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలుగుతారు. ఎన్ఐఎస్ శిక్షణ పొందిన న్యాయనిర్ణేతలు ఎంతో పారదర్శకంగా విజేతలను నిర్ణయించారు.

పూర్ణచందరరావు, రాష్ట్రస్థాయి పోటీల పరిశీలకులు, కృష్ణజిల్లా

ఏకాగ్రతతోనే లక్ష్యసాధన



ఏకాగ్రతతోనే యోగాలో రాణించగలుగుతాం. నిర్దేశిత లక్ష్యం, నిరంతర సాధన యోగాలో ఎదిగేందుకు, విజయం సాధించేందుకు దోహదపడుతుంది. టిస్టింగ్, ఫార్వర్డ్ బెండింగ్, బ్యాక్‌వర్డ్ బెండింగ్, లెగ్‌బ్యాలెన్స్, హ్యాండ్ బ్యాలెన్స్, నిలబడి, కూర్చొని చేసే ఆసనాలపై పట్టుసాధించాలంటే ఏకాగ్రతతో కూడిన నిరంతర సాధన, ఎంతో అవసరం.

- రాజ్‌కుమార్, బాలికల పోటీల పరిశీలకులు, తూర్పు గోదావరి.

ఒత్తిడి సమస్యకు పరిష్కారం



ఒత్తిడితో కూడిన జీవన విధానం నుండి ఉపశమనం పొందేందుకు ఏకైక మార్గం యోగా. 15 ఏళ్లగా యోగ విద్యకు ఆదరణ పెరిగింది. గత ఏడాది జూన్ 21న విశాఖలో జరిగిన అంతర్జాతీయ యోగాడేతో గ్రామీణ ప్రాంతాలకు యోగా విస్తరించింది. మారుమూల గ్రామమైన చందలూరులో నగరాలకు దీటుగా రాష్ట్ర స్థాయి యోగా పోటీల నిర్వహణ ఇందుకు నిదర్శనం. ఇక్కడి ఆతిథ్యం చక్కగా ఉంది.

- డాక్టర్ శ్రీనివాసరెడ్డి అండర్-19 పోటీల పరిశీలకులు.

ఐఎంఏ జిల్లా నూతన కమిటీ


ఎంపికైన నూతన కమిటీ సభ్యుడు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. ఒంగోలులోని ఐఎంఏ హాలులో జరిగిన ఎన్నికల ప్రక్రియలో అధ్యక్షుడిగా డాక్టర్ ఎ.నాగయ్యనాయుడు, కార్యదర్శిగా ఎం.ఆనంద్, కోశాధికారిగా కె.సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డాక్టర్ మన్నే వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో ఎన్నికలు జరగ్గా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జాలాది మణిబాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు శివ, సీతారామయ్య, అపర్ణ, స్నేహ, స్వామి, ప్రశాంతి, రంగనాథ్‌బాబు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులకు క్రీడా పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను ప్రోత్సహించేందుకు జిల్లా క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 27న ఒంగోలులోని మినీ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడాశాఖ అధికారి జి.రాజేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 బ్యాడ్మింటన్, అండర్ -20, జూనియర్స్ కేటగిరిలో చెస్, 100 మీటర్లు షార్ట్ పుట్, డిస్కస్ త్రో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎవరైనా వైకల్య నిర్ధారణ ధృవపత్రంతో ఉదయం 9గంటలకు మినీ స్టేడియం వద్దకు హాజరు కావాలన్నారు.

ద్విచక్ర వాహనంలో ఉంచిన రూ.లక్ష చోరీ

వాహనం పక్కన ఉంచి టిఫిన్ చేస్తుండగా ఘటన

విచారణ చేపట్టిన చీరాల పోలీసులు

పేరాల(చీరాల), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంలో డబ్బులు ఉంచి టిఫిన్ చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీకు పాల్పడ్డారు. అందిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని బోయినవారిపాలెంకు చెందిన పులి శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం సీడీఎం మిషన్ ద్వారా బ్యాంకులో నగదు జమ చేసేందుకు వెళుతూ పేరాల వద్ద నగదును వాహనంలో ఉంచి రోడ్డు పక్కన టిఫిన్ చేశాడు. కొద్దిసేపటి తరువాత చూసుకోగా వాహనంలో నగదు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. ఈ మేరకు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవీఇవీ

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు చినగంజాం విద్యార్థులు


పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

చిన గంజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సత్యం హై స్కూల్‌కు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ నున్నా హరనాథ్‌బాబు మంగళవారం తెలిపారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గాలి శ్రీనివాసరెడ్డి ఇటీవల కర్నూలు జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్ జిల్లాల అండర్-17 కబడ్డీ పోటీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా తరఫున పాల్గొన్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీనివాసరెడ్డి ప్రతిభ సాటి అండర్-17 రాష్ట్ర కబడ్డీ బాలుర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో జరగనున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలలో శ్రీనివాసరెడ్డి రాష్ట్ర అండర్-17 బాలుర కబడ్డీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పాఠశాల డైరెక్టర్ తెలిపారు. రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికైన శ్రీనివాసరెడ్డికి పాఠశాల డైరెక్టర్ హరనాథ్‌బాబు, హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు టి.రమేష్‌బాబు, విజయ్‌కుమార్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు వాడరేవు విద్యార్థిని

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని వాడరేవు ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని పిక్కీ ఝాన్సీ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. మత్స్యకార కుటుంబానికి చెందిన చిన్నారి ఇటీవల మచిలీపట్నంలో జరిగిన అండర్ -14 విభాగంలో ఉత్తమ ప్రదర్శన అందించింది. దీంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు రత్నకుమారి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సుమన్, సుమలత తదితరులు ఝాన్సీని అభినందించారు.

సెయింట్ ఆన్స్ అధ్యాపకునికి జాతీయ అవార్డు


అధ్యాపకునికి అవార్డు పత్రాన్ని అందిస్తున్న ప్రతినిధులు

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల అధ్యాపకులు టీ గోపాలరావుకు జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అవార్డు గ్రహీత అకడమిక్ ఇయర్ ఉత్తమ బోధనకు న్యూఢిల్లీ ఆల్ఫా ఇంటర్నేషనల్ పబ్లికేషన్స్ సంస్థ అవార్డును అందించింది. ఈక్రమంలో మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపల్ జగదీష్, ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.లక్ష్మీతులసీ చావలి, మొదటి సంవత్సరం ఇన్‌చార్జ్ అమర్‌నాద్ బాబు, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

అయ్యప్ప శరణు ఘోషతో పులకించిన పూసపాడు


పూసపాడులో చేస్తున్న అయ్యప్ప పడిపూజ

ఇంకొల్లు,నవంబరు 25,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూసపాడులో అయ్యప్పస్వామి పడి భజనా అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త రఘురాం గురుస్వామి ఆధ్వర్యంలో పడి భజనా కార్యక్రమం నిర్వహించారు. భారీ ఎత్తున అరటి మందిరాలు ఏర్పాటు చేశారు. అయ్యప్ప శరణఘోషతో పూసపాడు పులకించింది. గురుస్వాములతో అయ్యప్పకు ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా పూలు, పండ్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో మాలధారణ చేసిన స్వాములు హాజరై పూజలో పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాలు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

క్రికెటర్ కరుణకుమారికి 'గొట్టిపాటి' రూ.5 లక్షల ప్రోత్సాహం

అమరావతి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత జట్టు అంధుల మహిళా టీ 20 వరల్డ్ కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన విశాఖ బాలికల అంధుల రెసిడెన్షియల్ విద్యార్థిని కరుణ కుమారికి కిషోర్ గ్రానైట్స్ అధినేత గొట్టిపాటి హర్ష రూ. 5 లక్షల ప్రోత్సాహకం ప్రకటించినట్లు రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో కరుణకుమారి చూపిన ప్రతిభకు ప్రోత్సాహకంగా గొట్టిపాటి హర్ష ప్రోత్సాహకం ప్రకటించినట్లు మంత్రి తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముందుకు రావడం అభినందనీయమని హర్షకు అభినందనలు తెలియజేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

నేను మంత్రి గారి ఇలాకా...!

రెచ్చిపోతున్న అధికారి.. మైనింగ్ శాఖలో కోల్డ్‌వార్

కార్యాలయం భూమిపూజలో ప్రస్ఫుటం

ఒంగోలు క్రైం,నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గనులు, భూగర్భవనరుల శాఖ కార్యాలయంలో ఓ అధికారి పనితీరుపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. 'నేను మంత్రిగారి ఇలాకా' అంటూ ఓ అధికారి కార్యాలయంలో అన్నీ పనులు చక్కబెడుతున్నారు. ఈనెల 23న ఒంగోలు సౌత్ బైపాస్ రోడ్డులో గనులు శాఖకు సంబంధించిన కార్యాలయం నిర్మాణం కోసం ఇరువురు మంత్రులు చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంతా తానే అన్నట్లుగా పనులు చక్కబెట్టిన అధికారి శిలాఫలకంపై వేసిన పేర్ల విషయంలో కూడా వివాదాస్పదులుగా మారారు. ఎక్కడా భూగర్భగనుల శాఖ కార్యాలయం సిబ్బంది అని రాయకపోవడం అక్కడ పనిచేసే వారంతా మనస్తాపానికి గురయ్యారు. దీంతో శనివారం సాయంత్రం విషయాన్ని కార్యాలయంలో పనిచేస్తున్న ఉన్నతాధికారి దృష్టికి సిబ్బంది తీసుకెళ్లారు. అంతే కాదు తాము ఆదివారం జరిగే కార్యక్రమానికి రాలేమని కూడా చెప్పారు. ఈ మేరకు సిబ్బందిని ఉన్నతాధికారి బుజ్జగించి తమ కార్యాలయం కోసం శంకుస్థాపన జరుగుతుందని సర్దిచెప్పారు. అదేసమయంలో గనుల శాఖలో మరో విభాగంలో పనిచేసే అధికారి పేరు శిలాఫలకం మీద లేకపోవడం గుర్తించారు. దీంతో ఆ అధికారి మరింత కోపోద్రిక్తుడై తన కంటే తక్కువ స్థాయి అధికారుల పేర్లు శిలాఫలకం మీద ఉన్నాయి.. తన పేరు లేకపోవడం ఏమిటి అంటూ ఉన్నతాధికారి దగ్గరకు పోయినట్లు తెలిసింది. దీంతో ఉన్నతాధికారి తనకేమీ తెలియదని వెంటనే మార్పులు చేయిస్తానని చెప్పి, అధికారి పేరును ప్రింట్ చేసిన స్టిక్కర్లతో వేయించారు. శిలాఫలకంపై జరిగిన చర్చను కొంతమంది గ్రానైట్ యజమానులు ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. కార్యాలయంలో తాను మంత్రి గారి ఇలాకా అని చెప్పుకునే అధికారి నిర్వాకం సిబ్బంది, అధికారుల మధ్య కోల్డ్‌వార్‌గా మారింది. ప్రస్తుతం సిబ్బంది ఈ వ్యవహారంపై కినుక వహించినట్లు తెలిసింది.

గోతులమయంగా పంగులూరు- ముప్పవరం రహదారి

రాకపోకలకు అవస్థలు పడుతున్న వాహనచోదకులు

పంగులూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పంగులూరు - ముప్పవరం గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గోతులపై రాకపోకలు సాగించడం యిబ్బందిగా మారింది. మండల కేంద్రం నుంచి ముప్పవరం చేరుకునే ప్రధాన రహదారిలో జనకవరం అడ్డరోడ్డుకు సమీపంలో ఇరువైపులా లోతైన గోతులు ఏర్పడ్డాయి. ఇదే రహదారిలో కొండమూరు అలుగు సమీపంలో మరియు ఆదిరెడ్డిభావి నుండి ముప్పవరం మధ్య పలుచోట్ల రోడ్డుమధ్యలో అడుగడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. గత టి.డి.పి. పాలనలో పంగులూరు, ముప్పవరం గ్రామాల మధ్య బి.టి. రోడ్డు నిర్మాణం జరిగింది. నాటి నుండి తరచూ ఈ రోడ్డుపై ఏర్పడిన గోతులు పూడ్చేందుకు ఆర్ అండ్ బీ అధికారులు అరకొర మరమ్మత్తులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గోతులకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టినా గడిచిన ఏడాది కాలంగా వర్షాలకు జనకవరం, ముప్పవరం గ్రామాల మధ్య అనేకచోట్ల గోతులు ఏర్పడంతో ద్విచక్ర వాహనచోదకులు రాకపోకలు సాగించడంలో అవస్థలు పడుతున్నారు. ఇంకొల్లు, పంగులూరు పరిసర ప్రాంతాల నుండి 16వ నెంబరు జాతీయ రహదారికి చేరుకుని అద్దంకితో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్ళేందుకు నిత్యం వందల సంఖ్యలో వాహనచోదకులు రేయింబవళ్ళు రాకపోకలు సాగిస్తుంటారు. అద్దంకి. ఇంకొల్లు మధ్య నడిచే ఆర్‌.సి. బస్సులతో పాటు పలు ప్రాంతాల నుండి సిమెంట్, కంకర, ఇసుక ఇతర సరుకు రవాణా చేసే లారీలు, ట్రాక్టర్లు, వైద్యం కోసం, ఇతర పనుల నిమిత్తం పలు గ్రామాల ప్రజలు కారుల్లో ప్రయాణం సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ ప్రధాన రహదారిలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా గోతులకు కనీస మరమ్మత్తులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతన్నారు.



జనకవరం అడ్డరోడ్డు సమీపంలో గోతులమయంగా ఉన్న ఆర్అండ్‌బీ రహదారి

అవీ..ఇవీ..

వివాహిత ఆత్మహత్య

● భర్త వేధింపులే కారణమని తండ్రి ఫిర్యాదు

మేదరమెట్ల నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్రవాని పాలెంకు చెందిన వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుర్రవానిపాలేనికి చెందిన మోంద్రు అనితను కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన శీలం బ్రహ్మానాయుడికిచ్చి నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. ఇటీవల ఆమె ప్రసవం కోసం పుట్టింటికి వచ్చింది. ఇక్కడ ఒక కుమార్తెకు జన్మనిచ్చింది. అయితే అనిత భర్త, అత్తమామలు అదనపు కట్నం తేవాలని మానసికంగా, శారీరకంగా హింసించేవారు. ఇటీవల ఆమెకు ఆడపిల్ల పుట్టడంతో ఈ వేధింపులు మరింత ఎక్కువయ్యాయని అనిత తండ్రి లక్ష్మీనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 'రూ.20 లక్షలు కట్నం తెస్తే ఇంటికి రావాలని, లేదంటే అక్కడే చావాలి' అని భర్త బెదిరించడంతో తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. దీంతో ఈ నెల 20న తన కుమార్తె పురుగు మందు తాగగా, ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందనట్లు తెలిపారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

● ఈపూరుపాలెంలో కేసు నమోదు

ఈపూరుపాలెం(చీరాల), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఈపూరుపాలెం పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ట్రాక్టర్లను స్టేషన్ పరిధిలోని బోయినవారిపాలెం వైపు నుంచి ఈపూరుపాలెం వైపు వస్తుండగా మార్గ మధ్యలోని రైలు గేటు వద్ద ట్రాక్టర్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు డ్రైవర్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

సంఘటితంతో స్వచ్ఛ చీరాలను సాదిద్దాం

● పురపాలక సంఘం సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది, ప్రజలు సంఘటితం కావాలని, తద్వారా స్వచ్ఛ చీరాల సాధ్యమని మున్సిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ సమావేశ మందిరంలో స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ఆధ్వర్యంలో వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్, ఎమినిటీ సిబ్బంది, వార్డువెల్ఫేర్, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చెత్త సేకరణ, వేస్ట్ ప్రాసెసింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ అబ్దుల్ రషీద్, అసిస్టెంట్ ఇంజనీరు గీతాశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీల హక్కులపై అవగాహన అవసరం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాదులు

అద్దంకిటౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్త్రీలకు ఉన్న హక్కులు, హింసకు గురైనప్పుడు చట్టం ద్వారా వారు పొందగల సదుపాయాలు, ఇతర చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఉచిత న్యాయ సహాయకులు టి. మార్త శ్రీను అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఇందిరానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం నందు మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతు ఐ క్యరాజ్య సమితి తిర్మానం మేరకు ప్రతి సంవత్సరం నవంబరు 25వ తేదిన స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింసా వ్యతిరేక దినం నిర్వహించడం జరుగుతుందన్నారు. స్త్రీలపై అత్యాచారాలు, గృహహింసలు, లైంగిక వేధింపులు ఎ క్కువ అ వుతున్నాయన్నారు.స్త్రీలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వీటిని అరికట్టడం ప్రయత్నంలో భాగంగా అందరు స్త్రీల హక్కులు, చట్టల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మహమ్మద్ రఫీ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, మహిళలు పాలొన్నారు.

స్త్రీ, పురుష సమానత్వంపై అవగాహన

పంగులూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్త్రీ, పురుష సమానత్వంపై మహిళలకు అవగాహన కల్పించాలని, రక్షణ చట్టాల గురించి, అన్ని రంగాలలో మహిళలకు ఉపాధి అవకాశాల గురించి తెలియచేయాలని ఎంపీడీవో స్వరూపారాణి అన్నారు. ఈ నెల 25 నుంచి డిసెంబరు 23 వరకు వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించనున్న జండర్ అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీవో స్వరూపారాణి లాంఛనంగా ప్రారంభించారు. వీవోఏలు, మండల సహఖ్య ప్రతినిధులు ఎస్.హెచ్.గ్రూప్ సభ్యులకు మహిళల కోసం నిర్దేశించిన చట్టాల గురించి తెలియ చేయాలన్నారు. మండల సమాఖ్య ప్రతినిదుల అవగాహన కోసం ఎంపీఎం అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాది సూరి, జండర్ కమిటీ సభ్యులు, వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం కృషి



కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

పర్చూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఏపీఎం కే.రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయం ప్రాంగణంలో నయీ చేతన్ 4.0 ముందడుగు కార్యక్రమంలో భాగంగా జండర్ వివక్షతకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మహిళ జీవనోపాధిని బహోపేతం చేయటం, ఆర్థిక సాధికారిత ప్రేరణ శక్తులుగా అభివృద్ధి చెందటంతోపాటు, స్త్రీ, పురుషుడు సమానమే అన్న విధంగా అవగాహన కల్పించటమే కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీనియర్ సహాయకులు నారాయణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ దీప, సీసీలు శ్రీనివాస మూర్తి, విజయ్‌కుమార్, నరసింహారవు, గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ చీరాల యూనిట్ కమిటీ మంగళవారం ఎంపికైంది. అధ్యక్షులుగా చుక్కా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ప్రతాప్, సుశీల స్వామి, జిల్లా కౌన్సిలర్లుగా వెంకటేశ్వరరెడ్డి, నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో నూతన కమిటీను పలువురు అభినందించారు.

యూటీఎఫ్ మండల శాఖ నూతన కమిటీ ఎన్నిక

చినగంజాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్ నూతన కౌన్సిల్ నిర్మాణం ఏకగ్రీవంగా ఎన్నికైంది. యూటీఎఫ్ బాపట్ల జిల్లా సహాధ్యక్షులు బి.బిక్షాలుబాబు నూతన కమిటీ ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.పాపారావు వ్యవహరించారు. ఎంపికైన నూతన మండల కమిటీ వివరాలను ఆయన తెలియజేశారు. యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షులు సీ.హెచ్.ఎస్‌వీ. సుబ్బారావు, అధ్యక్షులు చుండూరి వెంకట్, ఉపాధ్యక్షులు షేక్.నాయబ్‌రసూల్, ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీనివాసరావు, కోశాధికారి నంగు శ్రీనివాస రావు, మహిళా ఉపాధ్యక్షురాలు కేవీఎస్. సునీత, మహిళా కార్యదర్శి పి.హిమవంతేశ్వరి, జిల్లా కౌన్సిలర్స్ వి.రవికుమార్, టి.నాగమల్లేశరరావు, డి.హరిపురుషోత్తం, పి.సరళ, కార్యదర్శులు పీ.శ్రీనివాసరావు, యూ.సాంబశివరావు, ఎం. సురేష్, బిఎస్. నాగేశ్వర రావు, ఎల్.శివప్రసాద్, సీ.హెచ్. కుమార్, డి. సుబ్బారావు, సీ.హెచ్. బాజిబాబు, ఎస్.ధనలక్ష్మి, కే.వెంకటరావు, ఎస్.సురేష్, మహిళా విభాగం కన్వీనర్ ఎం.విజయ కుమారి, టి.సౌజన్య, ఎన్.అనంత లక్ష్మి, బి. ఉమాదేవి, ఎన్. శివనాగమణి, ఐటీ విభాగం ఎస్.కోటయ్య, కే.రామకోటిరెడ్డి, అకడమిక్ సెల్‌విభాగానికి పి.మురళీకృష్ణ, వై.రామాంజ నేయులు, ఎన్.సోమయ్య, ఆడిట్ కమిటీ సభ్యులుగా కేవీ.సుబ్రహ్మణ్యం, కే.మాధవీలత, ఎస్. సుప్రియ, సీపీఎస్ విభాగం కన్వీనర్ వి.వెంకటేశ్వరరావు, కో కన్వీనర్ పి.ఆదిలక్ష్మి, సభ్యులు పీవీ.శ్రీబాబు, సీ.హెచ్.శ్రీనివాస రావు, పి.రామాంజనేయులు, సాంస్కృతిక విభాగం కమిటీ సభ్యులు బి.వీరేశ్వర శాస్త్రీ, జి.నాగేశ్వరమ్మ, కే. హేమలత, పత్రికలు ముతకని శ్రీనివాసరావు, కుటుంబసంక్షేమ పథకం సభ్యులు బివి.రమేష్‌బాబు, కాంప్లెక్స్ బాధ్యులు పెదగంజాంకు జి.రాజబాబు, టి.అమృతబాబు, ఎస్.శ్రీనివాసరావు, కే.కృష్ణవేణి, కడవకుదురుకు బి.భాస్కర్, ఎస్.శ్రీనివాసరావు, పీ.నాగేశ్వరరావు, షేక్.ఫిరోజ్‌లు ఎంపికైనట్లు పాపారావు తెలిపారు.



అధ్యక్షుడు వెంకట్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు

ఉద్యాన పంటలతో అధిక ఆదాయం

అద్దంకిటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలతో ఆధిక ఆదాయం పొందవచ్చని మండల ఉద్యాన శాఖ అధికారిణి ఎస్.దీప్తి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపురం, విప్పర్ల వారిపాలెం గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలల్లో సాగు చేసిన ఉద్యాన పంటలను ఆ మె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ మె మాట్లాడుతు ఉద్యాన పంటలైన డ్రాగన్ ఫ్రూట్స్, జామ, కొబ్బరి సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో ప్రతి రైతు తమ వి వరాల ను గ్రామ వ్యవసాయ సహయకులకు అందించా లని తెలిపారు. వారు వ్యవ సాయ శాఖ రూపొందించి న యాప్ సంబంధిత రైతులకు డౌన్‌లోడ్ చేస్తా రని, ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడు తుందని తెలి పారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనిగల శాంతమ్మ, ఏఈవో కోటేశ్వరరావు, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, వీఏవో మౌనిక, రైతులు పాల్గొన్నారు.



పండ్లతోటను పరిశీస్తున్న ఉద్యాన అధికారి దీప్తి

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు

చినగంజాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుంచి మినహాయించాలని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఈ విషయంలో జోక్యం చేసుకొని కోర్టులో రివ్యూ పిటిషన్ వేయించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కే.శ్రీని వాస రావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు మెట్టు శ్రీనివాసరావు అధ్య క్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయు లకు బోధనేతర పనులు రద్దు చేస్తామని చెప్పినప్పటికీ ఆన్‌లైన్‌లో పనులు చేయిస్తూ ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారన్నారు. విద్యార్థులకు పరీక్షలకు సంబం దించి అసెస్‌మెంట్ పుస్తకాల విష యంలో పునరాలోచించాలని, సింగల్ ఉపాధ్యాయులు పనిచేస్తున్న పాఠశాలల్లో పాఠశాల పని దినాలు 225 ఉన్నచోట్ల ఎల్‌హెచ్, ఓ.హెచ్‌ల రోజులలో పాఠశాలలకు సెలవు ప్రకటించుకునే అవకాశం ఇవ్వాలని అన్నారు. పెండింగ్ ఆర్థిక బకాయిలను చెల్లించాలని, పీఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్ 30 శాతం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత జూన్‌లో బదిలీలు జరిగి ఇంకా రిలీవ్ కాని వారిని వెంటనే రిలీవ్ చేయాలని శ్రీనివాస రావు కోరారు. కార్యక్రమంలో యూటీ ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.పాపారావు, జిల్లా ఉపాధ్యక్షులు బి.బిక్షాలుబాబు, జిల్లా కార్యదర్శి పి.సురేష్, రాష్ట్ర కౌన్సిలర్ బి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

డప్పుకళను జాతీయ స్థాయిలో గుర్తించాలి

ఒంగోలు(రూరల్), నవంబరు25 (ఆంధ్రజ్యోతి): డప్పు కళను జాతీయ కళగా గుర్తించాలని రాష్ట్ర డప్పు కళాకారుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులో డప్పు కళాకారుల మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్ మాట్లాడుతూ డప్పు కళాకారులు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. డప్పు కళాకారులకు అర్హతల మేరకు పింఛన్లు వచ్చేవిధంగా చేస్తానని, ఎలాంటి సిఫార్సులు అవసరం లేదన్నారు. టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాస రావు మాట్లాడుతూ డప్పు కళను అంతరించి పోకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కళను తాను ఎప్పటికీ ప్రోత్సహిస్తానని తెలిపారు. డప్పు కళాకారు ల సంఘ రాష్ట్ర నాయకుడు గుండిమెడ క్రాంతికుమార్ మాట్లాడుతూ డప్పు కళా కారులకు ఇప్పుడు ఇస్తున్న పింఛను పెంచాల న్నారు. ప్రతినెలా రూ.7వేలు ఇవ్వాలని కోరారు. కేవలం దీనిపై ఆధారపడ్డ కళాకారులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు కంకణాల ఆంజనేయులు, బి.రఘురామ్, శివాజీరాజు, అట్లూరి రాఘవులు, టి.రామా రావు, కత్తి యోబు తదతరులు పాల్గొన్నారు. అంతకుముందు డప్పు కళాకారులు నగరంలో డప్పులు వాయిస్తూ ప్రదర్శన నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్

26న కృష్ణంరాజుపాలెంలో ప్రత్యేక పూజలు

మేదరమెట్ల నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా మండలంలోని పమిడిపాడు శివారు కృష్ణంరాజుపాలెంలో వేంచేసిన సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలతో పాటు కలశం, కావడుల ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. 46 అడుగుల ఎత్తైన సుబ్రహ్మణ్యస్వామి ఏకశిల విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు స్వామివార్ల కల్యాణ మహోత్సవం

పర్చూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో వేంచేసియున్న స్వామివార్ల పుట్ట వద్ద శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వార్ల కళ్యాణ మహోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తేళ్ళ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ నిర్మాణం చేపట్టి 50 ఏళ్ల పూర్తిఅయిన సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్ల కల్యాణ వేడుకలను తిలకించి భక్తిని చాటుకోవాలని కోరారు.

క్రిస్మస్‌కు స్వాగతం పలుకుతూ ప్రార్థనలు



ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

యద్దనపూడి,(మార్టూరు) నవంబరు25 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలలో జరగనున్న క్రిస్మస్ పండుగకు స్వాగతం పలుకుతూ మంగళవారం యద్దనపూడిలోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. పవిత్ర మాసం క్రిస్మస్ కు నెలరోజుల ముందుగా ఉదయకాల ఆరాదన కాలాన్ని ఘనంగా ప్రారంభించారు. క్రీస్తురాకను ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వైఏ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

● 63 మంది ఎంపిక

చీరాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం క్యాంపస్ డ్రైవ్ జరిగింది. ఈక్రమంలో హైదరాబాద్ నుంచి ఫాక్స్ కాన్ కంపెనీ, తిరుపతి నుండి నియో లింక్ కంపెనీ, తడ శ్రీసిటీ పరిధిలోని డైకిన్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈక్రమంలో 63 మంది విద్యార్థులు ఎంపిక కావడంపై ప్రిన్సిపల్ డా.ఎస్ మురళీ ప్రత్యేకంగా అభినందించారు. ఎంపికైన వారు డిసెంబరు 1 నుండి ఉద్యోగాల్లో చేరనున్నట్లు చెప్పారు.

పందిళ్లపల్లి విద్యార్థినికి కాంస్య పతకం

పందిళ్లపల్లి(చీరాల), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ అబ్బు పూజిత స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేష్ అండర్ -17 విభాగంలో కాంస్య పతకం సాధించింది. వినుకొండలో సోమ, మంగళవారాల్లో జరిగిన ఈ పోటీల్లో హేమర్ త్రోలో ప్రతిభ కనబరిచింది. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు పూజితను అభినందించారు.

భారత రాజ్యాంగంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు

కఠారిపాలెం(చీరాల), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం కఠారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. భారత రాజ్యాంగం దినోత్సవం పురస్కరించుకుని జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ తయారు చేయించడం, బోధనాభ్యాసం సామాగ్రి తయారీ చేయించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసమే 'రైతన్నా మీకోసం'



రైతులకు బ్రోచర్లను అందచేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది


మార్టూరు, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతికను అనుసంధానం చేయడం ద్వారా మేలైన దిగుబడులను సాదించడం, నాణ్యమైన ఉత్పత్తులను పొందడం సాధ్యమని ఏవో కుమారి అన్నారు. యద్దనపూడి మండలంలో రైతుసేవా కేంద్రాలలో రైతన్నా మీకోసం' ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం మండలంలోని పోలూరు, గన్నవరం గ్రామాలలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో కుమారి ఆధ్వర్యంలో వ్యవసాయ సిబ్బంది ఇంటింటా తిరుగుతూ బ్రోచర్లను రైతులకు పంపిణీ చేశారు. పోలూరు గ్రామంలో టీడీపీ నాయకులు రావిపాటి సీతయ్య, గన్నవరం గ్రామంలో నల్లపనేని రంగయ్యచౌదరిల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నెల 29 వరకు ప్రచారం నిర్వహిస్తామని ఏవో తెలిపారు. కార్యక్రమంలో పశువర్ధక సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మో వానరాలు..!

పర్చూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో వానరాల బెడత తీవ్రతరంగా మారింది. విచక్షణా రహితంగా దాడులు చేయటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గుంపులు గుంపులుగా వచ్చి మరీ దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ప్రజలు బెంబేలెత్తుతున్నారు. చేతిలో ఏమైన తినుబండారాలు ఉన్నా, లేకున్నా దాడులకు పాల్పడుతుండటంతో ఒకింత ప్రజలు కలవరానికి గురవుతున్నారు. గడిచిన పక్షంరోజుల్లో అనేక మంది వానరాల దాడిలో గాయపడి ఆసుపత్రి పాలయ్యారంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఒంటరిగా బయటకు రావాలంటే ప్రజలు భయపడాల్సిన దుస్థితి నెలకొంది. నిత్యం వందల సంఖ్యలో ప్రజలతో రాకపోకలు సాగించే బ్యాంక్‌లు, కోర్టు సమీపంలో పరిస్థితి మరింత ఇబ్బంది కరంగా మారింది. ఈమార్గంలో పదుల సంఖ్యలో కోతులు ఆవాసాలను ఏర్పాటు చేసుకొని పాదచారులపై విచక్షణా రాహిత్యంగా దాడులు చేసి గాయపరుస్తున్నాయి. ఇలాంటి ఘటనలు అనేకం ఉన్నాయి. పర్చూరు లాయర్ వీధిలో ఓ వృద్ధునిపై కోతులు దాడిచేసి తీవ్రంగా గాయపరచడంతో ఆయన్ను వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. కోతుల దాడుల నుండి విముక్తి కల్పించండి అని ఎన్నిమార్లు స్థానిక పంచాయితీ అధికారులకు విన్నవించుకున్నా తమ గోడు పట్టించుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు.


కొండముచ్చుతో సరి...

పెద్ద సమస్య తెలెత్తినా, వార్తా పత్రికల్లో కథనాలు వెలువడిన తరుణంలో కొండ ముచ్చును తీసుకొచ్చి సరిపెట్టడం మినహా తీసుకుంటున్న చర్యలు లేవు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడద నుండి కాపాడాలని ప్రజలు కోరతున్నారు. ఆదిశగా అధికారులు యుద్ధ ప్రాతిపతికన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



పర్చూరులో కోతుల సంచారం, గాయపడిన వృద్ధుడు

ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో ఉన్న మండలాల సంఖ్య 38. రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు మేరకు కందుకూరు నియోజకవర్గాన్ని (5 మండలాలు) ప్రకాశం జిల్లాలోకి, వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలిపితే ఆ సంఖ్య 30కి చేరుకుంటుంది. అంతేగాక ఎప్పటినుంచో నెల్లూరులో కలవాలన్న గూడూరు నియోజకవర్గవాసుల కల కలగానే మిగిలిపోనుంది. జిల్లాల పునర్విభజనపై రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ఆమోదం తెలిపారు. ఆ ప్రకారం నెల్లూరులో కలుస్తుంది అనుకున్న గూడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లాలోనే కొనసాగనుంది. వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలతోనూ నెల్లూరుకు సత్సంబంధాలు తెగిపోనున్నాయి.



'ప్రకాశం'లోకి కందుకూరు

ఆ మూడు మండలాలు తిరుపతిలోకి..



30 మిగిలిన మండలాలు

గూడూరు తిరుపతి జిల్లాలోనే!!

నెల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల పునర్విభజనపై రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం ఆమోదం తెలిపారు. ఆ సిఫార్సు ప్రకారం కందుకూరు నియోజకవర్గం ప్రకాశం జిల్లాలో విలీనం కానుంది. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రకాశం జిల్లాలో ఉన్న కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపారు. అయితే దీనిని ఆ నియోజకవర్గ ప్రజలు తొలినుంచి వ్యతిరేకిస్తూనే వచ్చారు. ఈ నియోజకవర్గ ప్రజలకు ఒంగోలుతో అనుబంధం ఎక్కువ. నెల్లూరుతో పోల్చితే ఒంగోలు వీరికి అన్నివిధాలా అనువైనది. ఆ క్రమంలోనే ఈ నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలపాలని ప్రజలు గట్టిగా కోరుకున్నారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, లోకేష్‌బాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కందుకూరును ప్రకాశం జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం జిల్లాల పునర్విభజనలో భాగంగా కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపడానికి ముఖ్యమంత్రి ఆమోద ముద్ర వేశారు.

● గూడూరు తిరుపతిలోనే..

కందుకూరు తరహాలోనే గూడూరు నియోజకవర్గ ప్రజలు నెల్లూరు జిల్లాలో కొనసాగాలని కోరుకున్నారు. వీరికి తిరుపతి కన్నా నెల్లూరు అన్ని విధాలా అనువైనది. ఈ నియోజకవర్గ ప్రజలకు తరతరాలుగా నెల్లూరు జిల్లాతో అనుబంధం ఉంది. ఆ క్రమంలోనే ఆ నియోజకవర్గ ప్రజలు గూడూరును నెల్లూరులో కలపాలని గట్టిగా కోరుకున్నారు. ప్రజల అభీష్టం మేరకు అలాగే చేస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, లోకేష్ బాబు హామీ ఇచ్చారు. అయితే జిల్లాల పునర్విభజన నేపథ్యంలో జిల్లాల మధ్య జనాభా దామాషా ప్రకారం అది సాధ్యపడలేదని తెలిసింది. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపితే జనాభా పరంగా తిరుపతి జిల్లా చిన్నది అయిపోతుందనే ఉద్దేశంతో గూడూరును యధాతథంగా తిరుపతి జిల్లాలోనే ఉంచినట్లు సమాచారం. కందుకూరు ప్రకాశం జిల్లాలో కలిపినా, గూడూరును యథాతథంగా తిరుపతి జిల్లాలోనే ఉంచినా నెల్లూరు జిల్లాలో జనాభా 20 లక్షల వరకు (సర్వేపల్లి నియోజకవర్గంతో కలిపి) ఉంటారు కాబట్టి గూడూరును నెల్లూరులో కలిపే ప్రతిపాదనను విరమించుకున్నట్లు తెలిసింది. పైగా అభివృద్ధి వికేంద్రీకరణ దృష్ట్యా కూడా గూడూరును నెల్లూరులో కలిపితే దుగరాజపట్నం ఓడరేవు కూడా ఈ జిల్లా పరిధిలోకే వస్తుందని, రెండు పోర్టులు ఒకే జిల్లా పరిధిలో ఉంచడం అభివృద్ధి పరంగా అసమానతలకు దారితీస్తుందనే ఉద్దేశంతో గూడూరును తిరుపతిలోనే ఉంచాలని నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఏది ఏమైనా నెల్లూరులో కలవాలనుకున్న గూడూరు ప్రజల ఆశలు నెరవేరలేదు.

● గూడూరులోకి అదనంగా..

వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలు నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. ఈ మూడింటిని కూడా గూడూరు రెవెన్యూ డివిజన్‌లో కలపాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. ఇవి గూడూరు రెవెన్యూ డివిజన్‌లో కలిస్తే వెంకటగిరి నియోజకవర్గం పూర్తిగా తిరుపతి జిల్లాలో కలిసిపోతుంది.



పర్యాటక అభివృద్ధిపై అధికారులతో చర్చిస్తున్న లంకా దినకర్

జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ దినకర్

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా, చారిత్రాత్మకంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి సాధించడం ద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు గణనీయంగా పెంచవచ్చని తెలిపారు.

● మైపాడు అభివృద్ధికి..

మైపాడు బీచ్ వద్ద ఇప్పుడున్న సదుపాయాల ఆధునీకరణకు రూ.77లక్షల ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేశారని దినకర్ చెప్పారు. పల్లిపాడు వద్ద పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం అభివృద్ధి పనులకు రూ.26.04 కోట్లతో డీపీఆర్ తయారు చేసినట్లు చెప్పారు. బకింగ్‌హామ్ కెనాల్ అభివృద్ధి పనులు కూడా చేపట్టినట్లు చెప్పారు. దీంతో సముద్రంతో

- మిగతా 7వ పేజీలో..

జిల్లాలో ఓటర్ల వివరాలు		
నియోజకవర్గం	2002	2025
కందుకూరు	2,07,885	2,29,160
కావలి	2,03,559	2,40,945
ఆత్మకూరు	1,91,076	2,15,969
కోవూరు	2,21,274	2,67,782
నెల్లూరు సిటీ	1,65,019	2,39,623
నెల్లూరు రూరల్	75,950	2,82,099
సర్వేపల్లి	1,82,733	2,32,933
ఉదయగిరి	2,06,427	2,42,314
మొత్తం	15,53,923	19,50,825

ఒకరికి ఒక ఓటే!

- జిల్లాలో జాబితా నవీకరణ ప్రక్రియ
- 'సర్' పేరుతో వివరాలు సేకరణ
- బోగస్ ఓట్ల ఏరివేతే లక్ష్యంగా ప్రక్రియ
- శాశ్వతంగా వలస వెళ్లిన వారు జాబితా నుంచి ఔట్!
- కొత్తవారి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఒకరికి ఒక ఓటు మాత్రమే ఉండేలా ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియ జిల్లాలో ప్రారంభమైంది. పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించాలన్న లక్ష్యంతో జిల్లా యంత్రాంగం శ్రమిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరుతో ఈ రివిజన్ కార్యక్రమం జిల్లాలో ప్రారంభించారు. ఇప్పటికే బీఎల్‌ఓలకు శిక్షణ పూర్తవగా, అన్నీ పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ లెవల్ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతోంది. బోగస్ ఓటర్లను గుర్తించేందుకు 2002 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న ఓటర్ల జాబితాను ప్రస్తుతమున్న జాబితాతో సరిపోలుస్తూ ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి ధ్రువీకరించిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వారీగా నాటి ఓటర్ల జాబితాను బీఎల్‌ఓ యాప్‌నకు పంపించారు. 2025 ఓటర్ల జాబితాలో ఈ డేటాను అనుసంధానం చేసే మ్యాపింగ్ ప్రక్రియ ప్రారంభించారు. 2002 నాటికి 18 సంవత్సరాలు నిండి ఓటర్లుగా ఉన్న వారి వివరాలను తీసుకున్నారు. 2025 నాటికి వీరి వయసు 40 ఏళ్లకు పైబడుతుంది. ఇప్పటికి జాబితాలో 40 సంవత్సరాలు పైబడిన వారి వివరాలు, 2002లో 18 సంవత్సరాలు నిండి ఓటు పొందిన వారితో సరిపోల్చుతున్నారు.

● మ్యాపింగ్ ఇలా..

2002 ఓటరు జాబితాలో ఓటరుగా ఉన్న వారి ఫొటో ఉందా లేదా అనే అంశాన్ని పరిగణలోకి తీసుకుంటున్నారు. 2002 నాటికి 18 ఏళ్లు నిండినా ఓటరుగా నమోదు చేసుకోని వారి పేర్లు, ప్రస్తుత జాబితాలో

- మిగతా 8వ పేజీలో..



కొండాపురంలో నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్లు, ట్యాంకర్లు

పాలకా.. స్పందించాలిక!

- శుద్ధిజలం సరఫరాపై కక్షకట్టిన వైసీపీ ప్రభుత్వం
- ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం నిర్వీర్యం
- రూ.50 కోట్ల ప్రజాధనం మట్టిపాలు
- ముళ్లపొదల్లో ట్యాంకర్లు, ట్రాక్టర్లు
- నిరుపయోగంగా మదర్ ప్లాంట్లు, ట్యాంకులు
- నాటి పాలకుల పాపం.. ప్రజలకు శాపం
- ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించాలని వేడుకోలు

గత వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీపైనే కాదు.. అమాయక ప్రజలపైనా కక్ష తీర్చుకుంది. ప్రజలకు శుద్ధిజలం అందించాలన్న ఉద్దేశంతో తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని కక్ష కట్టి మరీ నిర్వీర్యం చేసింది. పథకం ముందు ఎన్టీఆర్ అనే పేరు ఉన్న కారణంగానో లేదా తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన ఏ పథకాలను అమలు చేయకూడదనే కక్షతోనో 2014-19 కాలం మధ్యలో ప్రారంభించిన పలు ప్రజాహిత పథకాలను నిర్దాక్షిణ్యంగా నిర్వీర్యం చేసింది. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ముళ్లపొదల పాలు చేసింది. అందుకు ఉదాహరణే ఎన్టీఆర్ సుజల పథకం.

నెల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మెట్ట ప్రాంతాల్లోని గ్రామాల్లో ప్రజలకు అతి తక్కువ ధరకు శుద్ధిజలం (మినరల్ వాటర్) అందించాలన్న ఉద్దేశంతో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ప్రవేశపెట్టారు. 5 రూపాయలకే 20 లీటర్ల శుద్ధ జలం ఇవ్వడం ఈ పథకం ఉద్దేశం. అయితే ప్రతిరోజు రూ.ఐదు చిల్లర కావాలంటే గ్రామీణుల వద్ద ఉండదు కాబట్టి ఏటీఎం కార్డు తరహాలో ఓ కార్డు ఇచ్చారు. అందులో నగదు జమ చేసుకోవచ్చు. ఇందుకోసం గ్రామాల్లో ప్రత్యేకంగా ట్యాంకులు కట్టారు. మదర్ ప్లాంట్ నుంచి ట్యాంకర్ల ద్వారా నీరు ఈ ట్యాంకుల్లో నింపుతారు. ఈ ట్యాంక్ ముందుబాగంలో ఏటీఎం మిషన్ తరహాలో ఓ యంత్రం ఉంటుంది. అందులో మంచినీటి కోసం ఇచ్చిన ప్రత్యేక కార్డును ఇన్‌సర్ట్ చేస్తే కొళాయి నుంచి 20 లీటర్ల నీళ్లు వస్తాయి. కార్డులోని నగదులో నుంచి 5 రూపాయలు కట్ అవుతుంది. ఇలాంటి ఏర్పాట్లతో సిద్ధం చేసిన పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభానికి ముందే ఎలా పాడెక్కించింది.

● రూ. 50 కోట్లు మట్టిపాలు

2018లో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద జిల్లాకు రూ.50 కోట్లు మంజూరు చేసి, 49 కోట్లు విడుదల చేసింది. జిల్లావ్యాప్తంగా 14 మండలాల్లో ఈ పథకం కింద ఎంపికచేశారు. దుత్తలూరు, జలదంకి, కలిగిరి, కొండాపురం, సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు, ఆత్మకూరు, అనంతసాగరం, మర్రిపాడు, పొదలకూరు, దగదర్తి, బోగోలు మండలాలను ఎంపిక చేసి మదర్ ప్లాంట్లు, వాటర్ ట్యాంకులను నిర్మించారు. ఈ ప్లాంట్ల నుంచి వాటర్ ట్యాంకులకు నీటి సరఫరా కోసం ట్రాక్టర్లు, ట్యాంకర్లు కొనుగోలు చేశారు. పథకం దాదాపుగా ప్రారంభ దశకు చేరుకుంది.



సీతారామపురం : రంగనాయుడుపల్లి సమీపంలో నిరుపయోగంగా ఉన్న మదర్‌ప్లాంట్

అంతలో వైసీపీ అధికారంలోకి రావడంతో టీడీపీ అమలు చేసిన పథకాలపై కక్ష కట్టి ఈ శుద్ధి జలం పథకాన్ని తుంగలో తొక్కేసింది. నాటి ప్రభుత్వానికి భయపడిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అసలు ఈ పథకం వైపు కన్నెత్తి చూడలేకపోయారు. కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్యాంకర్లు మూలనపడిపోతున్నాయని, మదర్ ప్లాంట్లు, వాటర్ ట్యాంకులు నిర్వీర్యం అవుతున్నాయని, ఇందుకోసం ఖర్చు చేసిన రూ.50 కోట్ల ప్రజాధనం మట్టికొట్టుకుపోతోందనే విషయాన్ని వైసీపీ పాలకులకు వివరించలేకపోయారు.

● ఇప్పటికైనా మేలుకొంటారా!?

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి

- మిగతా 8వ పేజీలో..

ఈ ముళ్ల పొదల్లోని ట్రాక్టర్లు, ట్యాంకర్లను చూశారా!? 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద వీటిని కొనుగోలు చేశారు. ఆరి తీరి వీటిని వినియోగించే సమయానికి ఎన్నికలొచ్చాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అంతే.. ఆరంభానికి ముందే ఈ పథకాన్ని తుంగలో తొక్కేశారు. కొనుగోలు చేసిన ట్రాక్టర్లు, ట్యాంకర్లను దొంగలకు వదిలేశారు. కొంతమంది ట్రాక్టర్ టైర్లు విప్పుకొనిపోయారు. ఇంకొంతమంది బ్యాటరీలు లాక్కెళ్లారు. ఇంకొందరు ట్రాక్టర్ సీట్లు పీక్కుపోయారు. లైట్లు, హైడ్రాలిక్‌లు ఇలా విలువైన పరికరాలన్నీ మాయమయ్యాయి. ఆరుబయట ఎండుకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పు పడుతున్నాయి.



సోమశిలలో 73.467 టీఎంసీల నిల్వ

అనంతసాగరం నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి మంగళవారం 14,206 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టులో 74.467 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ ఉత్తర కాలువకు 500, డెల్టాకు 17,300, కండలేరుకు 750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేయండి!

పాత నివేదికలతోనే సమావేశాలకు వస్తారా!?

జడ్పీ స్టాండింగ్ కమిటీలో సభ్యుల ఏకరువు

- వివరాలు 8లో..



ఆత్మకూరులో అర్థంతరంగా ఆగిపోయిన కేవీకే భవనం

కేవీకేలకు మహర్దశ!

ఆత్మకూరు, కావలి కేంద్రాలకు నిధులు విడుదల

8

మిగిలిన కేవీకేలకు మోక్షమెప్పుడో..!?

క్రీడా వికాస కేంద్రాలకు మంచి రోజులు రానున్నాయి. రాష్ట్ర విభజన తరువాత 2018లో అధికారంలో ఉన్న నాటి ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌లను ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో 50 శాతం పనులు కూడా పూర్తి చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా వదిలేసింది. దీంతో అన్ని ప్రాంతాల్లో దాదాపు కేంద్రాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆత్మకూరు, కావలి కేవీకేలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఆత్మకూరు కేంద్రానికి రూ.1.78 కోట్లు, కావలికి రూ.2.78 కోట్లు విడుదల చేసి అసంపూర్తిగా ఉన్న పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో ఆత్మకూరు కేవీకేకు టెండర్లకు ఆహ్వానించగా మూడు నెలల్లోగా పనులు పూర్తి చేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కావలిలో మాత్రం త్వరలోనే టెండర్లకు ఆహ్వానిస్తామని అధికారులు తెలిపారు.



పోలీస్‌స్టేషన్ నుంచి వెనుతిరుగుతున్న పౌరసరఫరాల శాఖ అధికారులు

భోక్తల గుట్టు విప్పేనా!?

- తెరుచుకున్న ఎంఎల్‌ఎస్ గోదాము తలుపులు
- నిల్వలు పరిశీలించిన అధికారులు
- బియ్యం స్వాహాపై పోలీసులకు ఫిర్యాదు
- సమగ్రంగా ఇవ్వాలన్న పోలీసులు

- 8లో..

పశువుల్లో పచ్చికదమ్ము!

జాగ్రత్తలు తీసుకోకుంటే అంతే!

15వ తేదీ వరకు ఉచితంగా వ్యాక్సినేషన్

జిల్లాకు 1,89,600 టీకాల పంపిణీ

- వివరాలు 8లో..

రూ.1200 కోట్లు.. 4,554 విలేజ్ క్లినిక్‌లు

త్వరలో రాష్ట్రంలో నిర్మించబోతున్నాం

మనుబోలులో మంత్రి సత్యకుమార్

- వివరాలు 8లో..



రూ.1200 కోట్లు.. 4,554 విలేజ్ క్లినిక్‌లు

● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, పక్కన ఎమ్మెల్యే సోమిరెడ్డి తదితరులు

మనుబోలు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా రూ.1200కోట్లతో 4553 విలేజ్ క్లినిక్‌లు నిర్మించబోతున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మనుబోలులో రూ.1.65 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీని మంగళవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. గత ప్రభుత్వంలో ఇబ్బడిముబ్బడిగా పీహెచ్‌సీలు, విలేజ్ క్లినిక్‌ల పేరుతో జీవోలు ఇచ్చి, నిధులు విడుదల చేయలేదని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను కూడా పక్కదారి మళ్లించారని ఆరోపించారు. పొదలకూరులో డయాలసిస్ సెంటర్, మనుబోలులో పీహెచ్‌సీ ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి పట్టుబట్టారన్నారు. అనంతరం పీహెచ్‌సీలో పనిచేసే వైద్యులు, సిబ్బందిని పరిచయం చేసుకుని, విధుల నిర హణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎం హెచ్‌వో సుజాత, ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, కేసీపీసీ చైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు, బీజేపీ, జనసేన మండలాధ్యక్షులు వాసిరెడ్డి రామిరెడ్డి, పెనుబాక ప్రసాద్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

● బలమైన పార్టీగా బీజేపీ

తోటపల్లిగూడూరు : రాష్ట్రంలో బలమైన పార్టీగా బీజేపీ ఏర్పాటు కానుందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. మండలంలోని విలుకానిపల్లి టీఎంఎస్ఆర్ కల్యాణ మండపంలో 6 జిల్లాల పరిధిలోని మండలాల బీజేపీ అధ్యక్షుల శిక్షణా తరగతులలో ఆయన ప్రసంగించారు. పార్టీ విస్తరణకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రమేష్ నాయుడు, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, భరత్, మాల్యాద్రి పాల్గొన్నారు.

నేడు సుబ్రహ్మణ్య షష్ఠి



నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో బుధవారం సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినానికి ఏర్పాట్లు చేశారు. దేవతల సైన్యాధిపతి అయిన సుబ్రహ్మణ్యేశ్వరుడిని కొలిస్తే సకల శుభాకాలు కలుగుతాయని, కుజ దోషం, నాగ దోషం వంటివి తొలగిపో తాయని, వివాహం, సంతానం వంటి కోరికలు నెరవేరుతాయని పండితులు చెబుతున్నారు. షష్ఠి పర్వదినం సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామికి పంచామృ తాభిషేకాలు, నాగ పడగలకు పాలాభిషేకాలు జరగనున్నాయి. జిల్లాలోని అన్ని శివాలయాలు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. నెల్లూరు నగరం ఉస్మాన్‌సాహెబ్‌పేట కాశీవిశ్వనాథ ఆల యంలో స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. అలాగే కనుపర్తి పాడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, నండేమార్కెట్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు జరగనున్నాయి.

పశువుల్లో ప్రాణాంతక వ్యాధుల్లో పచ్చికదమ్ము ఒకటి. వ్యాధి లక్షణాలను గుర్తించి చికిత్స చేయిస్తే సరి లేదంటే ఒక్కరోజు వ్యవధిలోనే పశువులు చనిపోతాయి. ఇంతటి ప్రాణాంతక వ్యాధి నివార ణకు ప్రభుత్వం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి టీకాల కార్యక్రమం జరుగుతోంది. ఇంటి వద్దకే పశువైద్యులు, సిబ్బంది వచ్చి అందిస్తారు. జిల్లాకు 1,89,600 టీకాలు సరఫరా కాగా, డిసెంబరు 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

పశువుల్లో పచ్చికదమ్ము!

● జాగ్రత్తలు తీసుకోకుంటే అంతే!

● 15వ తేదీ వరకు ఉచితంగా వ్యాక్సినేషన్

● జిల్లాకు 1,89,600 టీకాల పంపిణీ



టీకాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ చైతన్య కిషోర్ (ఫైల్)

పశువుల్లో (ఆవులు, గేదెలు) హెమరాజిక్ సెప్టిసేమియా ప్రాస్చురెల్లా అనే బ్యాక్టీరియా కారణంగా పచ్చికదమ్ము వ్యాపిస్తుంది. దీనిని గొంతువాపు, గురక వ్యాధి అని కూడా పిలుస్తుంటారు. తీవ్ర జ్వరంతో బాధ పడుతూ తీవ్రమైన గురక శబ్దం వ్యాధి ప్రధాన లక్షణం. ఇంకా గొంతు దగ్గర వాపు వచ్చి పశువులు ఆయాసపడుతుంటాయి. అంటే శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బం దులకు గురవుతుంటాయి. ముక్కు నుంచి చీమిడి కూడా కారుతూ ఉంటుంది. వ్యాధి ప్రభావంతో ఒక్కోసారి ఒక్క రోజులో అకస్మా త్తుగా పశువులు చనిపోతాయి.

● వ్యాధి వ్యాప్తికి కారణాలు

తొలకరి చినుకుల కాలంలో ఈ బ్యాక్టరియా బాగా వృద్ధి చెందుతుంది. పొలాల్లో తడిచిన పచ్చిక తినడం వల్ల ఈ బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుంది. అదేవిధంగా వర్షంలో పశువులు బాగా తడిచి తీవ్ర ఒత్తిడికి గురైన సమయంలోనూ వాయు మార్గంలో బ్యాక్టీరియా ప్రవేశిస్తుంది. వర్షాకాలంలో పశువులను పాకల్లో ఉంచడం ఎంతో మంచిది. ప్రభుత్వం అందిస్తున్న గోకులం పథకాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

1,89,600 దోసులు పంపిణీ చేశాం

పచ్చిక దమ్ము నివారణకు ఏడాదికి రెండుసార్లు ఉచితంగా టీకాలు అందించే కార్యక్రమం జరుగుతుంది. ఇప్పటికే మొదటి విడత పూర్తవగా, రెండో విడత మంగళవారం ప్రారంభమైంది. నెల్లూరు డివిజన్‌కు 93,250, కందుకూరుకు 31,900, కావలి డివిజన్‌కు 64,450 చొప్పున మొత్తం 1,89,600 డోసులు పంపిణీ చేశారు. పశువైద్యులు, సిబ్బంది పాడిరైతుల ఇంటి వద్దకే వెళ్లి ఉచితంగా టీకాలు వేస్తారు. వర్షాలు కురిసే సమయంలో పశువులను పాకల్లో ఉంచడం మంచిది.

- డాక్టర్ జానా చైతన్య కిషోర్, పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ

క్రీడా వికాస కేంద్రాలకు

మహర్దశ పట్టేనా!?

● ఆత్మకూరు, కావలి కేంద్రాలకు నిధులు

● మిగిలిన వాటి పరిస్థితి ఏమిటో!?

● ప్రభుత్వం స్పందిస్తే క్రీడాకారులకు ఎంతో మేలు



కావలిలో పిల్లర్ల దశలోనే ఉన్న కేవీకే భవనం

నెల్లూరు (విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించి వారిని జాతీయ స్థాయిలో రాణించేలా తయారుచేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం క్రీడా వికాస కేంద్రాలు(కేవీకే)లకు శ్రీకారం చుట్టింది. నియోజకవర్గాల వారీగా వీటిని ఏర్పాటు చేయాలని ప్రకటిస్తూ అన్ని ప్రాంతాల్లో స్థల సేకరణ కూడా పూర్తి చేశారు. నాటి కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు వీటి శిలాఫలకాలను ప్రారంభించి, తొలివిడతగా నిధులు కూడా మంజూరు చేశారు. కోవూరు, ఉదయగిరి, వెంకటగిరి, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాలకు సంబంధించి టెండర్లను సైతం పిలిచి ఒక్కో స్టేడియానికి రూ.2కోట్లు కేటాయించారు. అయితే, నేటికీ ఒక్క కేవీకే కూడా పూర్తి కాకపోవడం విశేషం.

● స్థలాల కేటాయించినా..

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 10 నియోజకవర్గాల్లో కేవీకేల ఏర్పాటుకు సర్వం సిద్ధం చేశారు. ఒక్కో మైదానానికి ఐదున్నర ఎకరాల స్థల సేకరణ కూడా చేపడుతుండగా కోవూరులో ఇబ్బందులు తలెత్తడంతో విడవలూరు జడ్పీ ఉన్నత పాఠశాల స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ పనులు ప్రారంభించి సగం పనులు పూర్తి చేశారు. అలాగే ఆత్మకూరులో 10 ఎకరాల్లో పనులు ప్రారంభించగా ఇక్కడా సగం పూర్తయింది. ఉదయగిరిలో 2.70 ఎకరాల్లో కేవీకే పనులు ప్రారంభించి వదిలేశారు. ప్రస్తుతం ఈ స్థలం కూడా జాతీయ రహదారి నిర్మాణంలో సగం పోయింది. కావలిలో 9 ఎకరాల్లో పనులు ప్రారంభించి పెండింగ్‌లో పెట్టారు. సూళ్లూరుపేటలో 10 ఎకరాలు స్థలం ఉన్నా బాగాలేకపోవడంతో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థలాన్ని కేటాయించారు. ఇక్కడ గోడలు కట్టి పనులు ఆపివేశారు. నెల్లూరు రూరల్ మండలం కొత్తూరులో 5.25 ఎకరాలు కేటాయించారు. ఇక్కడ పనులకు సంబంధించిన టెండర్లు కూడా పూర్తవగా తెలుగుగంగ అధికారుల అడ్డగింతతో పనులను నిలిపివేశారు. అదేవిధంగా నెల్లూరు అర్బన్‌లో జాతీయ రహదారి అల్లీపురం సమీపంలో 6 ఎకరాల డంపింగ్ యాడ్‌ను కేటాయించారు. అయితే డంపింగ్‌ను తొలగించడానికే రూ.3 కోట్ల వరకు ఖర్చవుతుండడంతో నిధుల కొరతతో పనులు నిలిపివేశారు. వెంకటగిరిలో తొలుత 5 ఎకరాలు కేటాయించగా స్థానిక కమిషనర్ దీన్ని అడ్డుకుని టిడ్కో గృహాల అవసరం నిమిత్తం స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంతో పనులు నిలిచిపోయాయి. గూడూరులో ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాల సమీపంలో 5 ఎకరాలు కేటాయించినా ఈ ప్రాంతంలో కూడా పనులు ప్రారంభం కాలేదు. వీటన్నింటితో పాటు మండల వికాస కేంద్రాలు కూడా తెర పైకి రాగా జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద తొలుత కోటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానాన్ని కేటాయించారు. దీనికి కూడా రూ.2 కోట్లు కేటాయించిన శాప్ నేరుగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు పనులు అప్పగించారు. ఇక్కడా పనులు ప్రారంభించి సగంలోనే నిలిపివేశారు. ఈ వికాస కేంద్రాల్లో ఇండోర్ స్టేడియంతోపాటు చుట్టూ ప్రహరీ గోడలు నిర్మించి అవుట్‌డోర్ క్రీడలు కూడా ఆడేవిధంగా సిద్ధం చేయాల్సి ఉంది. దీనికోసం ఒక్కో మైదానానికి రూ.2కోట్లు చొప్పున కేంద్రం కేటాయించింది. వీటిని టెండర్లు పిలిచి పనులు ప్రారంభించినా ఆరు కేంద్రాల్లో పనులు ప్రారంభించి నిలిపివేశారు. ఇవి నేటికీ ఒక్కటి కూడా పూర్తి కాలేదు. దీంతో ఈ స్టేడియాలపై నీలినీడలు కమ్ముకున్నాయి.

● 2 కేంద్రాలకు నిధులు విడుదల

ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల్లో కేవీకే నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆత్మకూరు కేంద్రానికి రూ.1.78 కోట్లు, కావలికి రూ.2.78 కోట్లు విడుదల చేయడంతో స్థానిక క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ నిధులతో రన్నింగ్ ట్రాక్, జిమ్, ఇతర క్రీడలకు సంబంధించిన నిర్మాణాలు, భవనాలు పూర్తి చేయనున్నారు. మిగిలిన నియోజకవర్గాలపై కూడా అధికారులు దృష్టి సారించి కేవీకేలు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని క్రీడాకారులు కోరుతున్నారు. దీనిపై డీఎస్ఏ అధికారులు మాట్లాడుతూ కేవీకేలకు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పటికే శాప్ అధికారులకు అందచేశామన్నారు. త్వరలోనే అన్ని కేవీకేలు పూర్తి చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

28 నుంచి పొదలకూరులో రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు

పొదలకూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : 69వ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలురు, బాలికల రగ్బీ చాంపియన్‌షిప్ 2025 పోటీలు ఈనెల 28వ తేదీ నుంచి 30 వరకు స్థానిక బాలుర హైస్కూల్‌లో అట్టహాసంగా జరుగుతాయని టోర్నమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ, రాపూరు హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు పీ. రమేష్ తెలిపారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తారన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావుతో పాటు పలువురు అధికారులు, క్రీడా ప్రతినిధులు, రాజకీయ నాయకులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. పట్టణ ప్రముఖులు, క్రీడాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

సహిత విద్యను బలోపేతం చేయాలి : డీఈవో

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సహిత విద్యను మరింత బలోపేతం చేయాలని డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీ రావు ఆదేశించారు. నెల్లూరులోని ఇండియన్ మెడికల్ హాలులో మంగళవారం సహితవిద్య కార్యక్రమాలపై విద్యాశాఖాధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సహిత విద్యకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం, ఇతర సదుపాయాలను సక్రమమైన పద్ధతిలో విభిన్న ప్రతిభావంతులకు అందించి ప్రోత్సహించాలని సూచించారు. సమగ్రశిక్ష ఏపీసీ డీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ జిల్లాలోని 38 మండలాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. విద్యాబోధనతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని కోరారు. అనంతరం భవిత పాఠశాలల పనితీరు, వారి విద్యకు సంబంధించిన అంశాలు, ప్రశస్త యాప్, సదరం సర్టిఫికెట్, యూడిడ్ సర్టిఫికెట్, మెడికల్ క్యాంప్, యూడైస్ వంటి అంశాలపై అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ మల్లికార్జున, ఎంఈవోలు, సమగ్రశిక్ష అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో బాలాజీరావు, పక్కన అధికారులు

మీరైనా స్పందించాలిక!

(5వ పేజీ తరువాయి)

వచ్చింది. ఇప్పుడైనా ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకంపై అధికారులు, పాలకులు దృష్టి సారిస్తారా!? అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. తక్కువ ధరకు శుద్ధిజలం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుకొంటున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను వివరణ కోరగా ఈ పథకం పునఃప్రారంభానికి సంబంధించి డీటైల్ ప్రాజెక్టు రిపోర్టు ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రతిపాదన ఎప్పుడు ప్రభుత్వానికి అందుతుందో, కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

ఒకరికి ఒక ఓటే!

(5వ పేజీ తరువాయి)

నమోదై ఉంటే దీనికి కారణాలేమిటి? అప్పట్లో వీరి కుటుంబ సభ్యులు పేర్లు ఉన్నాయా అనే కోణంలో మ్యాపింగ్ చేస్తున్నారు. ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్నవారిని స్థానికులుగా గుర్తించటంతోపాటు మిగిలిన వారిని వలస ఓటర్లుగా భావించి ఇతర కేంద్రాలలో వారికి ఓటు హక్కు ఉందేమోనని ఆరా తీస్తున్నారు. పాత జాబితాలో పేరుండి, ప్రస్తుత జాబితాలో లేని వారి వివరాలు కూడా సేకరిస్తున్నారు. అంతేగాక 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరించటంతోపాటు మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారిని ఓటరు జాబితా నుంచి తొలగిస్తారు. కాగా, జిల్లాలోని 8 నియోజకవర్గాల పరిధిలో 2002లో 15,53,923 మంది ఓటర్లు ఉండగా, 2025లో 19,50,825 మంది ఓటర్లు ఉన్నారు. 2002 కంటే 2025 నాటికి 3,96,902 ఓటర్లు పెరిగారు.

పారదర్శక జాబితా కోసమే

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించనున్నాం. ఓటర్ల జాబితా కచ్చితత్వం, సమగ్రత, స్వచ్ఛీకరణకు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన చర్యలలో భాగంగా జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతోంది.

- విజయకుమార్, డీఆర్వో

జడ్పీ స్టాండింగ్ కమిటీలో సభ్యుల ఏకరువు

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేయండి!



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదకిన అభివృద్ధి చేయాలని జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు కోరారు. మంగళవారం నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏడు స్థాయిసంఘాలకు సంబంధించిన అభివృద్ధి పనులు. విద్య, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, స్త్రీ శిశు సంక్షేమ శాఖలపై సభ్యులు సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో పొదలకూరు రోడ్డులో నిర్మిస్తున్న నైపుణ్య శిక్షణ కార్యాలయ భవన నిర్మాణాన్ని 15 రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, వెంకట్రావు తదితరులు మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాత ప్రతిపాదనల నివేదికలతోనే సమావేశానికి వచ్చారని, వాటిపై ఎన్నిసార్లు సమీక్షిస్తామని ప్రశ్నించారు. దీంతో తాజా నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. అలాగే వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల ప్రతిపాదనలను జిల్లాపరిషత్‌కి అందించలేదని సభ్యులు తెలపడంతో ఉన్నతాధికారులకు పంపామని అవసరమైతే మరో కాపీని జడ్పీకి పంపుతామని అధికారులు తెలిపారు. 80శాతం పూర్తయిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల భవనాలను పూర్తి చేయకుండా నిరుపయోగంగా ఉంచడం ఏమిటని సభ్యులు ప్రశ్నించడంతో ప్రభుత్వ ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పథకాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయని, సభ్యులు తెలపటంతో వాటిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి శుభ్రం చేస్తామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి, డీప్యూటీ సీఈవో మోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

కళాకారులకు ఉడ్ సరఫరాకు చర్యలు

● విశ్రాంత సీసీఎఫ్ జేఎస్ఎన్ మూర్తి

ఉదయగిరి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉదయగిరి చెక్క నగిషీ కేంద్రంలో కళాకారులు తయారు చేసే చెక్కనగిషీ వస్తువులకు సంబంధించిన ఉడ్‌ను సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు విశ్రాంత సీసీఎఫ్ జేఎస్ఎన్ మూర్తి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా అటవీ శాఖాధికారి మహబూబ్‌బాషాతో కలిసి ఉదయగిరి పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధి చెక్కనగిషీ కేంద్రంలో కళాకారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వస్తువుల తయారీకి కర్ర ఎక్కడ నుంచి తెస్తున్నారు, కొరత ఏమైనా ఉందా, కర్ర తెప్పించేందుకు ఎంత ఖర్చవుతోంది, ప్రభుత్వం మీకు ఏ విధంగా సహాయం అందించాలి తదితర విషయాలను కళాకారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కర్రతో బొమ్మలు, చెక్కనగిషీ, ఇతరత్రా వస్తువులు తయారు చేస్తారన్నారు. కళాకారులకు వస్తువులు తయారు చేసేందుకు తగినంత ఉడ్ సరఫరా లేక కళను వదిలేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. వారికి తగిన సహాయ సహకారాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అందులో భాగంగా అటవీ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు కళాకారులు తయారు చేసే కర్ర కొరత లేకుం డా అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు. ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రంలో పలు రకాల వస్తువుల తయారీకి కలివి, వేప, బిల్లనెర్రి, నెర్ది కర్రను అధికంగా ఉపయోగిస్తున్నారన్నారు. వాటిని రిజర్వు ఫారెస్టుతోపాటు రైతుల పొలాల నుంచి సేకరిస్తున్నారన్నారు. అటవీ ప్రాంతం నుంచి ఆయా చెట్ల కర్రను తరలిస్తే భవిష్యత్తులో ఆయా జాతులు అంతరించే ప్రమాదముందన్నారు. అలా కాకుండా కళాకారులు తయారు చేసే చెక్కనగిషీ వస్తువులకు సంబంధించి ఏడాదికి ఎంత కర్ర అవసరమవుతుందని తెలుసుకుని అందుకు అనుగుణంగా అటవీ శాఖ ద్వారా ఉడ్ బ్యాంకు ఏర్పాటు చేసి ఆయా జాతుల మొక్కలను పెంచి వారికి సరఫరా చేసేందుకు వివరాలు సేకరించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందన్నారు. అనంతరం కళాకారులు తయారు చేసిన చెక్కనగిషీ వస్తువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో శ్రీకాంత్‌రెడ్డి, రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా, డీఆర్వో మురళి, ఎఫ్ఎస్‌వో చిన వెంకటయ్య,ఎఫ్‌బీవోలు వెంకటేశ్వర్లు, ప్రసాద్, కేంద్రం నిర్వాహకులు గౌసియాబేగం, కళాకారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత సీసీఎఫ్ జేఎస్ఎన్ మూర్తి

ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజులు చెల్లించాలి

నెల్లూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) నిర్వహించే టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ఫీజులను డిసెంబరు 10వతేదీ లోపల చెల్లించాలని డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఫీజులను ఏపీఆన్‌లైన్‌లోగానీ, ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా నేరుగాగానీ చెల్లించవచ్చని పేర్కొన్నారు. టెన్త్ ఒక సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ థియరీ సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్స్‌కు రూ.100 చొప్పున ఫీజులు చెల్లించాలన్నారు. అలాగే బెటర్‌మెంట్ రాసే విద్యార్థులకు ఇంటర్ ఒక సబ్జెక్టుకు రూ.250, ప్రాక్టికల్స్‌కు రూ.100 చెల్లించాలన్నారు. ఇంప్రూమెంట్ రాసే టెన్త్ విద్యార్థులు ఒక సబ్జెక్టుకు రూ.200 లు, ఇంటర్ ఒక సబ్జెక్టుకు రూ.300, ప్రాక్టికల్ ఒక సబ్జెక్టుకు రూ.100 వంతున చెల్లించాలన్నారు. టెన్త్ తత్కాల్‌లో రూ.500, ఇంటర్‌కు తత్కాల్‌లో రూ.1000 ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. అభ్యాసకులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా డిసెంబరు 1 నుంచి 10వతేదీ లోపల చెల్లించవచ్చని, రూ.25 అపరాధ రుసుముతో 12వతేదీ వరకు, రూ.50 అపరాధ రుసుముతో 15వ తేదీ లోపల చెల్లించాలన్నా రు. పూర్తి వివరాలకు సమీపంలోని ఓపెన్ స్కూల్స్ కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

తిరుపతిలో సంస్కృత ప్రాంతీయ కార్యాలయం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సంస్కృత భాష పరిరక్షణ కోసం తిరుపతిలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ తెలు గు, సంస్కృతం అకాడమీ అధ్యక్షుడు ఆర్డీ విల్సన్ తెలిపారు. మంగళవారం ఆయనను నెల్లూరులో పలువురు రచయితలు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ అకాడమీ ఆధ్వర్యంలో గతంలో వస్తున్న పత్రికను పునరుద్ధరిస్తామని తెలిపారు. అందరితో కలిసి తెలుగుభాషా పరిరక్షణ కోసం కృషి చేస్తామన్నారు. తెలుగుజాతి అస్తిత్వం భాషా పరిరక్షణ ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో రచయితలు శరత్‌చంద్ర, పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న ఎంఎల్ఎస్ గోదాము తలుపులు

● నిల్వలు పరిశీలించిన అధికారులు

● బియ్యం స్వాహాపై పోలీసులకు ఫిర్యాదు

● సమగ్రంగా ఇవ్వాలన్న పోలీసులు



ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములో నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

ఉదయగిరి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరిలో సీజ్ చేసిన ఎంఎల్ఎస్ గోదాము తలుపులను పౌరసరఫరాల శాఖ అధికారులు మంగళవారం తెరిచి నిల్వలను పరిశీలించారు. ఈ నెల 21వ తేదీ అర్ధరాత్రి గోదాములో అధికారులు పరిశీలించ గా, బియ్యం నిల్వలు, రికార్డుల్లో ఉన్న నిల్వలకు భారీస్థాయిలో తేడా ఉన్నట్లు గుర్తించారు. సుమారు 4,250 బస్తాల బియ్యం స్వాహాకి గురైనట్లు నిర్ధారించి గోదామును సీజ్ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పౌరసరఫరాల శాఖ ఏఎంటీ లక్ష్మీనారాయణ, సీఎస్ డీటీ పవన్‌లు బియ్యం స్వాహా, గోదాములో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై ఫిర్యాదు చేసేందుకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే, సమగ్ర వివరాలు, శాఖ పరమైన విచారణ నివేదిక లేకుండా ఫిర్యా దు చేయడంతో పోలీసులు ఫిర్యాదు తీసుకునేందుకు నిరాకరించారు. ఎప్పటి నుంచి బియ్యం నిల్వల్లో తేడాలు ఉన్నాయి, ఇందు లో ఎవరెవరి హస్తం ఉంది తదితర వివరాలతో సమగ్ర నివేదికతో ఫిర్యాదు ఇవ్వాలని పోలీసులు అధికారులకు సూచించారు. అయితే ఆ వివరాలన్నీ సమగ్రంగా లేకపోవడంతో వారు పోలీస్‌స్టేషన్ నుంచి వెనుతిరిగారు.

● సూత్రధారులెవరో తేలేనా!?

ఉదయగిరి ఎంఎల్ఎస్ పాయింట్‌లో 4,250 బియ్యం బస్తాలు పక్కదారి పట్టడంలో సూత్రధారులెవరో.. పాత్రధారులెవరో తేలేనా అని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలో ఈ పాయింట్ నుంచి అక్రమంగా బియ్యం రవాణా చేస్తూ పట్టుబడిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఆ సమయంలో ఆ శాఖాధికారులు మామూళ్ల మత్తులో జోగి విచారణను నీరుగార్చిన సంఘటనలు సైతం ఉన్నాయి. ఈ నేపథ్యంలో బియ్యం స్వాహాపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గోదాములో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఇంతటి స్వాహా చేపట్టే ధైర్యం లేదు. దీని వెనుక కొంతమంది పెద్దల హస్తం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. అయితే తమను ఇబ్బందులకు గురి చేస్తే బియ్యం స్వాహా చేసిన వారి వివరాలు బయట పెడతామని గోదాము సిబ్బంది హెచ్చరిస్తున్నట్లు సమాచారం. దీంతో అసలు స్వాహారాయుళ్లు ఎక్కడ తమ గుట్టురట్టవుతుందోనని లోలోన మదనపడుతూ విచారణ నీరుగార్చేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	117
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 660

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి

వలేటివారిపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏపీఎం శ్రీనివాసులు తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు జాతీయ ప్రచారం జెండర్ సమానత్వం కోసం కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ అన్ని రంగాల్లో పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కు కలిగి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌రావు, ఏపీవో దయాసాగర్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభ్యసన కిట్లు అందజేత

వలేటివారిపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లె ఎంపీపీ స్కూల్‌లోని విద్యార్థులకు ఆటల ద్వారా అభ్యసనం కిట్లను డైట్ పరిశీలకుడు సంగా మహేంద్ర మంగళవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ కిట్ల ద్వారా ప్రాథమిక తరగతుల భాష, గణితం సులభ స్థాయిలో విద్యార్థులు అభ్యసనం పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సుజాత, రజిత, హనుమంతరావు, వెంకట్రావు, శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతులు లేని ఇళ్లల్లో చేర్చేదెలా?

- పెరుగుతున్న ప్రభుత్వం ఒత్తిడి
- ముందుకు రాని లబ్ధిదారులు
- టిడ్కో గృహాల కేటాయింపు ప్రశ్నార్థకం
- అధికారులు సతమతం

కావలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి పేదవాడికి సొంతింటి కల నిజం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం తొలివిడతగా టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించి వాటిలో చేర్చాలని అధికారులపై ఒత్తిడి తెస్తోంది. అయితే కనీస మౌలిక వసతులు లేక అందులో చేరేందుకు లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో అధికారులు సతమతం అవుతున్నారు. వివరాల మేరకు.. కావలి పట్టణం మద్దూరుపాడులో 2112 టిడ్కో గృహాలను గతంలో అప్పటి టీడీపీ హయాంలో నిర్మించగా ఇప్పటికీ వాటిల్లో కేవలం 350 ఇళ్లల్లో మాత్రమే నివాసాలు ఉంటున్నారు. వారు కూడా ఇక్కడ తాము ఉండలేమని లబోదిబోమంటున్నారు. టిడ్కో గృహాలు చెరువు లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షాకాలం పూర్తిగా మునకకు గురై ఇళ్లల్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు చుట్టూ ప్రహరీ లేకపోవడం ముళ్లచెట్లు, పిచ్చిచెట్లు గడ్డితో ఉండడంతో విషసర్పాలు తిరుగుతున్నాయనే భయాందోళనలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టిడ్కో ఇళ్లలో లబ్ధిదారులను చేర్పించటం అధికారులకు తలకు మించిన భారంగా మారింది. ప్రస్తుతం నివాసం ఉంటున్న వారు కూడా నిత్యం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి వద్దకు వెళ్లి వసతులు సమకూర్చనదే తాము ఉండలేమని చెబుతున్నారు. దీంతో ఎమ్మెల్యే కూడా అక్కడ కనీస వసతులు సమకూర్చే వరకు ఎవరిని చేర్చవద్దని అధికారులకు సూచిస్తున్నారు. అయితే ఉన్నతాధికారులు మాత్రం టిడ్కో ఇళ్లలో పూర్తి స్థాయిలో లబ్ధిదారులను చేర్చి పేదోళ్ల సొంతింటి కలను నెరవేర్చాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.


మద్దూరుపాడులోని టిడ్కో గృహాలు

● 2112కి 350 ఇళ్లల్లోనే నివాసం

టిడ్కో గృహాలను మూడు కేటగిరిల కింద విభజించి 300 చ.అ లలో 704, 365 చ.అ లలో 864, 430 చ.అ లలో 544 ఇళ్లు వంతున 2112 ఇళ్లు నిర్మించారు. వాటిని గత తెలుగుదేశం ప్రభుత్వంలోనే అందరికీ కేటాయించగా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాజకీయం చేసి చాలా టిడ్కో ఇళ్ల కేటాయింపులను గందరగోళం చేసింది. దీనికి తోడు గతంలో అక్కడ ఆగిపోయి ఉన్న మైనర్ వర్క్‌లను కూడా పూర్తిగా వదిలివేయడంతో ఆ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లు పక్కన పడేశారు. అయితే మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిపై దృష్టి పెట్టగా అప్పటికే చాలా మందికి 60 ఏళ్ల వయస్సు దాటడంతో బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రాలేదు. మరికొందరికి వయస్సు ఉన్నా బ్యాంకు లావాదేవీలకు సిబిల్ స్కోర్ సరిగా లేదని చెప్పి బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడంలేదు. దీంతో అధికారులు పూర్తి సొమ్ము చెల్లిస్తే ఇళ్లు మీకు రిజిస్టర్ చేస్తామని చెబుతున్నారు. అయితే అక్కడ కనీస వసతులు లేక వర్షం వస్తే మునకకు గురవుతుండటంతో పూర్తి డబ్బులు చెల్లించేందుకు లబ్ధిదారులు ఎవరూ ముందుకు రావడంలేదు. ఇప్పటి వరకు బ్యాంకు రుణాలతో 1408 ఇళ్లు రిజిస్టర్లు అవ్వగా వాటిల్లో 1224 ఇళ్లకు సంబంధించిన తాళాలను కూడా లబ్ధిదారులకు అప్పగించారు. వారిలో 422 మంది ఇళ్లలో చేరగా అక్కడ వసతులు లేమి కారణంగా వారిలో 350 మంది మాత్రమే అతికష్టం మీద నివాసం ఉంటున్నారు. ఈ పరిస్థితులలో టిడ్కో గృహాలలో పూర్తి స్థాయిలో లబ్ధిదాలను చేర్చే విషయం అధికారులకు తలనొప్పిగా తయారైంది. అక్కడ నివాసయోగ్యంగా అవసరమైన వసతులు సమకూరే వరకు టిడ్కో గృహాల్లోకి వచ్చేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. దీంతో అక్కడ కనీస వసతులు ఎప్పుడు సమకూరుతాయో, లబ్ధిదారులు ముందుకు వస్తారా, రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు సహకరిస్తారా, ప్రభుత్వ ఒత్తిడి నుంచి తాము బయటపడతామోనన్న విషయం అధికారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ


పడిపూజ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు

బిట్రగుంట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలో పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం అయ్యప్ప స్వామి పడిపూజా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వాములు గణాది బాబురావుస్వామి, సూరపనేని శివరామకృష్ణస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజకు అయ్యప్ప స్వామి మాలధార భక్తులతో పాటు శివమాలధార భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మునగాల జనార్దన్‌రెడ్డి, పసుపులేటి సుబ్బారావు, గంజి వెంకటేశ్వర్లు, కడియాల వెంకయ్య, పసుపు లేటి రఘు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష తగదు : ఏపీఎం

కొండాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలపై వివక్ష చూపకూడదని ఏపీఎం కాంతారావు పేర్కొన్నారు. కొండాపురంలో మంగళవారం జెండర్ వివక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత విద్య, ఉద్యోగాలలో సమాన అవకాశాలు పొందేలా బాలికలను ప్రోత్సహించడం, మహిళలకు పురుషులతోపాటు సమాన వేతనం, హింస నుంచి బయటపడిన మహిళలు, ఒంటరి మహిళలకు ఆర్థిక, వ్యక్తిగత మద్దతు అందిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, టీడీపీ మండల కన్వీనర్ పోలినేని చంద్రబాబునాయుడు, గుడవళ్లూరు సర్పంచు మాచర్ల, జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాధాక్రిష్ణ, ఏపీవో మురళీధరరావు పాల్గొన్నారు.

స్త్రీల రక్షణ చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్త్రీలకు రక్షణగా రూపొందించిన చట్టాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని న్యాయవాదులు వీ.వసంతలక్ష్మి, ఎం.మనోహర్‌లు కోరారు. అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయవాదులు మాట్లాడుతూ గృహహింస, దాడులు అన్నిటికీ ప్రత్యేక రక్షణచట్టాలు ఉన్నాయని వివరించారు. సమాజంలో మహిళల పట్ల గౌరవం కలిగి ఉండాలని తెలిపారు. సీడీపీఓ ఉషారాణి, సూపరింటెండెంట్ ఎస్కే షకీలా పాల్గొన్నారు.

విచారణ నిష్పక్షపాతంగా చేయాలి

లింగసముద్రం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రారంభమైన సోషల్ ఆడిట్ విచారణను ఎస్‌ఆర్‌పీ, డీఆర్‌పీలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఉపాధి హామీ పథకం కందుకూరు ఏపీడీ ఎం.శ్రీనివాసులు చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని ఉపాధి హామీ గదిలో అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ తనిఖీలు గతంలో మాదిరిగా అన్ని పంచాయతీల్లో ఒకేసారి విచారణ జగరదని చెప్పారు. రెండు పంచాయతీలకు ఒకసారి, అవి ముగిసిన తరువాత మరో రెండు పంచాయతీలలో విచారణ జరుగుతుందన్నారు. ఈ విధంగా మండలంలోని 16 పంచాయతీలలో విచారణ పూర్తి చేసిన అనంతరం జనవరి నెలలోగా సోషల్ ఆడిట్ ప్రజావేదికను నిర్వహించి, విచారణ నివేదికను బహిర్గతం చేస్తామన్నారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి నెల 31వ తేదీ వరకు మండలంలో రూ9.75 కోట్లకు పనులు జరిగాయని తెలిపారు. వీటన్నింటిపై విచారణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో షేక్ సమీర్‌బాషా, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాసులు

రూ.143 కోట్లతో పట్టణాభివృద్ధి

● 10వ వార్డులో ఇంటింటికి టీడీపీలో ఎమ్మెల్యే

కావలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణాభివృద్ధికి రూ.143 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఇందులో తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చామని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఆయన పట్టణంలోని 10వ వార్డులో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. వారులో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని సత్వర పరిష్కారంలో భాగంగా సమస్య మీది పరిష్కారం మాది అంటూ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచేందుకు రూ.80 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేయగా రూ.32 కోట్లు మంజూరయ్యాయన్నారు. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు రూ.43 కోట్లు మంజూరయ్యాయన్నారు. పైపులైన్లు మరమ్మతులకు రూ.7 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మౌలిక వసతులకు రూ.75 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, నాయకులు జీ.కిషోర్, జ్యోతి బాబూరావు, మధుబాబు నాయుడు, షేక్ మస్తాన్, సుకుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

రెడ్‌క్రాస్‌కు సహకరిస్తున్న వైద్యులకు సత్కారం


వైద్యులను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ తలసేమియా కేర్ సెంటర్ బాధిత చిన్నారులకు పట్టణంలోని ప్రముఖ వైద్యులు స్వచ్ఛందంగా, ఉచితంగా సేవలు అందిస్తున్నారని కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు బెజవాడ రవికుమార్ తెలిపారు. రెడ్‌క్రాస్ డేకేర్ సెంటర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ అల్లం శ్రీనివాసులు, డాక్టర్ పీ. శివప్రసాద్, డాక్టర్ వీ గోపీలను సత్కరించారు. రక్తమార్పిడి చేయించుకున్న చిన్నారులకు పౌష్టికాహారం, మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు డీ.రవిప్రకాష్, కే.హరినారప రెడ్డి, బీఎస్ ప్రసాద్, బార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా గురించి ఆందోళన వద్దు

అల్లూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో వరిసాగు చేసే రైతులు యూరియా కోసం ఆందోళన చెందవలసిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ యూరియా కొరత ఏర్పడుతుందని ఇటీవల ఒక అపోహ రైతులను ఆందోళనకు గురిచేస్తుందన్నారు. యూరియా గురించి రైతులు పూర్తిగా అపోహలు వీడి వ్యవసాయ పనులను నిశ్చింతగా చేసుకోవాలన్నారు. సాగుకు సరిపడా యూరియా అందుబాటులలో ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఏ రైతుకైనా యూరియా పంపిణీ కార్డులు ఇవ్వడంతోపాటు అవసరమైనంత మేరకు ఎకరానికి 3 బస్తాల యూరియా ఇస్తామన్నారు.

కావలి ఏఎంసీ కార్యవర్గ తొలి సమావేశం

కావలి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కావలి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గ తొలి సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య అధ్యక్షతన ఏఎంసీ కార్యాలయంలో జరిగింది. ముందుగా నూతన పాలకవర్గంకు సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కావలి రైతుబజారు అభివృద్ధికి రూ.55 లక్షలు, మార్కెట్ కమిటీ కార్యాలయం, గోదాముల నిర్వహణకు రూ.96 లక్షలు, గ్రామాలలో రైతుల పొలాల్లోకి గ్రావెల్ రోడ్లు వేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వాటిని తీర్మానించారు. మద్దూరుపాడు మార్కెట్ యార్డు ఆవరణలో భూసార పరీక్ష కేంద్రం, నీటి పరీక్ష కేంద్రం, పశువుల వైద్యపరీక్షలకు అవసరమైన బోనులు ఏర్పాటు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 262 మంది ఎంపిక

కావలి(టౌన్), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 262మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. ఈ మేళాలో 16 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు ఆయా కంపెనీలకు చెందిన ప్రతినిధులు నియామక పత్రాలను ఎమ్మెస్సార్ కరస్పాండెంట్ రాజ్‌కుమార్ చౌదరి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూమ్‌ల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడీఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా

కావలిరూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో మద్యం సేవించి బైకులు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ రాజేశ్వరరావు తెలిపారు. వారిని పట్టణంలోని ప్రిన్సిపల్ సివిల్ కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.10,000 జరిమానా విధించినట్లు తెలిపారు.

ముందరపొట్టెమ్మకు వైసీపీ నేతల పూజలు

కావలి రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ఆరోగ్యం కుదుట పడాలని మండల వైసీపీ నాయకులు మంగళవారం ముందరపొట్టెమ్మ, గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ ఆలూరు కొండమ్మ, జడ్పీటీసీ జంపాని రాఘవులు, ఏఎంసీ మాజీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌ల ఆధ్వర్యంలో 101 టెంకాయలు కొట్టారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

● **బిట్రగుంట** : బోగోలులోని విజయగణపతి ఆలయంలో వైసీపీ మండల కన్వీనర్ ఎం.వీరరఘు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు ప్రత్యేక పూజలు జరిపించారు. కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా తిరిగి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కీర్తన, ఎంపీటీసీలు మద్దిబోయిన పద్మ, ఏకే సుందర్‌రాజ్, మాజీ ఎంపీపీ పీ.సులోచనమ్మ, నేతలు రమణయ్య మాచర్ల, సాల్మన్‌రాజ్, కళ్యాణ్‌కుమార్, సాగర్, నాయిబ్‌రసూల్, వరుణ్, సుధాకర్, జీ.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ

వలేటివారిపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళవళ్ల గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీవో శంకర్‌రావు తనిఖీ చేశారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్‌రావు మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నారాయణ పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

కావలి రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో మంగళవారం హెల్మెట్ వినియోగంపై ఆర్టీవో మురళీధర్ అవగాహన కల్పించారు. పాఠశాలల బస్‌లు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సుందర్‌రావు, అసిస్టెంట్ ఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీబాయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గుడ్లూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పూరేటిపల్లి (సీతారామపురం)లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రైతన్న - మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా ముందుగా రైతుల సంక్షేమం గురించి ఎక్కువగా ఆలోచిస్తుంటారన్నారు. గత వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీల నిధులు దారిమళ్లించడంతో గ్రామీణాభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందన్నారు. పూరేటిపల్లిలో అంటు వ్యాధులు రాకుండా పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరకొండపాడుకు రోడ్డును త్వరలో పూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా పైపులైన్ మరమ్మతుపనులు పూర్తిచేసి, ఇంటింటికి కుళాయి నీటిని అందిస్తామని తెలిపారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గ్రామానికి వాటర్ ప్లాంట్ మంజూరు చేసి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎల్. శ్రీనివాపులురెడ్డి, ఏవో రవికుమార్, ఏపీఎం చినబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, చిత్తారి మల్లికార్జున, ఉన్నం వెంటకటేశ్వర్లు, జనసేన మండల అధ్యక్షుడు సనిశెట్టి గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.


గుడ్లూరు:కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

● **కావలి రూరల్** : రైతును రాజును చెయ్యాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆముదాలదిన్నెలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రైతుల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపే పంచసూత్రాల కరపత్రాలను వ్యవసాయ శాఖ ఏడీ నాగరాజు, ఏవో లలిత, రైతుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీడీవో శ్రీదేవి, ఏవో లలిత, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావ్, ఉప్పాల దినేష్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● **కొండాపురం** : కొండాపురంలో మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి టీడీపీ మండల కన్వీనర్ పోలినేని చంద్రబాబునాయుడు రైతన్నా-మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం రైతులకు అందచేస్తున్న పథకాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే ఆదిమూర్తిపురంలో సాగునీటి సంఘ అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసులు, తూర్పుఎర్రబల్లిలో టీడీపీ యువనాయకుడు బాలక్రిష్ణల ఆధ్వర్యంలో రైతన్నా-మీకోసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పోలినేని రమేష్, మండల తెలుగు యువత అధ్యక్షుడు దాసరి అశోక్, సర్పంచు మాచర్ల, నాయకులు నర్రా శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● **కలిగిరి** : మండలంలోని జిర్రావారిపాలెంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి పాల్గొని కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎస్‌కే జహీర్, ఏఈవో చిరంజీవి, నాయకులు జిర్రా పెద్దఅంకిరెడ్డి, జిర్రా మూడవ అంకిరెడ్డి, కొప్పోలు కొండలరావు, బత్తల రాజయ్య, వీఏఏ నిఖిత, ఏహెచ్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

● **ఉదయగిరి** : మండలంలోని కుర్రపల్లి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సాగులో సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యం, విత్తనశుద్ధి, పంట మార్పిడి, ప్రకృతి వ్యవసాయం తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ నేత సుందరయ్య సస్పెన్షన్‌పై నిరసన

కావలి(టౌన్), నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా మంగళవారం డిపో వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏలూరు ప్రజా రవాణాధికారి కార్యాలయం ఆడిట్ సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుందరయ్యకు ఏలూరు డిపో పెట్రోల్ పాయింట్‌లో జరిగిన అవినీతిలో ఎటువంటి సంబంధం లేకపోయినప్పటికీ ఆయనను అక్రమంగా సస్పెండ్ చేయడం కేవలం కక్ష పూరిత చర్యేనన్నారు. సుందరయ్యతో పాటు మరో ముగ్గురు ఉద్యోగులను బాధ్యులు చేస్తూ సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. వారిపై సస్పెన్షన్ ఎత్తివేసి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అనంతరం డీఎంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో అధ్యక్షుడు వీవీ రెడ్డి, నాయకులు షేక్ కాలేషా, అల్లాబాషా, మురళి, మస్తాన్‌బాషా, మోహనరావు, మునీర్, ఖాజామొహిద్దీన్, మాతయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

కందుకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): లింగసముద్రం మండలం పెంట్రాలకు చెందిన పలు కుటుంబాల వారు వైసీపీని వీడి మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన మన్నేపల్లి రమేష్, సురేష్, మేలింగి తిరుపాలు, తాళ్లూరి మాలకొండయ్య, మన్నేపల్లి నాగేశ్వరరావు, మన్నేపల్లి ప్రసంగి, ఇంద్రకంటి రమేష్, నూకతోటి అలరాజు, జనంగుల ఆంజనేయులు, మన్నేపల్లి ధనుష్, మన్నేపల్లి లక్ష్మీనరసయ్య తదితరులకు స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

పొగాకు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

వలేటివారిపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : పొగాకు సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని కందుకూరు పొగాకు బోర్డు రెండవ వేలం కేంద్రం నిర్వాహణాదికారి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని అయ్యవారిపల్లెలో మంగళవారం పొగాకు సాగు యాజమాన్య శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ రాజ్‌గోపాల్, ఐటీసీ మేనేజరు గోలి వెంకటేష్, జీపీఐ మేనేజరు ఉన్నం శ్రీనివాస్, క్షేత్ర సాంకేతిక సహాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌ఆర్‌లో అమృత యూనివర్సిటీ వర్చువల్ వర్క్‌షాప్

కందుకూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కోయంబత్తూర్‌లోని అమృత విశ్వవిద్యాపీఠం సౌజన్యంతో మంగళవారం వర్చువల్ లేబరేటరీ ప్రయోగాల వర్క్‌షాప్ నిర్వహించారు. అమృత విశ్వవిద్యాపీఠం ప్రొఫెషర్ పీఎఫ్ సనీష్, రీసెర్చ్ అసోసియేట్ ఎన్.నిజిన్‌ల ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహించగా టీఆర్‌ఆర్ కళాశాల భౌతిక, రసాయన, జంతు, వృక్షశాస్త్ర విద్యార్థినీ విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ప్రాక్టికల్స్‌ను సులువైన పద్ధతిలో నేర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయాలి

అల్లూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 30న నియోజకవరస్థాయిలో కావలిలో నిర్వహించే ఆటల పోటీలకు విద్యార్థులను యాజమాన్యాలు సిద్ధం చేయాలని ప్రైవేటు పాఠశాలల స్టేట్ సీనియర్ ఉపాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని నార్తు ఆములూరు గొల్లపాలెం ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ప్రైవేటు పాఠ శాలల కరెస్పాండెంట్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నేలనూతల శ్రీధర్, మనోహర్ రెడ్డి, శ్రీనివాసరావు, గోపాల్ రెడ్డి, రాధాకృష్ణ, మజహర్ పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలపై పోరాటం

దగదర్తి(బిట్రగుంట) నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు తమ సమస్యలను తెలియచేస్తే పరిష్కారానికి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీ సీహెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చీదర్ల మల్లికార్జున అన్నారు. దగదర్తి మండలం సున్నపుబట్టి సెంటర్లో ఫోరం లీడర్స్ మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా హనుమారెడ్డి, రాష్ట్ర మహిళా లీడర్ బెల్లంకొండ మమూల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, గోపి, సురేష్, పానేటి నాగరాజు, సయ్యద్ అక్బర్, రమాదేవి, రాగయ్య, పాల్గొన్నారు. అనంతరం కోవూరుపల్లి పీహెచ్‌సీని సందర్శించారు.

ప్రీ క్రిస్మస్ వేడుకలు

అల్లూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ నెలారంభం కావడంతో అల్లూరు పట్టణ పరిధిలోని యేసు అభిషేక మినిస్ట్రీస్ చర్చిలో మంగళవారం రాత్రి ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చర్చి వ్యవస్థాపకుడు దేవరకొండ శ్యామియేలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక క్రైస్తవులు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

(5వ పేజీ తరువాయి)

కనెక్టివిటీ కలిగి పర్యాటకులు ఆకర్షితులవుతారని తెలిపారు.

● మన చారిత్రాత్మక వారసత్వ సంపద వృద్ధిలో భాగంగా ఉదయగిరి హిల్ ఫోర్ట్, నరసింహ స్వామి దేవాలయ అభివృద్ధి కోసం రూ.36.50 కోట్లు, ఉదయగిరిలోని రంగనాయకుల దేవాలయం అభివృద్ధికి రూ.13.25 కోట్లు, శ్రీకృష్ణదేవాలయ అభివృద్ధికి రూ.2.45కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు చెప్పారు. బుచ్చిరెడ్డిపాలెం వద్ద కురుగుండ కనిగిరి రిజర్వాయర్ పర్యాటక కేంద్రం అభివృద్ధికి రూ.22.32 కోట్లు, పెంచలకోనలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధి కోసం రూ.20.62 కోట్లతో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు చెప్పారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ద్వారా కేంద్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలో టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధి పనులు మొదలు పెట్టేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి లక్ష్మీనరసింహరావు, జిల్లా అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ సభ్యుడు పెనుబల్లి కృష్ణచైతన్య, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఇందుకూరుపేట తహసీల్దారు మురళీ, తదితరులు పాల్గొన్నారు.